అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 24-01-2019 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 26 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

SHRIRAM CITY
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి ఫోన్: 040-30915112 లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచిని
www.shriramcity.in


రాజకీయాల్లోకి ప్రియాంక

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా.. యూపీ(తూర్పు) ఇన్‌చార్జిగా బాధ్యతలు





వివరాలు 9లో



క్రియాశీల రాజకీయాల్లోకి ప్రియాంక గాంధీ.

డాక్టర్ సదువుల దౌడ్

వైద్యవిద్య కోసం విదేశాలకు..



- రాష్ట్రం నుంచి ఏటా 3 వేల మందికిపైగా పయనం
- అయినా దక్కని ఫలితం.. 'ఎగ్జిట్' వద్దే ఆగుతున్న వైనం
- ఏండ్ల తరబడి శ్రమించినా డాక్టర్ కాలేక విద్యార్థుల్లో నైరాశ్యం
- గతేడాది విదేశాల్లో చదివిన భారతీయులు 17,504 మంది



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ కావడం కోసం భారత్ నుంచి విదేశాలకు వెళ్లే అభ్యర్థుల సంఖ్య ఏటేటా పెరుగుతున్నది. అక్కడ వైద్యవిద్య పూర్తి చేసినా స్వదేశంలో మాత్రం డాక్టర్లు కాలేకపోతున్నారు. మన దేశంలో నిర్వహించే ఎగ్జిట్ ఎగ్జామ్‌లో పాస్ కాలేకపోవడమే ఇందుక్కారణం. దీంతో లక్షలు ఖర్చు చేసినా ఫలితం దక్కకపోవడంతో ఇష్టం లేకున్నా ఇతర రంగాల వైపు వారు దృష్టిసారిస్తున్నారు. మన దేశంలో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష పోటీని తట్టుకోలేకపోవడం, వైద్య కళాశాలలు, సీట్లు తక్కువగా ఉండటం, యాజమాన్య కోటా సీట్లకు ఫీజు లక్షల్లో ఉండటం, ప్రవేశపరీక్ష పోటీని తట్టుకోలేపోతున్న అభ్యర్థులు కోకొల్లలు. ఫలితంగా లక్షలాది రూపాయలు ధారపోసి చైనా, కజకిస్థాన్, రష్యా, ఫిలిప్పీన్స్, యూఎస్, యూకే, ఉక్రెయిన్,



ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, హాంకాంగ్, సింగపూర్, న్యూజిలాండ్, ఐర్లాండ్ తదితర దేశాలకు వైద్యవిద్యను చదివేందుకు వెళుతున్నారు. గతేడాది భారత్ నుంచి 17,500 మంది వివిధ యూనివర్శిటీల్లో వైద్యవిద్యలో చేరడం విశేషం. ఈ ఏడాది మేలో జరిగే నీట్ పరీక్షకు 2 లక్షలకు పైగా అదనంగా హాజరవుతారని అంచనా. అంటే గతేడాది కంటే నీట్ అభ్యర్థుల సంఖ్య 14.4 శాతం పెరగనుంది. గతేడాది 13,26,725 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఫలితంగా ఒక్కమార్కు తేడాతో వందలాది ర్యాంకులు దిగజారిపోయే ప్రమాదం ఏర్పడింది. పోటీపడుతున్న అభ్యర్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా ...9లో

వైద్యవిద్య కోసం విదేశాలకు వెళ్లిన అభ్యర్థులు

విద్యా సంవత్సరం	సంఖ్య
2015-16	8,386
2016-17	8,787
2017-18	14,118
2018-19	17,500



ఆగని పెట్రో కుమ్ముడు

ఇప్పటికే లీటరు డీజిల్‌పై రూ. 3.53, పెట్రోల్‌పై రూ.2.79లు పెంపు

- మరోసారి పెంచిన ఆయిల్ కంపెనీలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పెట్రో ఉత్పత్తుల ధరలపై పెంపు క్రమంగా కొనసాగుతోంది. ఈనెల 10 నుంచి వరుసగా పెరుగుతున్న చమురు ఉత్పత్తుల ధరలు.. బుధవారం అదే ...9లో

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
39 YEARS Safeguarding Trust
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

ఒకరి ప్రాణాలకు మరొకరు

డ్యూటీలో ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు

రోడ్డు పక్కన బస్సు నిలిపివేత..

- అతనికి ప్రాణం పోసిన ప్రయాణికులు

నవతెలంగాణ-పెద్దపల్లి

బస్సు నడుపుతున్న సమయంలో గుండెపోటు వచ్చిన ఆర్టీసీ డ్రైవర్ నొప్పిని బిగబట్టుకుని ప్రయాణికుల ప్రాణాలను కాపాడితే.. అతని ప్రాణాలను ప్రయాణికులు కాపాడారు. బస్సును రోడ్డు పక్కకు ఆపి స్టీరింగ్‌పై కుప్పకూలిన ...9లో



అలా రిజర్వేషన్లు ప్రతిపాదించలేదు

ఆర్థికవెనుకబాటు ప్రాతిపదిక కాదు : సిన్హో కమిషన్

- రాష్ట్రాల అభిప్రాయమూ అదే..
- కమిషన్ ప్రతిపాదన చేసిదంటూ చట్టాన్ని తెచ్చిన మోడీ సర్కార్
- ఎన్నికల్లో లబ్ధికోసమే ఇదంతా : రాజకీయ, న్యాయ విశ్లేషకులు

వివరాలు 9లో





తండ్రి ఆస్తిలో హక్కు

మతాంతర వివాహం అసాధారణం..

- సంతానం చట్టబద్ధమే : సుప్రీం కోర్టు

వివరాలు 2లో

రోడ్డెక్కిన రక్షణ శాఖ..

కార్మికుల సమ్మె షురూ..



- తొలి రోజు జయప్రదం
- మోడీ సర్కారు తీరుపై ఆగ్రహం
- ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ప్రయివేటీకరణకు యత్నం : కార్మిక సంఘాల ఆరోపణ

న్యూఢిల్లీ: దేశ చరిత్రలో తొలిసారి రక్షణ రంగానికి చెందిన కార్మికులు రోడ్డెక్కారు. మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కదం తొక్కారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రయివేటు పరం చేయాలని చూస్తున్న సర్కారు కుట్రలను వెంటనే మానుకోవాలని ముక్తకంఠంతో నినదించాయి. మూడు రోజుల సమ్మెలో భాగంగా తొలిరోజైన బుధవారం సమ్మె విజయవంతమైంది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నాలుగు లక్షల మంది రక్షణ రంగ కార్మికులు బుధవారం నుంచి మూడు రోజుల పాటు సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సమ్మెలో భాగంగా తొలిరోజు ఢిల్లీ, కోల్‌కత, కాన్పూర్, జబల్‌పూర్, చెన్నై, ముంబయి, ఆగ్రా, హైదరాబాద్‌లతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ రంగ కార్మికులు విధులకు హాజరుకాలేదు.

41 ఆర్డినెన్స్, 52 డీఆర్‌డీవో సంస్థల కార్మికులతో పాటు నేవీ, త్రివిధ దళాలకు చెందిన ఆయుధాలు సరఫరా చేసే కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ప్రయివేటీకరణను అడ్డుకోవడం, ఈఎమ్ఈ స్టేషన్‌లను మూసివేసే ప్రక్రియను తక్షణమే విరమించుకోవడం, రక్షణ రంగంలో ఖాళీగా ఉన్న వేలాది ఉద్యోగాలను భర్తీ చేయాలనే ...9లో

విద్యాశాఖ ఫలితాల తీరుపై విస్మయం

ప్రమాణాల పెంపునకు ఎలాంటి చర్యలు చేపడతారు : హైకోర్టు

- సత్ఫలితాల సాధనకు ప్రత్యేక కమిటీని నియమించాలి : న్యాయవాది అర్జున్ సూచన



నవతెంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఫలితాల తీరుపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. విద్యా ప్రమాణాల పెంచడానికి తీసుకునే చర్యల్ని తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై పూర్తి స్థాయి ప్రతిపాదనలను ఈ నెల 25లోగా తమకు నివేదించాలని సూచించింది. విద్యా ప్రమాణాల పెంపునకు సీనియర్ ఉన్నతాధికారి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ...9లో

యాసంగి లక్ష్యం నెరవేరేనా..?

రిజర్వాయర్లలో నీటి కొరత

- మూడు ప్రాజెక్టుల కింద క్రాప్ హాలిడే
- ఎస్సారెస్పీ, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద ఆరుతడి పంటలే వేసుకోవాలన్న ప్రభుత్వం
- వరి పంటకే రైతుల మొగ్గు
- భూగర్భ జలాలపైనా ప్రభావం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వ తగ్గడంతో ఈ ప్రభావం యాసంగి పంటలపై పడే అవకాశం కనిపిస్తున్నది. ఫలితంగా వ్యవసాయ శాఖ నిర్దేశించిన పంటల లక్ష్యం నెరవేరుతుందా అనే ప్రశ్న ఉదయిస్తున్నది. రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి బేసిన్‌లలో యాసంగిలో ఆరుతడి పంటలనే పండించాలని ప్రభుత్వం ముందుగానే చెప్పినప్పటికీ రైతులు మాత్రం వరిపంటకే అధిక ప్రాధాన్యమిచ్చారు. గత నాలుగేండ్ల కాలంలో ఖరీఫ్ పంటల కాలం నాటికి రిజర్వాయర్లలో నీరు లేక పోవటంతో రబీ పంటకే నీరు వదులుతున్నారు. ఈ సంవత్సరం పరిస్థితి దీనికి భిన్నంగా ఉన్నది. కృష్ణా బేసిన్‌లోని జూరాల ప్రాజెక్టులో నీరు తగ్గుముఖం పట్టటంతో ఈ ప్రాజెక్టుపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలకు నీరు వదిలే పరిస్థితి లేదు. ఫలితంగా ఇప్పటికే వేసిన యాసంగి పంటలకు నీరివ్వలేమని అధికారులు తేల్చి చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో కూడా నీటి నిల్వ తగ్గిపోయింది. ఈ రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ కేవలం 55.67 టీఎంసీలు మాత్రమే ఉన్నది. గత సంవత్సరం ఈ రోజుకు శ్రీశైలం రిజర్వాయర్‌లో 120 టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో ఈ నీటిని యాసంగి పంటలకు ఏపీ వినియోగించుకున్నది. ప్రస్తుతం ...9లో



జేఎన్‌యూ దేశద్రోహం కేసు..

- న్యాయ సలహాలు కోరుతున్న ఢిల్లీ ప్రభుత్వం

న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (జేఎన్‌యూఎస్‌యూ) మాజీ అధ్యక్షుడు కన్నయ్య కుమార్‌పై దేశద్రోహం కేసులో నిందితులపై విచారణ చేపట్టేందుకు ఢిల్లీ ప్రభుత్వం న్యాయ సలహాలు కోరుతోంది. ఢిల్లీ ప్రభుత్వంతో పాటు ఢిల్లీ పోలీసులు కూడా న్యాయ సహాయం కోరుతున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మూడేండ్ల క్రితం జేఎన్‌యూలో చేపట్టిన ఓ ఊరేగింపులో కన్నయ్య కుమార్‌తో పాటు మరో తొమ్మిది మంది దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారని ఆరోపిస్తూ.. వారిపై దేశద్రోహం కేసు నమోదు చేస్తూ ఢిల్లీ పోలీసులు చార్జ్‌షీటు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసులో నిందితులను విచారించడానికి కోర్టు అనుమతించలేదు. దీంతో వారిని విచారించడానికి అనుమతిని కోరుతూ ప్రభుత్వం, పోలీసులు ప్రయత్నాలు చేపట్టారు.. నిబంధనల ప్రకారం.. విచారణ చేపట్టేందుకు గానూ ప్రభుత్వానికి మూడు నెలల సమయాన్ని కేటాయించవచ్చునని సమాచారం.

పూణె బాలుడి వినూత్న ఆవిష్కరణ



ముంబయి : మహారాష్ట్రలోని పూణెకు చెందిన 12 ఏండ్ల హాజిక్ ఖాజీ వినూత్న ఆవిష్కరణతో అబ్బుర పరిచాడు. సముద్రంలో కాలుష్యాన్ని తగ్గిస్తూ అందులోని జీవజాలాన్ని కాపాడటానికి 'ఎర్విన్' అనే పేరుతో ఓ నౌక డిజైన్‌ను రూపొందించాడు. పలు డాక్యుమెంటరీలు చూసి తాను ఈ పనికి సంకల్పించానని ఖాజీ చెప్పుకొచ్చాడు. ఈ నౌక సముద్రంలో సంచరిస్తూ అందులో ఉండే వ్యర్థాలను సంగ్రహిస్తుంది. అనంతరం దానిని ఐదు భాగాలుగా విడగొడుతుంది. శుద్ధి చేసిన జీవజలాన్ని తిరిగి సముద్రంలోకి పంపిస్తుంది. దీనిపై ఖాజీ మాట్లాడుతూ.. తాను పలు డాక్యుమెంటరీలను చూసి ఎర్విన్ డిజైన్‌ను రూపొందించానని అన్నాడు. మనం తరుచూ తినే చేపలు కూడా సముద్రంలో పారవేసిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తింటున్నాయని.. చేపలను తినడం వల్ల ఆ ప్లాస్టిక్ నేరుగా మన శరీరాల్లోకి వెళ్తుందని చెప్పాడు. దీనిని నివారించడమే గాక సముద్రంలో ఉండే జీవాలను కాపాడటానికి తనవంతుగా ఏదైనా చేయాలని సంకల్పించానని వివరించాడు. తనకు తొమ్మిదో ఏటే ఈ ఆలోచన వచ్చిందని, టెడ్ ఎక్స్, టెడ్ 8 వంటి పలు అంతర్జాతీయ వేదికలపై ఎర్విన్ గురించి వివరించినట్టు ఖాజీ తెలిపాడు. ఖాజీ ప్రస్తుతం సముద్ర జలాలలో ప్లాస్టిక్‌ను నివారించడానికి పనిచేస్తున్న పలు ఎన్జీవోలతో కలిసి పనిచేస్తున్నాడు.

తండ్రి ఆస్తిలో హక్కు

- మతాంతర వివాహం అసాధారణం..
  సంతానం చట్టబద్ధమే : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ముస్లిం పురుషుడు, హిందు మహిళల వివాహం అసాధారణమని, వారి సంతానం చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఇలాంటి దంపతులకు జన్మించిన పిల్లలకు తండ్రి ఆస్తిపై హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. అయితే సదరు మహిళ తన భర్తనుంచి భరణం పొందవచ్చును గానీ, ఆమెకు తన భర్త ఆస్తిపై హక్కు ఉండదని వివరించింది. ఎన్‌వి రమణ, మోహన్ ఎం శాంతనగౌదర్‌లతో కూడిన ధర్మాసనం.. ముస్లిం పురుషుడు, విగ్రహారాధన చేసే హిందు మహిళ మధ్య పెండ్లి అసాధరణమైనదని తెలిపింది. అయితే ఈ అసాధారణ దంపతుల పిల్లలు ఇతరుల్లాగే చట్టబద్ధమైనవారేనని తెలిపింది. ఇలాంటి దంపతులకు జన్మించిన షంషుద్దీన్, ఆయన బంధువులకు మధ్య తలెత్తిన ఆస్తివివాదంపై ట్రయల్ కోర్టు, కేరళ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ.. సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది.

త్రిపురలో లెనిన్ విగ్రహం ఆవిష్కరణ



అగర్తల : కమ్యూనిస్టు దిగ్గజం వ్లాదిమీర్ లెనిన్ విగ్రహాన్ని త్రిపురలో సీపీఐ(ఎం) ఆవిష్కరించింది. రాష్ట్రంలో హిందూత్వశక్తులు విగ్రహాలపై విధ్వంసకాండకు పాల్పడి 12 అడుగుల లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసిన రెండు నెలల తర్వాత.. ఆయన 95వ జయంతి సందర్భంగా సీపీఐ(ఎం) తిరునెల్‌వెల్లి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మంగళవారం ఆవిష్కరించారు. ఏడడుగుల పొడవైన ఫైబర్ గ్లాస్ విగ్రహాన్ని రష్యా విప్లవాన్ని స్మరించుకుంటూ మారుమోగిన నినాదాల నడుమ ఆవిష్కరణ జరిగింది. ప్రఖ్యాత కళాకారుడు, చెన్నైలోని ప్రభుత్వ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖరన్ ఈ విగ్రహాన్ని రూపొందించినట్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్ చెప్పారు. 'త్రిపురలో జరిగిన సంఘటనలతో మేం కలతకు గురయ్యాం. విగ్రహాలను కూల్చివేసి కమ్యూనిస్టుపార్టీ నాశనం చేయాలనుకోవడం అవివేకం' అని రామకృష్ణన్ అన్నారు. శ్రామికుల నుంచి సేకరించిన రూ. 4 లక్షల విరాళాలతో ఈ విగ్రహాన్ని తయారుచేసినట్టు చెప్పారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఐపీఎఫ్‌టీ కూటమి గెలుపొందడంతో విర్రవీగిన ఆ పార్టీల కార్యకర్తలు లెఫ్ట్ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకొని రాష్ట్రంలో విధ్వంసకాండకు పాల్పడిన విషయం తెలిసిందే.

గో రక్షకుల రాక్షసం

పశువుల వ్యాపారిని స్తంభానికి కట్టేసి.. రెండు గంటలపాటు విచక్షణారహిత దాడి

- ఆస్పత్రికి తీసుకెళ్లకుండా బేడీలతో స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- హర్యానాలో ఘటన



రోహ్‌తక్: గో రక్షకులు మరోసారి రెచ్చిపోయారు. హర్యానాలో గో రక్షక మూక రాక్షసంగా వ్యవహరించింది. 24ఏండ్ల పశువుల వ్యాపారిని స్తంభానికి కట్టేసి రెండు గంటలపాటు విచక్షణా రహితంగా దాడి చేసింది. రెండు గంటల తర్వాత వచ్చిన పోలీసులు దాదాపు స్పృహ కోల్పోతున్న బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లకుండా పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. వైద్యం కోసం వేడుకున్నా పట్టించుకోకుండా ఆయనకు బేడీలు వేసి ఒక గదిలోని మంచానికి చైన్‌తో కట్టేశారు. హర్యానాలోని రోహ్‌తక్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పౌర సమాజ సంఘ సభ్యులు పోలీసులను ప్రశ్నించి.. బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. హర్యానాలోని చర్ఖి దాద్రి గ్రామంలో డెయిరీని నడుపుతున్న సునీల్ కుమార్ దగ్గర నౌషద్ ముహమ్మద్(24) పదేండ్లుగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే గేదెలను అమ్మేందుకు ఈ నెల 19న జీపులో గేదెలతో పశువుల సంతకు బయల్దేరాడు నౌషద్. సాయంత్రం ఎనిమిది గంటల ప్రాంతంలో రోహ్‌తక్‌లోని భాలౌట్ గ్రామ సమీపానికి నౌషద్ చేరుకోగా.. నిందితుడు జశ్వాల్ గుమనా ఆ జీపును స్కూటర్‌పై వెంటాడి అడ్డగించాడు. జీపు నుంచి నౌషద్ దిగగానే 'గో స్మగ్లర్' అంటూ జశ్వాల్ అరిచాడు. ఇంతలో కొంతమంది యువకులు కర్రలతో అక్కడికి చేరారు. నౌషద్‌ను ఒక స్తంభానికి కట్టేశారు. ఆయన దుస్తులను చించేసి విచక్షణా రహితంగా ఆయనపై దాడి చేశారు. 'ఏం జరుగుతున్నదో తెలుసుకునేలోపే నా చెవులు, ముక్కు, కాళ్లు, వీపు నుంచి రక్తం ధారగా కారడం మొదలైంది. అందులో ఒక 'గోరక్షకుడు' తన చర్మంపై బీడితో కాల్చాడు. గోవు స్మగ్లర్ అంటూ నాపై ముద్ర వేశాడ'ని బాధితుడు నౌషద్ ముహమ్మద్ చెప్పాడు. 'రెండు గంటలపాటు నాపై దాడి జరిగిన తర్వాత పోలీసులు అక్కడికి వచ్చి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. చేతులకు బేడీలు వేసి నేలపై కూర్చోబెట్టారు. గాయాలతో తల్లడిల్లుతున్న నన్ను ఒక చైన్‌తో మంచానికి కట్టేశారు. వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లండని వేడుకుంటూనే ఉన్నాన'ని తెలిపాడు.

బీజేపీ అండతోనే గోరక్షణ దాడులు : సీపీఐ(ఎం) నేత ఇంద్రజిత్ సింగ్

బీజేపీ అండతో గోరక్షకులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారని సీపీఐ(ఎం) సీనియర్ నేత ఇంద్రజిత్ సింగ్ విమర్శించారు. అందువల్లే ఈ మూకలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఇలాంటి అసాంఘిక శక్తుల వల్లే పశువుల వ్యాపారులు, రైతుల జీవనం మరింత దుర్భరంగా మారుతున్నదని వివరించారు.

వర్సిటీలలో ఎస్సీ ఎస్టీ పోస్టులపై...

అలహాబాద్ హైకోర్టు తీర్పుకు సుప్రీం సమర్థన



న్యూఢిల్లీ : విశ్వవిద్యాలయాలలో ఎస్సీ, ఎస్టీ అధ్యాపక భర్తీల పోస్టులపై శాఖలవారీ నియామకాలను సమర్థిస్తూ అలహాబాద్ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. అలహాబా ద్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. శాఖల వారీగా కాకుండా ఇనిస్టిట్యూషన్స్ వారీగా ఈ పోస్టులను భర్తీ చేయాలని కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. కోర్టు తీర్పుతో దేశవ్యాప్తంగా యూని వర్సిటీలలో ఖాళీగా ఉన్న 5 వేల మంది అధ్యాపక పోస్టుల భర్తీకి లైన్ క్లీయర్ అయ్యింది. దీనిపై రూపొం దించిన ఆర్డినెన్స్‌ను ఇటీవలే ముగిసిన పార్లమెంట్ శీతకాల సమావేశాలలో చర్చకు వస్తుందని భావించినా మోడీ సర్కారు మాత్రం దీనిని పక్కనబెట్టింది. కాగా విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉండే ఎస్సీ ఎస్టీ అధ్యాపక పోస్టుల భర్తీని శాఖల వారీగా గాక ఇనిస్టిట్యూషన్స్ పరంగా భర్తీ చేయడానికి 2017లో యూజీసీ ఇచ్చిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు విచారణకు స్వీకరించిన విషయం విదితమే. యూజీసీ నిర్ణయాన్ని తప్పుబట్టిన కోర్టు.. వర్సిటీలలో ఉండే కొన్ని విభాగాలు ఎస్సీ, ఎస్టీ అధ్యాపకులు లేకుండా ఖాళీగా ఉన్నాయని తెలిపింది.

న్యాయ నియామకాల్లో నిబంధనల సడలింపు

- ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యం లేకపోవడంపై సుప్రీం ఆందోళన

న్యూఢిల్లీ : న్యాయస్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ప్రాతినిధ్యం అంతగా లేకపోవడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కోర్టుల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు నిబంధనల్లో సడలింపులు తీసుకురావాలని అభిప్రాయపడింది. ఈ మేరకు కింది కోర్టుల్లో న్యాయాధికారుల నియామక ప్రక్రియలో అర్హత మార్కులను తగ్గించాలని హైకోర్టులకు చీఫ్ జస్టిస్ రంజన్ గోగోయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మంగళవారం సూచించింది. కేరళ హైకోర్టులో ఒక్క జడ్జి కూడా రిజర్వేషన్ కేటగిరీ నుంచి లేకపోవడాన్ని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. కిందిస్థాయి కోర్టుల్లో న్యాయాధికారుల నియామకానికి రిజర్వేషన్ కేటగిరీ వారికి ప్రిలిమినరీ పరీక్షలో 35 శాతం, మెయిన్స్‌లో 40 శాతం అర్హత మార్కులుగా నిర్ధారించారు. కాగా.. కానీ రిజర్వేషన్ కేటగిరీలో ముగ్గురు మాత్రమే ఈ పరీక్షల్లో పాసై ఇంటర్వ్యూకు అర్హత సాధించినట్టు కేరళ హైకోర్టు.. సుప్రీంకోర్టుకు తెలిపింది. కేరళలో 45 న్యాయాధికార పోస్టుల భర్తీ కోసం 2,700 మంది అభ్యర్థులు పోటీ పడగా.. 31 మంది మాత్రమే అర్హత సాధించడం గమనార్హం. కాగా.. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులు అర్హత సాధించలేని పక్షంలో హైకోర్టులు అర్హత మార్కులను తగ్గించాలని(35 నుంచి 30 శాతానికి) ధర్మాసనం వెల్లడించింది. అప్పుడే న్యాయవ్యవస్థలో వారి ప్రాతినిధ్యం తగు విధంగా ఉంటుందని అభిప్రాయపడింది. లేదంటే పరీక్షల్లో అర్హత సాధించక వారికి కేటాయించిన పోస్టులు అలాగే ఖాళీగా ఉంటాయని వెల్లడించింది.

గుజరాత్ అల్లర్ల కేసులో నలుగురు దోషులకు బెయిలు

- వారి 'దోష నిర్ధారణ' అసమగ్రం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని నరోదా పాటియా అల్లర్లకు సంబంధించిన కేసులోని నలుగురు దోషులకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ ఇచ్చింది. ఈ నలుగురి దోష నిర్ధారణ(కన్విక్షన్) అసమగ్రంగా ఉన్నదని జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కార్ నేతృత్వంలోని ధర్మాసనం తెలుపుతూ దోషులు.. ఉమేశ్‌భాయ్ భార్వాడ్, రాజ్‌కుమార్, హర్షద్, ప్రకాశ్‌భాయ్ రాథోడ్‌లకు బెయిల్ మంజూరు చేసింది. గుజరాత్‌లోని గోద్రాలో సబర్మతి ట్రెయిన్ దగ్ధం ఘటన తర్వాత అహ్మదాబాద్‌లోని నరోదా పాటియాలో 2002 ఫిబ్రవరిలో మత అల్లర్లు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో 97 మంది ముస్లింలు మరణించారు. ఈ కేసులో ట్రయల్ కోర్టు 29 మందిని దోషులుగా తేల్చగా.. 2018 ఏప్రిల్ 20న గుజరాత్ హైకోర్టు అందులో 12 మంది(బాబు బజరంగీ సహా)ని మాత్రమే దోషులుగా నిర్ధారించింది. కాగా, బీజేపీ మాజీ మంత్రి మాయా కొద్నానీ సహా 17 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. 'వీరికి స్వల్పకాల శిక్ష విధిస్తే.. న్యాయాన్ని పరిహసించడమే అవుతుంది. పదేండ్ల కఠిన కారాగార శిక్ష న్యాయం చేస్తుందని'ని ఆ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది.

అమెరికాలో ఉగ్రదాడికి కుట్ర

- భగ్నం చేసిన పోలీసులు



వాషింగ్టన్ : అమెరికాలో విద్వేష భావాలు పెరిగిపోయాయి. దేశాధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ముస్లింలు, సిక్కులపై దాడులు అధికమయ్యాయి. న్యూయార్క్ నగరంలో ముస్లింల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని పేలుళ్లకు కుట్ర పన్నిన నలుగురు యువకులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, తుపాకులు, రైఫిల్స్, మారణాయుధాలు స్వాధీనం చేసుకొని నిందితుల కుట్రను భగ్నం చేశారు. ఎస్పీ పాట్రిక్ ఫెలాన్ వెల్లడించిన వివరాల ప్రకారం... రోచెస్టర్ ప్రాంతానికి చెందిన బ్రియాన్ కొలానేరి (20), ఆండ్రీవ్ క్రీసెల్ (18), విన్సెంట్ వెట్రోమైల్ (19)తో పాటు మరో 16ఏండ్ల యువకుడు న్యూయార్క్‌లోని ముస్లింలు జనాభా అధికంగా ఉన్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని పేలుళ్లకు కుట్రపన్నారు. ఇస్లాం మతం పట్ల విద్వేష భావాల కారణంగానే తాము దాడులకు కుట్రపన్నినట్టు ప్రాథమిక విచారణలో నిందితులు అంగీకరించారని ఎస్పీ తెలిపారు.

జింబాబ్వే సైనికుల అత్యుత్సాహం

- నిరసనకారులపై బలప్రయోగం ప్రదర్శించడం పట్ల హక్కుల సంఘం ఆగ్రహం

హరారే : ప్రభుత్వం చమురు ధరలను నియంత్రించుటలో విఫలమైందని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన నిరసనకారులపై సైనికులు అత్యుత్సాహం ప్రదర్శించడం పట్ల జింబాబ్వే హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించినప్పుడు, ధరలు పెరిగినప్పుడు నిరసన తెలిపే హక్కు దేశ పౌరులకు ఉంటుందని అభిప్రాయపడింది. సైనికులు నిరసనకారులను వేధించడాన్ని తప్పుపట్టింది. ఇలాంటి చర్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కావని ఘాటుగా పేర్కొంది. మంగళవారం హరారే నగరంలో మినీ బస్సు డ్రైవర్లను సైనికులు చితకబాదిన ఘటనపై కమిషన్ దర్యాప్తు చేపట్టింది. నిరసనకారులపై లాఠీలు ఝుళిపించిన సైనికులపై ప్రెసిడెంట్ ఎమ్మర్సన్ మాంగాగ్వ కఠిన చర్యలకు ఆదేశించాలని కమిషన్ అభిప్రాయపడింది. గతవారం జింబాబ్వే రిపబ్లిక్ పోలీస్, జింబాబ్వే నేషనల్ ఆర్మీ నిరసనకారులపై జరిపిన దాడుల్లో 8 మంది మృతిచెందారని తెలిపింది.

నాప్కిన్లలో హానికర కెమికల్స్

పారిస్ : బేబీ నాప్కిన్లలో హానికర కెమికల్స్‌ను గుర్తించినట్టు ఫ్రాన్స్ నేషనల్ హెల్త్ ఏజెన్సీ ఆన్సిస్ పేర్కొంది. నాప్కిన్లలో గ్లైఫోసెట్ వంటి హానికర వీడ్‌కిల్లర్స్ గుర్తించామని తెలిపింది. నాప్కిన్ల నాణ్యత ప్రమాణాలపై పరిశోధనలు చేపట్టినట్టు పేర్కొంది. చిన్నారుల ఆరోగ్యానికి నాప్కిన్లు హానికరంగా మారాయని, ప్రభుత్వం తక్షణమే తమ నివేదికపై స్పందించి చర్యలు చేపట్టాలని కోరింది. ఆన్సిస్ రిపోర్ట్‌పై ఫ్రాన్స్ ఆరోగ్య మంత్రి అగ్నెస్ బ్యూజిన్ స్పందించారు. ఈనివేదికను పరిశీలించామని అన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని సంస్థలపై కఠిన చర్యలకు ఆదేశిస్తామని చెప్పారు. ఫ్రాన్స్ మార్కెట్‌లో లభ్యమవుతున్న 4వేల రకాల నాప్కిన్లపై తాము పరిశోధనలు చేపట్టినట్టు ఆన్సిస్ సంస్థ పేర్కొంది. మూడేండ్ల లోపు చిన్నారులు ఉపయోగిస్తున్న నాప్కిన్లు కచ్చితంగా నాణ్యమైనవి ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించింది. డైపర్స్ వినియోగించిన సమయంలో చిన్నారుల మూత్రం కెమికల్స్‌తో కలిసిపోతుందని, ఈ డైపర్స్ తయారీలో ఉపయోగించిన రసాయనాలు చిన్నారుల శరీరంపై తీవ్ర ప్రభావం కనబరుస్తాయని తెలిపింది. గ్లైఫోసెట్ హానికరమైన రసాయమని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన విషయాన్ని ఆన్సిస్ ఈ సందర్భంగా గుర్తు చేసింది. వీటి వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలని నాప్కిన్ల తయారీదారులను కోరింది.

లాస్‌ఏంజిల్స్‌లో ముగిసిన టీచర్ల సమ్మె

- డిమాండ్లకు తలొగ్గిన యాజమాన్యాలు



వాషింగ్టన్ : లాస్‌ఏంజిల్స్ నగరంలో ఉపాధ్యాయ సంఘాలు గత 9 రోజుల నుంచి చేపడుతున్న సమ్మె బుధవారం ఎట్టకేలకు ముగిసింది. 1240 పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. ఆరు శాతం వేతనాల పెంపు, పరిమితమైన విద్యార్థులతో చిన్న తరగతి గదులు, చిన్నారుల సంరక్షణార్థం ఆయాలను, నర్సులను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో లాస్‌ఏంజిల్స్ జిల్లాలో పనిచేస్తున్న 34వేల మంది టీచర్స్ తరగతులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. దీంతో, ఆరు లక్షల మంది చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు పాఠశాలలు ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేసుకున్నప్పటికీ పలు విద్యా సంస్థలు చిన్నారులు సైతం తరగతులను స్వచ్ఛందంగా బహిష్కరించి టీచర్లకు మద్దతుగా నిలవడం గమనార్హం. టీచర్ల సమ్మెకు యూనియన్ ప్రెసిడెంట్ అలెక్స్ కాప్యూటో పెరల్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ డిమాండ్లకు స్కూల్ యాజమాన్యాలు అంగీకరించడంతో సమ్మె విరమించామని అన్నారు. లాస్‌ఏంజిల్స్‌లోని పాఠశాలల్లో 6లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. అయితే, పలు పాఠశాలల యాజమాన్యాలు తరగతి గదుల్లో ఎక్కువ మంది పిల్లలను కూర్చొబెట్టడంతో పర్యవేక్షణ లోపించి నాణ్యమైన విద్యాబోధన చేయలేకపోతున్నామని అన్నారు. అంతేగాకుండా, విద్యార్థుల సంరక్షణార్థం ఆయాలు, నర్సులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. నిత్యావసర ధరలు మిన్నంటినప్పటికీ వేతనాల పెంపుపై యాజమాన్యాలు స్పందించకపోవడంతోనే తామంతా సమ్మెకు దిగామని చెప్పారు. తమ డిమాండ్లను యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన మేయర్ ఎరిక్ గార్సెట్టీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పెరల్ తెలిపారు. ఇదిలా ఉండగా, లాస్‌ఏంజిల్స్‌లో 1989లో టీచర్లు సమ్మెకు దిగారు. అప్పటి నుంటి టీచర్లు సమ్మెలో పాల్గొన్న దాఖలాలు లేవు. ఉపాధ్యాయ సంఘాలు తమ డిమాండ్లకు అంగీకరించాలని దాదాపు 21నెలల నుంచి స్కూల్ యాజమాన్యాలను అభ్యరిస్తున్నప్పటికీ స్పందించలేదు. ఈనెల17న జరిగిన చర్చలు కూడా సఫలం కాలేదు. ఈనేపథ్యంలో టీచర్లు సమ్మె బాట పట్టారు.

వెనెజులాలో మదురో సర్కార్ వ్యతిరేక ర్యాలీ



కరాకస్ : వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇక్కడి ప్రతిపక్ష నేత, నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జువాన్ గ్యాడో బుధవారం భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. ఈ ర్యాలీకి తాము మద్దతిస్తున్నామంటూ అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ చేసిన ప్రకటన పెను దుమారం రేపింది. కరాకస్ నగరంలో ర్యాలీ తీసిన సందర్భంగా గ్యాడో మాట్లాడారు. దేశాధ్యక్షుడిగా కొనసాగే అర్హతలు మదురోకు లేవంటూ ఆరోపించారు. మదురోను గద్దె దించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. మదురోకు వ్యతిరేకంగా గ్యాడో తీసిన ర్యాలీని అధికార సోషలిస్ట్ పార్టీ తీవ్రంగా ఖండించింది. తమ అధ్యక్షుడి ప్రతిష్టను దెబ్బతీయాలని నేషనల్ అసెంబ్లీ నేత కుట్ర పన్నారని పేర్కొంది. కాగా, గతేడాది మేలో మదురో రెండోసారి దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనను ఎలాగైనా పదవి నుంచి తప్పించి అధ్యక్ష పగ్గాలు చేపట్టాలని గ్యాడో కుట్రపన్నారు. అయితే, గ్యాడో చర్యలపై వెనిజులా సుప్రీంకోర్టు కూడా గతవారం అసహనం వ్యక్తం చేసింది. వెనెజులాలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. గ్యాడోపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని స్టేట్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించింది. ప్రజలను రెచ్చగొట్టే ధోరణిలో గ్యాడో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, గతవారం రాజధాని కరాకస్‌లో 17 మంది నేషనల్ గార్డు సైనికులు మదురో సర్కార్‌కు వ్యతిరేకంగా ఉద్యమించారు. అయితే, వీరంతా ఆయుధాల అపహరణ కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడినట్టు విచారణలో తేలిందని వెనెజులా అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది.

వీడిన అక్కాచెల్లెళ్ల డెత్ మిస్టరీ

- అమెరికాలో గతేడాది ఆత్మహత్యకు పాల్పడ్డ ఫారియా, తాలా




వాషింగ్టన్ : గతేడాది అక్టోబరులో అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సౌదీ అక్కాచెల్లెళ్ల డెత్ మిస్టరీ వీడింది. వీరిద్దరు నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారని న్యూయార్క్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నివేదిక అందించారు. వివరాల్లోకి వెళితే.. సౌదీ అరేబియాకు చెందిన రొటానా ఫారియా(22), ఆమె సోదరి తాలా(16) ఫారియా శవాలు హడ్సన్ నది సమీపంలో లభ్యమైయ్యాయి. వీరిద్దరి కాళ్లు టేప్‌తో చుట్టబడి ఉండటంతో పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. అయితే పోస్ట్‌మార్టం నివేదికలో వీరిది ఆత్మహత్య అని తేలడంతో ఫారియా సిస్టర్స్ గురించి ఆరా తీయగా ఆశ్చర్యకర విషయాలు బయటికి వచ్చాయి. సౌదీకి చెందిన రొటానా, తాలాలు కుటుంబ సభ్యుల ఆంక్షలు తట్టుకోలేక న్యూయార్క్‌లో ఆశ్రయం పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారని స్థానిక మీడియా పేర్కొంది. అయితే ఇందుకు అనుమతి లభించకపోవడంతో వర్జీనియా నుంచి తిరిగి సౌదీకి పంపిస్తారేమోనని భావించిన ఈ అక్కాచెల్లెళ్లు న్యూయార్క్‌కు పారిపోయినట్టు సమాచారం. ఈ క్రమంలో సౌదీకి తిరిగి వెళ్లడం కంటే తనువు చాలించడమే మేలని భావించి ఆత్మహత్య చేసుకున్నట్టు మెడికల్ అధికారులు అనుమానిస్తున్నారు.

ఇక ఈ విషయంపై అమెరికా ఎంబసీలోని సౌదీ అరేబియా అధికార ప్రతినిధి ఫాతిమా బాసిన్ స్పందించారు. 'సౌదీకి చెందిన అక్కాచెల్లెళ్లు తాలా, రొటానా ఫారియాల బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే వారి మృతదేహాలను తీసుకెళ్లాలి. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా. అమెరికాలో ఆశ్రయం పొందడానికి వారు దరఖాస్తు చేసుకున్నారనే వార్తలు అవాస్తవం' అని ట్వీట్ చేశారు. అంతేగాకుండా, వర్జీనియాలో ఉండే ఇంటి నుంచి వారిద్దరు అనేకసార్లు పారిపోయారని.. 2017 నుంచి న్యూయార్క్‌లోని వివిధ హోటళ్లలో బస చేసినట్టు తెలిసిందని ఆమె పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల వేధింపులు తట్టుకోలేక సౌదీకి చెందిన రహాఫ్ మహ్మద్ మలేషియాకు పారిపోయి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఐరాస శరణార్థి సంస్థ జోక్యం చేసుకుని కెనడాలో ఆమెకు ఆశ్రయం కల్పించింది. అంతేకాకుండా , ఆంక్షల చట్రం బయటపడేందుకు ప్రయత్నించిన దుబాయ్ యువరాణి షికా లతీఫా అనేక నాటకీయ పరిణామాల అనంతరం ఇటీవలే ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలో సంప్రదాయాల పేరిట సౌదీలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందనడానికి ఈ ఘటనలు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచాయంటూ హక్కుల సంఘాలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇక ఇప్పుడు అదే తరహాలో ఇంటి నుంచి పారిపోయిన ఫారియా సిస్టర్స్ ఆత్మహత్యపై సౌదీ ఎలా స్పందిస్తుందోనన్న విషయం తెలియాల్సి ఉంది.

షట్‌డౌన్‌కు నేడో రేపో తెర

- సరిహద్దుగోడ బిల్లుకు ఓకే చెప్పనున్న సెనేట్



వాషింగ్టన్: నెల రోజులకు పైగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు ఎట్టకేలకు తెరపడనుంది. ఈ ప్రతిష్టంభనకంతటికీ మూలమైన ట్రంప్ సరిహద్దు గోడ బిల్లుకు గురువారం ఆమోదం తెలపనున్నట్లు సెనేట్ నాయకులు ప్రకటించారు. సెనేట్‌లో మెజార్టీ నాయకుడు మిచ్ మెక్‌కానెల్ (రిపబ్లికన్ పార్టీ), సెనేట్ మైనార్టీ నాయకుడు చుక్ షూమర్ (డెమొక్రాటిక్ పార్టీ) బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ శాఖలకు నిధులు మంజూరుకు సంబంధించిన బిల్లుతోబాటు, అధ్యక్షుడు ట్రంప్ మంకు పట్టు పట్టిన 507 కోట్ల డాలర్ల సరిహద్దు గోడ బిల్లుకు కూడా ఆమోదం తెలపడానికి తాము సిద్ధంగా వున్నామని చెప్పారు. సరిహద్దు గోడకు ఆమోదం తెలిపితే, చిన్నప్పుడే అమెరికాలో వచ్చి స్థిరపడిన అక్రమ వలస వాసులపై మూడేళ్లపాటు ఎటువంటి చర్యలు లేకుండా చూస్తామని ట్రంప్ ఇచ్చిన హామీ మేరకు డెమొక్రాట్లు ఈ రాజీకి అంగీకరించారు. ఈ బిల్లులు ఆమోదం పొందితే గత నెల రోజులుగా నిధులు స్తంభించిపోవడంతో తలెత్తిన ప్రభుత్వ పాక్షిక మూసివేతకు తెర పడనుంది. ట్రంప్ తొలుత ప్రకటించిన సరిహద్దు గోడకు బదులు స్టీల్ స్లాట్స్, ముళ్ల కంచెకు ఈ ప్రాజెక్టును పరిమితం చేస్తున్నానని చెప్పారు. అంతకుముందు డెమొక్రాట్లు సుదీర్ఘంగా ప్రభుత్వ షట్ డౌన్ కొనసాగడానికి ట్రంపే కారణమని విమర్శించారు. బందీలను గావించి బేరసారాలాడే ఎత్తుగడను ట్రంప్ అనుసరించారని, చివరికి తన అధ్యక్ష భవనాన్ని కూడా ఆయన బందీగావించారని డెమొక్రాట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తపించారు

- ఈశ్వరీబాయి శతజయంతి ఉత్సవాల్లో ఖర్గే

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈశ్వరీబాయి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత మల్లిఖార్జున ఖర్గే చెప్పారు. ప్రత్యేక తెలంగాణ కోసం 'రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా' ద్వారా కషి చేశారని కొనియడారు. అంబేడ్కర్ ఆశయాల కోసం జీవితాతం కష్టపడ్డారని కొనియాడారు. బుధవారం రవీంద్రభారతిలో ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్టు చైర్మెన్ జె గీతారెడ్డి ఆధ్వర్యంలో ఈశ్వరీబాయి శతజయంతి వేడుకలు జరిగాయి. ఈశ్వరీబాయి 'అగ్నిశిఖ' పుస్తకాన్ని ఖర్గే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితులు, పేదల సమస్యలతోపాటు ప్రజాసమస్యల కోసం ఆమె ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. అందుకే ప్రజల్లో ఆమె చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. తాను విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే ఈశ్వరీబాయితో సత్సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆఖరి వరకూ ఒకే పార్టీలో ఉండటం ఆమె అంకితభావానికి నిదర్శనమన్నారు. ప్రజాగా యకుడు గద్దర్ తన పాటలతో సమాజంలో ఉత్తేజాన్ని నింపారని తెలిపారు. ఈశ్వరీబాయి మెమోరియల్ అవార్డు గద్దర్‌కు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్ జైపాల్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కె జానారెడ్డి, బాలల హక్కుల కమిటీ మాజీ చైర్మెన్ శాంతాసిన్హా తదితరులు ఉన్నారు. అంతకు ముందు విగ్రహాన్ని ఖర్గే ఆవిష్కరించారు.





సన్మాన గ్రహీతులు గద్దర్

గాంధీభవన్‌లో సంబురాలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీని నియమించడం పట్ల పలువురు పార్టీ రాష్ట్ర నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వి హనుమంతరావు మాట్లాడుతూ ప్రియాంకగాంధీ రాజకీయాలలోకి రావడం పార్టీకి మరింత నూతన ఉత్తేజం తెస్తున్నదని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రతిపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ, పార్టీ ఉపాధ్యక్షులు మల్లు రవి, ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్, కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, మాజీ మంత్రి శశిధర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



NOTIFICATION

The management of JBR ARCHITECTURE COLLEGE do here by notify that the Institute is relocated in a new building premises as per the Council of Architecture norms and standards at Bhaskar nagar, Yenkapally (V), Moinabad (M), R.R Dist T.S -500075 from the earlier location of 2nd floor, Bhaskar Plaza, Road No.1, Banjara hills, Hyderabad-500 034.

By Management,
JBR Architecture College.

బహిరంగ ప్రకటన

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ సమక్షంలో హైదరాబాద్ వద్ద ఇన్‌సాల్వెన్సీ పిటీషన్ నం.సిపి(ఐబి) నం. 484/9/హెచ్‌డిబి ఆఫ్ 2018

శ్రీమతి [illegible] ..... దరఖాస్తుదారు

వర్సెస్

మినర్వా పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ .....రెస్పాండెంట్

[illegible] నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ సమక్షంలో హైదరాబాద్ వద్ద మినర్వా పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (కార్పొరేట్ డెటార్) పై సెక్షన్ 9, [illegible] ఇన్‌సాల్వెన్సీ పిటీషన్‌ను ప్రారంభించారని దయచేసి గమనించగలరు. [illegible] మినర్వా పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (కార్పొరేట్ డెటార్) వారు గౌరవ ట్రిబ్యునల్ సమక్షంలో [illegible] తేది.03.01.2019నాటి ఉత్తర్వు ఆధారంగా, ఈ పిటీషన్ విచారణకు సంబంధించి [illegible] తదుపరి విచారణ తేది అనగా 07.02.2019 ముందుగా దాఖలు చేయుటకు మినర్వా పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (కార్పొరేట్ డెటార్) వారికి తెలియజేయుటకు పత్రిక ప్రచురణ చేయుటకు క్రింది సంతకందారున్ని గౌరవ ట్రిబ్యునల్ ఆదేశిస్తున్నది, విఫలం చెందితే చట్ట ప్రకారం మీకు పరోక్షంగా విచారించుటకు గౌరవ ట్రిబ్యునల్ ముందుకుసాగును.

[illegible] అడ్వకేట్స్-9375751008. [illegible]/2013

([illegible])

NMDC Limited

(A Government of India Enterprise)
'Khanij Bhavan', 10-3-311/A, Castle Hills, Masab Tank, Hyderabad - 500 028.
CIN: L13100AP1958GOI001674

NOTICE

Pursuant to Regulation 47 of SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015, notice is hereby given that a meeting of Board of Directors of the Company is scheduled to be held on Thursday the 31st January 2019, inter-alia, to consider, approve and take on record the Unaudited Financial Results of the Company for the quarter ended 31st December 2018.

Pursuant to the Internal Code of Conduct for Prevention of Insider Trading in dealing with Securities of NMDC Limited, the trading window for trading in the equity shares of the Company shall remain closed from 24th January 2019 to 2nd February 2019 (both days inclusive), in connection with the above scheduled meeting.

The above details are also available on the website of the Company: www.nmdc.co.in and also on the websites of Stock Exchanges: www.nseindia.com and www.bseindia.com.

For NMDC Limited

Place: Hyderabad
Date: 23rd January 2019

A S Pardha Saradhi
Company Secretary

హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ

hmda

[illegible] కాంప్లెక్స్, అడ్మినిస్ట్రేటివ్ 'ఎల్'- బ్లాక్, తార్నాక, హైదరాబాద్-500 007.

బహిరంగ ప్రకటన

ప్రణాళిక శాఖ

ఫైల్ నం.10008/ఎంపి2/ప్లానింగ్/హెచ్/2005

ఇందుమూలంగా తెలియునది ఏమనగా, డా.॥శ్యామ్ ప్రసాద్ లేఖ నం. 10008/ఎంపి2/ప్లానింగ్/హెచ్/2005 తేది: 07.05.2006 ఆధారంగా ఈ కార్యాలయం ద్వారా ఆమోదం పొందిన డ్రాఫ్ట్ రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్ల ఆమోదం రద్దుచేయవలసిందిగా అభ్యర్థించారు ఏదైతే 06.05.2007న ముగియబడినది, వారు రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ (మం), నర్సింగి (గ్రా) యొక్క సర్వే నం.158/పి లో హై రెసిడెన్షియల్ / కమర్షియల్ కాంప్లెక్స్ కొరకు దరఖాస్తుచేయుదలచారు. కావున ఏవేని ప్లాట్ల యజమానులు/కొనుగోలుదారులు/అగ్రిమెంట్ హోల్డర్స్ రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ (మం) నర్సింగి (గ్రా) యొక్క సర్వే నం.158/పి లో డ్రాఫ్ట్ లేఅవుట్ కలిగియున్న విషయంలో, ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి ఈ కార్యాలయమునకు 15 రోజుల్లోగా వారి ఏవేని వ్రాతపూర్వక అభ్యంతరాలు/సలహాలను ఫైల్‌చేయవచ్చును. పై కాలవ్యవధిలోగా ఏవేని అభ్యంతరాలు/ సలహాల స్వీకరించని పక్షంలో, డ్రాఫ్ట్ లేఅవుట్ (ప్లాట్‌తో) ఓపెన్ డ్రాఫ్ట్ రద్దుచేయుటకు ఫోర్స్‌లోని రూల్స్ ప్రకారం మరియు అందుబాటులోగల మెటీరియల్ పత్రాల ప్రాతిపదికన పరిగణలోకి తీసుకోబడుతుంది.

DIPR No.785-PP/CL/ADVT/1/2018-19

సం/- డైరెక్టర్ ప్లానింగ్-1

మిషన్ భగీరథ ఇంజినీర్ల డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2019 నూతన సంవత్సరం మిషన్ భగీరథ ఇంజినీర్ల డైరీ, క్యాలెండర్‌ను మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. కొత్త సంవత్సరం మిషన్ భగీరథ ఇంజినీర్లు, ఉద్యోగులంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ శాఖ అధికారులు, ఇంజినీర్లు ఆవిష్కరించారు. శాఖ పరంగా భగీరథ ఇంజినీర్లు ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలను ఈ సంవత్సరం పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. భగీరథ ఇంజినీర్ల సమష్టి కృషి, పట్టుదలతో ప్రతీ ఇంటికి మంచినీటిని అందించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ కలను సాకారం అయిందన్నారు. ఇందుకు ప్రతీ ఒక్కరికి అభినందనలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్లు జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయ్ ప్రకాశ్, వినోభా దేవి, చక్రవర్తి, శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు ఎల్లారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నరేందర్, రవీందర్ రెడ్డి, రాకేష్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.



బషీర్‌బాగ్‌లో భారీ అగ్నిప్రమాదం

- ఖాన్‌లతీఫ్‌ఖాన్ భవనంలో మంటలు
- పరుగులు పెట్టిన ప్రజలు

నవతెలంగాణ- సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలోని బషీర్‌బాగ్‌లో గల ఖాన్‌లతీఫ్ ఖాన్ భవనంలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దాంతో అందులో ఉన్న జనం బయటకు పరుగు తీశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

ఖాన్‌లతీఫ్ ఖాన్ భవనం ఎనిమిది అంతస్తులుగా ఉంది. ఈ భవనంలో పలు కీలక కార్యాలయాలున్నాయి. రెండో అంతస్తులో రెండు తెలుగు రాష్ట్రాల ఐడియా ప్రధాన కార్యాలయాలున్నాయి. వందలాది మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అయితే ఐదో అంతస్తులోని ట్యాక్స్ కన్సల్టెంట్ ఆఫీసులో మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. మంటల్లో చిక్కుకున్న ఎనిమిది మంది తోపాటు భవనంలోని ఉద్యోగులను, సిబ్బందిని పోలీసులు సురక్షితంగా బయటకు పంపించారు. ఏం జరిగిందో తెలియక భవనంలో ఉన్న దుకాణదారులతో పాటు మిగిలిన వారందరూ భవనం పైకి, కిందకు పరుగులు తీశారు. మరికొంత మంది రోడ్డుపై పరుగులు తీశారు. మంటలు వ్యాప్తి చెందకుండా అధికారులు తీవ్ర కృషి చేశారు. చివరకు మొత్తం ఆరు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలోని ఏసీలో షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. సర్వర్ రూమ్‌గుండా మంటలు వ్యాపించడంతో ప్రమాద స్థాయి మరింత పెరిగిందని అధికారులు అభిప్రాయపడ్డారు. భారీగా ఆస్తి నష్టం జరిగిందన్నారు. పలు ఫైల్లు దగ్ధమైనట్టు తెలిపారు.

ఎస్టేట్స్ యాజమాన్యానికి నోటీసులు

అగ్నిప్రమాదం సంభవించిన ఖాన్‌లతీఫ్ ఖాన్ ఎస్టేట్ భవనంలోని 5,6,7 అంతస్తులను సీజ్ చేశామని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ముషారఫ్ అలీ తెలిపారు. జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు, ఫైర్, పోలీసు బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిప్రమాదాన్ని నివారించాయన్నారు. ఈ భవనానికి ట్రేడ్ లైసెన్స్, ఆక్యుపెన్సి సర్టిఫికెట్లు లేనట్టుగా ప్రాథమికంగా నిర్ధారించినట్టు చెప్పారు. భవనానికి సంబంధించిన నిర్మాణ అనుమతి పత్రాలు, భద్రత ఫైర్ ఎన్.ఓ.సీ, భద్రతా చర్యలపై గురువారం ఉదయంలోగా వివరణ ఇవ్వాలని ఖాన్ లతీఫ్ ఖాన్ భవన యాజమాన్యానికి నోటీసులు అందజేశామని తెలిపారు.

Premier Explosives limited

CIN:L24 110TG 1980 PLC 002633
'Premier House', 11 Ishaq Colony, Near AOC Centre, Secunderabad - 500 015
Ph. Nos. 040-66146801-4 Fax No. 040-27843431 Email: investors@pelgel.com

EXTRACT OF STANDALONE UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND NINE MONTHS ENDED DECEMBER 31, 2018

(Rs.in lakhs except as stated)

S. No.	Particulars	Quarter ended			Nine months ended		Year ended
		31.12.2018 (Unaudited)	30.09.2018 (Unaudited)	31.12.2017 (Unaudited)	31.12.2018 (Unaudited)	31.12.2017 (Unaudited)	31.03.2018 (Audited)
1	Total income from operations	6936.20	5354.17	6749.16	18234.50	18262.50	26590.85
2	Profit before tax	854.59	362.24	242.77	1,346.52	935.27	1,343.94
3	Profit after tax	569.48	235.66	160.06	891.38	627.92	873.41
4	Total comprehensive income	547.81	214.01	141.62	826.40	572.59	794.65
5	Equity share capital	1063.71	1063.71	1063.71	1063.71	1063.71	1063.71
6	Earning per share (of Rs. 10/- each)						
	(not annualized)						
	Basic (in Rs.)	5.35	2.22	1.54	8.38	6.05	8.42
	Diluted (in Rs.)	5.35	2.22	1.54	8.38	6.05	8.42

Above statement is an extract of the detailed format of Quarterly Financial Results filed with the National Stock Exchange and Bombay Stock Exchange which is available on their respective websites, www.nseindia.com and www.bseindia.com and the company's website, www.pelgel.com

Secunderabad
23.01.2019

For Premier Explosives Limited
Dr. A.N. Gupta
Chairman & Managing Director

మీడియా కవరేజీ అడ్డగింత

- మోజో టీవీ వద్దంటూ నినాదాలు
- వెంబడించిన శబరిమల పరిరక్షణ సమితి సభ్యులు

నవతెలంగాణ- ముషీరాబాద్

శబరిమల పరిరక్షణ సమితి తెలంగాణ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ఉపవాస దీక్ష ఉద్రిక్తతకు దారితీసింది. కార్యక్రమాన్ని కవర్ చేయడానికి వెళ్లిన మోజో టీవీ ప్రతినిధులను ఆ సమితి సభ్యులు అడ్డుకున్నారు. 'మోజో టీవీ వద్దు.. వద్దు' అంటూ నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా తిరిగి వెళ్లిపోతున్న మీడియా ప్రతినిధులను కొందరు వెంబడించారు. అక్కడే ఉన్న పోలీసులు, ఇతర మీడియా సిబ్బంది కలుగజేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

శబరిమల పవిత్రతను కాపాడాలనే పేరిట హైదరాబాద్ నగరంలోని ఇందిరాపార్కు వద్ద శబరిమల పరిరక్షణ సమితి తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం ఉపవాక్ష దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రామచంద్రరావు మాట్లాడుతుండగా.. కార్యక్రమాన్ని మోజో టీవీ యాంకర్ కవర్ చేస్తున్నాడు. అదే సమయంలో కొందరు సభ్యులు ఆ టీవీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా తిరిగి వెళ్లిపోతున్న ఆ ఛానెల్ సిబ్బందిని కొందరు వ్యక్తులు వెంబడించారు. అక్కడే ఉన్న చిక్కడపల్లి ఏసీపీ నర్సింహారెడ్డి, గాంధీనగర్ సీఐ శ్రీనివాస్, ఇతర పోలీస్, మీడియా సిబ్బంది జోక్యం చేసుకుని, ఛానెల్ సిబ్బందిని సముదాయించి పంపించేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనీ, సంయమనం పాటించాలనీ పోలీసులు కోరారు. అయితే మీడియాపై సమితి సభ్యులు దురుసుగా ప్రవర్తించారనీ, ఉద్దేశపూర్వకంగా వెంబడించారనీ, వారిపై చర్యలు తీసుకోవాలని ఛానెల్ సిబ్బంది డిమాండ్ చేశారు. మీడియా పట్ల అనుచితంగా వ్యవహరించిన సమితి సభ్యుల వైఖరిని పలువురు ఖండిస్తున్నారు.



రాజకీయ లబ్ది కోసమే నిరాధార ఆరోపణలు

నేనేప్పుడూ హత్యా రాజకీయాలు చేయలేదు : కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజకీయ లబ్ది కోసమే కాంగ్రెస్ పార్టీ ఓ కట్టుకథ అల్లి అమెరికాలోని సయ్యద్ సుజాతో నడిపిస్తున్నదని, తానేప్పుడూ హత్యారాజకీయాలకు పాల్పడలేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ చేయించి నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పని చేశానని, తన సమయాన్నంతా అంబర్‌పేట ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే వెచ్చించానని చెప్పారు. తనపై ఇలాంటి ఆరోపణలు రావడం బాధాకరమన్నారు. కాకిరెడ్డి అనే వ్యక్తి ఎవరో తనకు తెలియదని స్పష్టం చేశారు. 11 మందిని హత్య చేయిస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తనపై ఎందుకు కేసు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, ప్రతిపక్ష పార్టీగా ఉన్న బీజేపీకి ట్యాంపరింగ్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఈవీఎంలపై ఆరోపణలు చేసిన వారు ఒక్కరు కూడా ట్యాంపరింగ్ నిజమేనని నిర్ధారణలతో చూపించలేకపోయారన్నారు. 2014లో బీజేపీ ట్యాంపరింగ్ పాల్పడిందని భావిస్తే బీజేపీ పొత్తుతో ఏపీలో గెలిచిన చంద్రబాబుకు ఒక్క నిమిషం కూడా సీఎంగా కొనసాగే అర్హత లేదన్నారు.

ఎ.ఎస్ రావు ఒలింపియాడ్‌లో ఆలిండియా నెం.1గా శ్రీచైతన్య

నవతెలంగాణ - హైదరాబాద్

డా॥ ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 31వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఫైనల్ ఎక్జామినేషన్‌లో 9వ, 10వ తరగతులకు ఆలిండియా మొదటి ర్యాంక్యులు రెండు ప్రకటించగా ఆ రెండు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులే సాధించారని శ్రీచైతన్య స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. టాప్10లో 13 ర్యాంకులు అలాగే టాప్ 20లో 24 ర్యాంకులు శ్రీచైతన్య విద్యార్థులు సాధించారు. 9వ తరగతి నుంచి 40 ర్యాంకులు ప్రకటించగా వాటిలో 26 ర్యాంకులు 65శాతం శ్రీచైతన్య విద్యార్థులవే. 10వ తరగతి నుంచి 48 ర్యాంకులు విద్యార్థులకు ర్యాంకులు ప్రకటించగా వారిలో 31 ర్యాంకులు 65శాతం శ్రీచైతన్య విద్యార్థులవే. అలాగే మొత్తం 88 ర్యాంకులు ప్రకటించగా వాటిలో 57 ర్యాంకులు 65శాతం శ్రీచైతన్య విద్యార్థులవే. అలాగే గత ఏడు సంవత్సరాలుగా డా॥ ఎ.ఎస్ రావు ఒలింపియాడ్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించడం ద్వారా శ్రీచైతన్య తమ అధిపత్యాన్ని చాటుతూ నెం.1గా నిలిచిందని శ్రీచైతన్య విద్యార్థుల చైర్మెన్ డా॥ బి.ఎస్.రావు తెలిపారు. అదే విధంగా ఇటీవల విడుదలైన ఐఎంఓ అంతర్జాతీయ గణిత ఒలంపియాడ్ పరీక్ష ఫలితాలలో రెండు అంతర్జాతీయ మొదటి ర్యాంకులతో పాటు టాప్ 10లో 92 ర్యాంకులు టాప్ 100లో 442 ర్యాంకులు మొత్తం 2541మెడల్స్ శ్రీచైతన్య విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు.

Agro Tech Foods Limited

Regd. Office: 31, Sarojini Devi Road, Secunderabad - 500 003
CIN : L15142TG1986PLC006957, Ph: 040-66650240 Fax: 040-27800947

31 డిసెంబర్ 2018 తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలానికి ఆర్థిక ఫలితాల యొక్క సారాంశము

(₹ లక్షలలో)

క్ర. సం.	వివరములు	స్టాండ్‌అలోన్				
		ముగిసిన త్రైమాసికం		ముగిసిన తొమ్మిది నెలలు		ముగిసిన సంవత్సరం
		31-12-2018 (ఆడిట్ చేయనివి)	31-12-2017 (ఆడిట్ చేయనివి)	31-12-2018 (ఆడిట్ చేయనివి)	31-12-2017 (ఆడిట్ చేయనివి)	31-03-2018 (ఆడిట్ చేసినవి)
1	మొత్తం ఆదాయం	21,670	21,481	62,606	59,769	81,261
2	నికర లాభం కాలానికి పన్ను మరియు మినహాయింపదగిన ఐటంలకు ముందు	1,527	1,370	3,958	3,715	4,894
3	నికర లాభం కాలానికి పన్నుకు ముందు మినహాయింపదగిన ఐటంల తరువాత	1,527	1,370	3,958	3,715	4,894
4	నికర లాభం కాలానికి పన్ను మరియు మినహాయింపదగిన ఐటంల తరువాత	997	903	2,556	2,413	3,165
5	మొత్తం సమగ్ర ఆదాయం కాలానికి (పన్ను తర్వాత కాలానికి లాభం మరియు పన్ను తర్వాత ఇతర సమగ్ర ఆదాయము కలిగి ఉన్నవి)	997	903	2,556	2,413	3,165
6	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ప్రతి వాటా ముఖ విలువ ₹ 10/-)	2,437	2,437	2,437	2,437	2,437
7	రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వులు మినహా ఇండ్ ఎయస్ ప్రకారం)					31,570
8	ప్రతి వాటా ఆర్జనలు (ఒక్కొక్కటి ₹ 10/- చొప్పున)					
	బేసిక్ (₹)	4.25	3.88	10.93	10.38	13.60
	డైల్యూటెడ్ (₹)	4.25	3.88	10.91	10.38	13.60

సూచనలు :

1. పైన తెలిపిన వివరాలు సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్చేంజీలతో సమర్పించిన ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలానికి ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక నమూనా యొక్క సారాంశం. ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలానికి ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి నమూనా స్టాక్ ఎక్స్చేంజ్ వెబ్‌సైట్లు www.nseindia.com, www.bseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్ www.atfoods.com లో అందుబాటులో ఉన్నవి.
2. పైన తెలిపిన ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 22 జనవరి 2019న జరిగిన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ వారి సమావేశంలో ఆమోదించబడినవి.
3. చీఫ్ ఆపరేటింగ్ డెసిషన్ మేకర్ "(సిఒడియం) ఒక్క సెగ్మెంట్‌గా ఓవర్‌ఆల్ కంపెనీ లెవల్ వద్ద వ్యాపార నిర్వహణ పనితీరును సమీక్షించిన విధముగా కంపెనీ యొక్క ఆపరేటింగ్ సెగ్మెంట్ "ఫుడ్స్" గా గుర్తించబడినది. అందువలన సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క షెడ్యూల్ IV యొక్క క్లాజ్ (ఎల్) తో చదవబడే రెగ్యులేషన్ 33(1)(ఇ) మరియు ఇండ్ ఎఎస్ 108- 'ఆపరేటింగ్ సెగ్మెంట్స్' ప్రకారం డిస్‌క్లోజర్ ఆగ్రోటెక్ ఫుడ్స్ లిమిటెడ్ "(ది కంపెనీ)" నకు వర్తించదు.
4. 31 డిసెంబర్ 2018తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలానికి సంబంధించిన ఫలితాలను కంపెనీ యొక్క సంస్థాగత ఆడిటర్లచే పరిమిత సమీక్ష చేపట్టబడినవి.
5. సరిపోల్చే కాలపు సంఖ్యలు, ప్రస్తుత కాలపు సంఖ్యలతో సరిపోల్చుటకు అనుగుణంగా రీగ్రూప్ / రీక్లాసిఫైడ్ చేయబడినవి.
6. కంపెనీకు Ind-AS 115, రెవెన్యూ ఫ్రమ్ కాంట్రాక్ట్ విత్ కస్టమర్స్‌ను వర్తింప చేసినది (ఇది పాత రెవెన్యూ రికగ్నీషన్ స్టాండర్డ్‌ను భర్తీ చేసినది). మొదటిగా ఈ స్టాండర్డ్, 1 ఏప్రిల్ 2018 నుంచి వర్తించును. కంపెనీ క్యుములేటివ్ ఎఫెక్ట్ పద్ధతిని అమలుపరచినది. తదనుగుణంగా 31మార్చి 2018తో ముగిసిన సంవత్సరము మరియు 31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలానికి కొరకు సమాచారాన్ని మరియు సంఖ్యలను మార్చలేదు. (అనగా ముందు కాలానికి సంబంధించిన సంఖ్యలను Ind-AS 18, రెవెన్యూ ప్రకారం ప్రచురించినది). Ind-AS 115 ను వర్తింపు చేయగా, మొత్తం వ్యయాల నుండి ఆదాయానికి రీక్లాసిఫికేషన్ చేయబడినది. ఫలితంగా 31 డిసెంబర్ 2018తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలం కొరకు ₹157 లక్షలు మరియు ₹472 లక్షలు వరుసగా ఈ మేరకు ఆదాయం తగ్గినది. ఈ Ind-AS 115 ను వర్తింపచేయడం వలన 1 ఏప్రిల్, 2018 నాటికి ఉన్న లాభాలలో ఏ విధమైన ప్రభావం కలగలేదు.
7) 4 నవంబరు 2018న తారీఖున, కంపెనీ యొక్క ఒక ఉత్పాదక కర్మాగారం వద్ద అగ్ని ప్రమాదం సంభవించినది. దీని వల్ల కంపెనీ యొక్క ఆస్తి, ప్లాంట్, పరికరాలు మరియు సరుకుల నిల్వలకు నష్టం కలిగినది. కంపెనీ ఈ నష్టానికి సంబంధించి భీమా సంస్థకు దావా దాఖలుచేసినది. ఈ నష్టం భీమా సంస్థ యొక్క సర్వేలో ఉంది. ఈ ప్రమాదానికి సంబంధించి కంపెనీ ₹ 2,435 లక్షలు (₹ 2,202 లక్షల విలువ కలిగిన ఆస్తి, ప్లాంట్, పరికరాలు మరియు ₹ 233 లక్షల విలువ కలిగిన సరుకుల నిల్వలకు సంబంధించినవి) నష్టాన్ని 31డిసెంబర్ 2018తో ముగిసిన మూడు నెలలు మరియు తొమ్మిది నెలల కాలానికి నమోదు చేసినది.
   అంతేకాక ఈ నష్టానికి సంబంధించి స్వీకరించదగిన భీమా మొత్తాన్ని కూడా కంపెనీ నమోదుచేసినది. పైన తెలిపిన నష్టాన్ని మరియు క్రెడిట్ చేసిన స్వీకరించదగిన భీమా మొత్తాన్ని ఈ ఆర్థిక ఫలితాల మినహాయింపదగిన అంశాలు కింద నికర ప్రాతిపదికన (₹ Nil) పేర్కొనబడినది. ఈ ఆర్థిక ఫలితాల తేది వరకు భీమా దాఖాలకు సంబంధించి భీమా సంస్థకు ఎటువంటి విభేదాలు లేవు.
   అంతేకాక కంపెనీకి సంబంధించిన ఆస్తులు, ప్లాంట్, పరికరాల తుది నష్టాన్ని కంపెనీ నిర్ణయించే ప్రక్రియలో ఉంది, మరియు ఈ దశలో తదుపరి భీమా దావా దాఖలయిన కంపెనీ వ్యాపారానికి సంబంధించిన అంతరాయ నష్టాన్ని నమోదు చేయలేదు.

తేది : 22 జనవరి 2019
స్థలం : గురుగ్రామ్

Visit our website at: www.atfoods.com

సం/-
మేనేజింగ్ డైరెక్టర్
సచిన్ గోపాల్
డిన్ : 07439079

సంపాదకీయం

విలువలకు విలువనివ్వాలి

రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యతలేమిటన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశ మవుతున్నది. ఎన్నికలయిన ఐదువారాల తర్వాత గానీ శాసనసభ్యుల ప్రమాణ స్వీకారానికి సమయం దొరకలేదు పాలకులకు. ప్రజల ప్రయోజనాలూ, ప్రజా స్వామ్యపు విలువలూ పక్కన బెడుతున్నారన్న విమర్శలకు రాష్ట్ర పాలకులే అవకాశం ఇస్తున్నారు. తమ వ్యక్తిగత విశ్వాసాలకూ, రాజకీయ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత నిస్తున్నారన్న అపవాదును మూట గట్టుకుంటున్నారు. ఎన్నికలకు ముందు గానీ, ఎన్నికల తర్వాత గానీ, యాగాలకూ, ఫెడరల్ ఫ్రంట్ చర్చలకూ, ప్రతిపక్ష శాసనసభ్యులకు గాలం వేసేందుకు ఇచ్చిన ప్రాధాన్యత ప్రజా సమస్యలకు, మంత్రివర్గం ఏర్పాటుకూ ఇవ్వలేదు. నిజామాబాద్ జిల్లా మారంపల్లిలో దళితులను గ్రామాభివృద్ధి కమిటీ నిర్ణయం పేరుతో గ్రామ పెత్తందారులు సాంఘిక బహిష్కరణ చేసారు. ఇంతవరకు వారి సమస్యలు పరిష్కరించిన నాథుడు లేడు. ఎన్నికలైన వెంటనే రాజధాని నడిబొడ్డున, కార్పొరేట్ ఆస్పత్రుల్లో డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల రోగి మరణించినట్టు ఆరోపణలు వచ్చాయి. అది శాంతిభద్రతల సమస్యగా కూడా మారింది.

ప్రజాస్వామ్యాన్నీ, లౌకిక విలువలనూ ఖాతరు చేయని వారు కేంద్రంలో కాంగ్రెసు, బీజేపీ ముక్తభారత్ గురించి చెప్పే మాటలను ప్రజలు విశ్వసించరు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే నమ్రతగా ఉండాలని పార్టీ శ్రేణులకు కేసీఆర్ సందేశమిచ్చారు. సాక్షాత్తూ, తానే ఇప్పుడా సందేశాన్ని ఉల్లంఘిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రాధినేత పునరాలోచించాలి. విలువలకు విలువనివ్వాలి.

అయినా ప్రభుత్వ జోక్యం శూన్యం. పదిలక్షల మంది రైతులకు రైతుబంధు నిధులం దలేదు. అధికారుల దయాదాక్షిణ్యాలకు వదిలేసారు. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ తక్షణమే టీచర్ పోస్టులు భర్తీ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటు చేసి ఉంటే, ఆయా శాఖల మంత్రులు ఈ సమస్యల మీద దృష్టి సారించే అవకాశం ఉండేది.



శాసనసభగానీ, మండలిగానీ జరిగిన తీరు కూడా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది. కనీసం పది రోజులైనా శాసనసభ సమావేశాలు నిర్వహించి ప్రజా సమస్యలు చర్చించి ఉండాల్సింది. రాష్ట్రంలో అసలు సమస్యలే లేవన్న ధోరణి సమస్యలెదుర్కొంటున్న ప్రజలపట్ల చులకన భావం ప్రదర్శించటమే అవుతుంది. పైన చెప్పిన సమస్యలే కాదు. ఇంకా లోతుగా, శాసనసభలో చర్చించవల్సిన కీలక సమస్యలున్నాయి. కౌలు రైతులకు రైతుబంధు అమలు చేస్తే సమస్యలు వస్తాయనీ, వాటిని పరిష్కంచలేమనీ ముఖ్యమంత్రి అన్నారు. రైతులే కానివారికి లక్షలాది రూపాయలు ముట్టజెబుతున్నారు. వంద ఎకరాల భూస్వాములకు ఖజానా నుంచి కట్టలు కట్టబెడుతున్నారు. అయినా రాని సమస్యలు... నిజమైన రైతులుగా, భూమి దున్నుతున్న కౌలురైతులకు రైతుబంధు అమలు చేస్తే వస్తాయా? ఆ సమస్యలేమిటో.. పరిష్కరించటం ఎందుకు సాధ్యం కాదో శాసన సభ ముందుంచవచ్చు కదా! ఈ నెలలోనే రాష్ట్రంలో పదిలక్షల మంది కార్మికులు కనీస వేతనాలు కోరుతూ రెండు రోజులు సమ్మె చేశారు. 73రంగాలకు చెందిన కార్మికులకు ఐదు నుంచి పది సంవత్సరాలుగా కనీసవేతనాలు పెంచలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత.... ఆ ఫైళ్లను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వానికి పైసా భారం పడని ఈ విషయంలో కనీస వేతనాల జీవో విడుదలకు ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటో సభలో చర్చించవచ్చు. కష్టపడే కార్మికుల కడుపు కొట్టి యజమానుల లాభాలు పెంచే చర్యలు ప్రభుత్వం ఎందుకు చేపట్టాలి? రైతుల ఆత్మహత్యలు నివారించే విధంగా శాశ్వత చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో చెప్పారు. అందుకు నిర్దిష్ట కార్యాచరణ ఏమిటో శాసనసభ్యుల ముందుంచవచ్చు. ఇవేమీ లేకుండా, కేవలం తమ ఎన్నికల వాగ్దానాల అమలుకు గ్యారెంటీ ఇస్తామన్న పద్ధతిలో గవర్నరు ప్రసంగంలో చెప్పి చేతులు దులుపుకున్నారు. టీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో లేని సమస్యలు సమస్యలే కాదా అన్న ప్రశ్న ముందుకు వస్తున్నది. ఇలాంటి మౌలిక, ఆర్థిక, సామాజిక సమస్యలను ముట్టుకోవడానికే ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతున్నదో చర్చించే వేదికలు చట్టసభలే కదా! అలాంటి శాసనసభ కేవలం సభ్యుల ప్రమాణ స్వీకారం, గవర్నరు ప్రసంగం, ధన్యవాదాల తీర్మానం వంటి చట్టపరమైన తంతులకు మాత్రమే పరిమితం చేసి ముగించడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించటం కాక ఏమిటి? ఇక శాసన మండలి ఉదయం ప్రారంభించి సాయంత్రానికి ముగించారు.

యజ్ఞయాగాలు, పూజలు వ్యక్తిగతం. కానీ ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులంతా యాగక్షేత్రం చుట్టూ చేరడమంటే రాజ్యాంగ విలువలకు ఇస్తున్న గౌరవం ఎంత? పాలకులు ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్న రాజ్యాంగ ఆదేశాలను సైతం ఖాతరు చేయకపోవడం దేనికి సంకేతం?

ఎన్నికల విజయాల నేపథ్యంలో పార్టీ శ్రేణులు ప్రశ్నించే ధైర్యం చేయకపోవచ్చు. చతికిలపడి ఉన్న ప్రతిపక్షాలూ విమర్శలకు వెనుకాడవచ్చు. కానీ సమాజం గమనిస్తున్నది. శాసనసభ ప్రాధాన్యతనే పట్టించుకోని నిర్లక్ష్య ధోరణిని ప్రజాస్వామ్యవాదులు ఆమోదించజాలరు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్నీ, లౌకిక విలువలనూ ఖాతరు చేయనివారు కేంద్రంలో కాంగ్రెసు, బీజేపీ ముక్తభారత్ గురించి చెప్పే మాటలను ప్రజలు విశ్వసించరు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే నమ్రతగా ఉండాలని పార్టీ శ్రేణులకు కేసీఆర్ సందేశమిచ్చారు. సాక్షాత్తూ, తానే ఇప్పుడాసందేశాన్ని ఉల్లంఘిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్రాధినేత పునరాలోచించాలి. విలువలకు విలువనివ్వాలి.

ఎన్నడూలేనంతగా వ్యవసాయోత్పత్తుల ధరల పతనం



రోషన్ కిషోర్

గత రెండు దశాబ్దాలలో ఎన్నడూ లేనంతగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ ఆదాయాలు అడుగంటాయి. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ డాటా వ్యవసాయ సంక్షోభం తీవ్రతను తెలియజేస్తున్నది. బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వం రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ఎదుర్కోవటంలో ఇదే కీలక సమస్య కానుంది. గత

వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవటానికి కారణం దళారులనే భావన తప్పని ఈ మధ్య అందుబాటులోకి వచ్చిన హెూల్‌సేల్ ధరల సూచీ గణాంకాలు తెలియజేస్తున్నాయి. సెప్టెంబరు, డిసెంబర్ త్రైమాసికాలలో తయారీ రంగం నుంచి విడుదలైన ఆహార పదార్థాలు కూడా ప్రతికూలత ఎదుర్కొన్నాయి. వినిమయ ధరల సూచీలో 40శాతం వాటా వున్న ఆహార పదార్థాల ధరలు పడిపోవటంతో మొత్తంమీద ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుందనే వాస్తవం ప్రభుత్వానికి ఊరటగా ఉంది.

సోమవారం వాణిజ్య, పారిశ్రామిక మంత్రిత్వశాఖ విడుదల చేసిన డిసెంబరు నెల హెూల్‌సేల్ ధరల సూచీ(డబ్ల్యుపిఐ) డాటాను అనుసరించి ప్రాథమిక ఆహార పదార్థాల ఉపాంగం పరిస్థితి 2018వ సంవత్సరం జులై నుంచి గత ఆరు నెలలుగా ప్రతికూలంగా ఉన్నది. అంటే వాటి ధరలు పడిపోతున్నాయని అర్థం. రైతులు చిల్లరగా కాకుండా హెూల్ సేల్‌గా తమ ఉత్పత్తులను అమ్ముకుంటారు కాబట్టి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎలా ఉన్నాయో తెలియటానికి ప్రాథమిక ఆహార ఉత్పత్తుల హెూల్‌సేల్ ధరల సూచీ బాగా ఉపయుక్తంగా ఉంటుంది. 2018వ సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో ప్రాథమిక ఆహార పదార్థాల ఉపాంగానికి చెందిన వినిమయ ధరల సూచీ(కన్‌స్యూమర్ ప్రైస్ ఇండెక్స్-సిపిఐ) కూడా ప్రతికూలంగానే ఉంది. అయితే వ్యవసాయేతర ఆర్థికవ్యవస్థలో హెూల్‌సేల్ ధరలు తగ్గలేదనే వాస్తవాన్ని గమనించాలి. ఈ కాలంలో హెూల్‌సేల్ ధరల సూచీ మొత్తంమీద సానుకూలంగానే ఉంది. వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవటం, వ్యవసాయేతర వస్తువుల ధరలు పెరగటం కారణంగా రైతులకు సంబంధించిన వాణిజ్య షరతులు(టర్మ్స్ ఆఫ్ ట్రేడ్) క్షీణించి రైతులు నష్టపోయారని విశ్లేషకులు భావిస్తున్నారు.

డిసెంబర్‌లో ప్రాథమిక ఆహార పదార్థాల ఉపాంగానికి చెందిన హెూల్‌సేల్ ధరల సూచీ -0.1శాతం ఉంది. అంతకుముందటి ఐదు నెలలలో అది వరుసగా -2.1శాతం, -4శాతం,-0.2శాతం, -1.4శాతం, -3.3శాతంగా ఉంది. ప్రాథమిక ఆహార పదార్థాల ఉపాంగానికి చెందిన హెూల్‌సేల్ ధరల సూచీ చివరిసారి 1990వ సంవత్సరంలో వరుసగా రెండు త్రైమాసికాలలో ప్రతికూలంగా ఉంది. అలా వ్యవసాయోత్పత్తుల ధరలు తగ్గటం వల్ల నామమాత్రపు వ్యవసాయ ఆదాయాలు పతనమయ్యాయి. అలా 2000-01లో జరిగింది. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ ఆదాయాన్ని రెండింతలు చేస్తానన్న నరేంద్ర మోడీ అతిపెద్ద వాగ్దానాలలో ఒకటి. ఇటీవల కాలంలో ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ కౌన్సిల్‌లో వ్యవసాయంపై చేసిన తీర్మానంలో కూడా ఈ విషయాన్ని పునరుద్ఘాటించారు. ఆ తీర్మానం ఇలా పేర్కొంది: "ఈమధ్య కాలంలో వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెరిగాయి. 'వ్యవసాయ ఆదాయాన్ని రెండింతలు చేసే' లక్ష్యాన్ని చేరుకోవటానికి ఈ ప్రభుత్వం వేగంగా కదులుతోంది. బీజేపీ ప్రభుత్వ పాలనలో 'వ్యవసాయ ఆదాయాన్ని రెండింతలు చేసే' లక్ష్యం నెరవేరుతుందని ఈ జాతీయ కౌన్సిల్ తన నమ్మకాన్ని వ్యక్తం చేస్తోంది". విశ్లేషకుల ప్రకారం డిసెంబర్‌లో హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలైన చత్తీస్‌గడ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో బీజేపీ ఓడిపోవటానికి గల కారణాలలో వ్యవసాయ సంక్షోభం ఒకటి. 2019లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఓటమి పునరావృతం కారాదని బీజేపీ కోరుకుంటోంది. రానున్న ఎన్నికలకు ముందు వ్యవసాయ రంగానికి ఒక ప్యాకేజీ ఇవ్వాలని ఈ ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అలా ప్రకటించబోయే ప్యాకేజీలో వ్యవసాయ రుణాలను రద్దు చేయటం, రైతులకు ప్రత్యక్ష ఆదాయ మద్దతు, కేవలం ఒకే ఒక రూపాయికి పంట బీమా, పంటనష్టాల నుంచి బయటపడటానికి ఎకరానికి రెండువేల రూపాయలను రైతులకు బదిలీ చేయటం వంటి చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. "వ్యవసాయ రంగంలో ధరల పెరుగుదల సంక్షోభం ఒక రాజకీయ ఆర్థిక సమస్య. వ్యవసాయ ఉత్పత్తుల ధరలను తొక్కిపెట్టటం ద్వారా దేశీయ ఆర్థిక వ్యవస్థను, రైతాంగాన్నీ నష్టపరుస్తూ మధ్యతరగతిని, రేటింగ్ ఏజన్సీలనూ సంతృప్తి పరచటానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది" అని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో అసోషియేట్ ప్రొఫెసర్ హిమాన్షు అన్నారు. "ఖరీఫ్‌లో కనీస మద్దతు ధరను పెంచటంతో ఏమీ ఉపయోగం జరగ లేదు. ఎందుకంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ లోటు కూడా ఉంది. గ్రామీణ వేతనాలలో పెరుగుదల లేకపోవటంచేత వ్యవసాయ ఋణ మాఫీ, కనీస మద్దతు ధర పెంపుదలతో సంబంధంలేని డిమాండ్, కొనుగోలుశక్తి క్షీణించాయి" అని కూడా ఆయన అన్నారు.

రైతులపైన పంపిణీకి చెందిన ప్రతికూల ప్రభావంతోపాటు ఆహార ధాన్యాల ధరలు పెరగకపోవటం వల్ల కూడా భారత ఆర్థిక వ్యవస్థపై స్థూల ప్రభావం ఏర్పడుతుంది. ధరలు పడిపోవటంచేత, గ్రామీణ వేతనాలలో పెరుగుదల అంతంతమాత్రంగా ఉండటం నామమాత్రపు గ్రామీణ ఆదాయాలు పడిపోయి ఆర్థిక వ్యవస్థలో వినిమయ డిమాండ్ కుదింపునకు గురవుతుంది. వినిమయ వృద్ధి ఇప్పటికే తగ్గుముఖం పట్టిన సమయంలో మొత్తం వృద్ధిపైన కూడా దీని ప్రభావం ప్రతికూలంగా ఉంటుందని ముంబాయిలోని ఐడీఎఫ్‌సీ ఇన్‌స్టిట్యూట్‌లో రిసెర్చ్ డైరెక్టర్‌గాను, సీనియర్ ఫెల్లోగాను పనిచేస్తున్న నిరంజన్ రాజ్యాధ్యక్ష అన్నారు. "ఆహారధాన్యాల ధరలు పెరగపోవటమనే ప్రతిద్రవ్యోల్బణం కారణంగా వ్యవసాయరంగానికి వాణిజ్య షరతులు మరింత ప్రతికూలంగా మారాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సంక్షోభం ఆదాయాలకు సంబంధించినదే కానీ సంపదకు సంబంధించినది కాదనే వాస్తవాన్ని కూడా ఇది ఎత్తి చూపింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని సంక్షోభాన్ని గృహ నిర్మాణం, టాయిలెట్ల నిర్మాణం వంటి సంపదను సృష్టించటానికి సహాయపడటం ద్వారా పరిష్కరించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. దీనితో సమస్య పరిష్కారం కాదు. అంతేకాకుండా గ్రామీణ ఆదాయాలలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించటానికి ప్రభుత్వానికి కాలాతీతమైంది" అని కాంగ్రెస్




డాటా ఎనలిటిక్స్ డిపార్ట్‌మెంట్ చైర్మన్ అయిన ప్రవీణ్ చక్రవర్తి అన్నారు. బీజేపీకి వేరే అవగాహన ఉంది. "ధరలు పడిపోవటం అంటే ద్రవ్యోల్బణం పడిపోవటం ఎల్లవేళలా మంచి సూచికగా ఉంటుంది. ఎందుకంటే ఇది పేదలకు అనుకూలం. అయితే ద్రవ్యోల్బణం పెరిగినప్పుడల్లా సరఫరా గొలుసులో వుండే సమస్యల కారణంగా రైతుల ఉత్పత్తులకు మంచిధర లభించాలని ఏమీలేదు. ద్రవ్యోల్బణం తగ్గుతుంటే రిజర్వ్‌బ్యాంకు వడ్డీరేట్లను తగ్గిస్తుంది. అది అధికోత్పత్తికి దారితీస్తుంది" అని బీజేపీ అధికార ప్రతినిధిగావున్న గోపాల్ అగర్వాల్ అన్నారు.

అయితే వ్యవసాయరంగంలో వర్తమానంలో నెలకొన్న సంక్షోభం వ్యవసాయోత్పత్తుల వృద్ధి పడిపోవటం వల్ల కాకుండా వాటి ధరలు పడిపోవటం వల్ల ఏర్పడింది. 2018 జులైలో రైతులకు ఉత్పత్తి వ్యయంపై 50శాతం ఆదాయం వచ్చేలా చేయటం కోసం 14రకాల పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర(ఎమ్ఎస్‌పి)లను ప్రకటించింది. సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సిఎమ్ఐఇ) డాటాబేస్ ఆధారంగా 1983వ సంవత్సరం జూన్ నుంచి చూసినప్పుడు ప్రాథమిక ఆహార పదార్థాల ఉపాంగ హెూల్‌సేల్ ధరల సూచీ వార్షిక వృద్ధిలో వరుసగా రెండు త్రైమాసికాలలో ప్రతికూలంగా ఉండటం 1989 డిసెంబరు, 1990 మార్చిలో జరిగింది. ఈ విశ్లేషణ హెూల్‌సేల్ ధరల సూచీకి చెందిన 2004-05, 2011-12 సిరీస్ రెండింటినీ ఉపయోగించింది.

స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ వృద్ధిని వర్తమాన, నిలకడ(కన్‌స్టంట్) ధరలవద్ద పోల్చినప్పుడు వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవటం చేత రైతుల ఆదాయాలు పడిపోయాయనే విషయం మనకు తెలుస్తుంది. 2018-19వ సంవత్సరానికి చెందిన స్థూల జాతీయోత్పత్తి ముందస్తు అంచనాలను సెంట్రల్ స్టాటిస్టికల్ ఆఫీసు గతవారం విడుదల చేసింది. వ్యవసాయ, ఇతర అనుబంధ కార్యకలాపాలలో జోడించిన స్థూల విలువ(గ్రాస్ వాల్యూ యాడెడ్-జీవిఏ)లో వర్తమాన, నిలకడ ధరల వృద్ధిలో గల తేడా -0.1శాతం పాయింట్‌గా ఉంది. మొత్తం జీవిఏలో ఈ తేడా 4.8శాతం పాయింట్లుగా ఉంది. దీర్ఘకాల ధోరణులను పోల్చటానికి నిలకడ ధరలతో అందే ఆదాయాలు ఉపయోగపడతాయి. ఒక రంగంలో వర్తమాన ధరల వద్ద ఆదాయాలు పతనమైనప్పుడు ఆ రంగంలోని ఉద్యోగుల ఆదాయ, వినిమయాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయి. 2011-12, 2004-05 స్థూల జాతీయోత్పత్తి సిరీస్‌లతో చూసి వ్యవసాయరంగంలో వృద్ధిరేట్లను పోల్చినప్పుడు 2000-01సంవత్సరం తరువాత వ్యవసాయోత్పత్తుల ధరలు ఇంతగా పతనమవలేదనే విషయం తెలుస్తుంది. మొదటి రెండు త్రైమాసికాల వాస్తవ ఆర్థిక డాటా ఆధారంగా మాత్రమే మొదటి ముందస్తు అంచనాలను ప్రకటించారనేది నిజం. అవి ఆ తరువాత మారవచ్చు. అంతేకాకుండా రైతులు అమ్మే వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవటమనే ప్రస్తుత ధోరణి కొనసాగితే నామమాత్రపు వ్యవసాయ ఆదాయాల వృద్ధి మరింతగా క్షీణించవచ్చు కూడా. 2014 సంవత్సరం తరువాత కనీస మద్దతు ధరలను అత్యంత ఎక్కువగా ప్రకటించిన నేపథ్యంలో అందుతున్న ఈ గణాంకాలు ప్రభుత్వానికి ఆందోళనకరంగా మారాయి. ఖరీఫ్ సీజన్‌లో అత్యంత ప్రాధాన్యతగల వరిపంటకు 2018-19లో కనీస మద్దతుధర 12.9శాతం పెంచారు. ఈ పెరుగుదల 2014-15, 2017-18 సంవత్సరాలలో 3.7శాతం నుంచి5.4శాతం మాత్రమే ఉంది. మద్దతుధరలు వ్యవసాయోత్పత్తుల ధరల పతనాన్ని అడ్డుకోలేక పోతున్నాయనే విషయాన్ని రిజర్వ్‌బ్యాంకు కూడా గమనంలోకి తీసుకుంది. "అనేక ఆహారపదార్థాలు ముఖ్యంగా చెడిపోయే స్వభావం గల ఆహార పదార్థాల ధరలు సాధారణ స్థాయికంటే చాలా తక్కువగా ఉంటున్నాయి. అంతేకాకుండా జులైలో పెంచిన కనీస మద్దతుధరల ప్రభావం నామమాత్రంగానే ఉందన్న విషయం అందుబాటులో వున్న డాటా తెలియజేస్తుంది" అని డిసెంబరు3-8తేదీల మధ్య జరిగిన రిజర్వ్‌బ్యాంకు మానెటరీ పాలసీ కమిటీ మినిట్స్‌లో నమోదు చేశారు. వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవటానికి కారణం దళారులనే భావన తప్పని ఈ మధ్య అందుబాటులోకి వచ్చిన హెూల్‌సేల్ ధరల సూచీ గణాంకాలు తెలియజేస్తున్నాయి. సెప్టెంబరు, డిసెంబర్ త్రైమాసికాలలో తయారీ రంగం నుంచి విడుదలైన ఆహార పదార్థాలు కూడా ప్రతికూలత ఎదుర్కొన్నాయి. వినిమయ ధరల సూచీలో 40శాతం వాటా వున్న ఆహార పదార్థాల ధరలు పడిపోవటంతో మొత్తంమీద ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుందనే వాస్తవం ప్రభుత్వానికి ఊరటగా ఉంది.

(హిందుస్తాన్ టైమ్స్ సౌజన్యంతో)
(అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్: 8886396999)

దౌర్జన్యం చేసే వీడీసీలెందుకు?



స్కైలాబ్ బాబు

అవి విలేజ్ డెవలప్ మెంట్ కమిటీలు (వీడీసి) కాదు. విలేజ్‌పై దౌర్జన్యం చేసే కమిటీలు. ప్రశాంతమైన గ్రామీణ జీవనంపై ఆధిపత్యం చేస్తూ అరాచకాలు చేస్తున్న కమిటీలు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, జగిత్యాల, నిర్మల్ ప్రాంతాల్లో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలది ఆడిందే ఆట, పాడిందే పాట. పోలీసు, చట్టాలు, కలెక్టర్, అధికార యంత్రాంగం అన్నీ ఉన్నప్పటికీ వీరి మాటలు ఈ గ్రామాల్లో చెల్లవు. వీడీసి ఏది చెబితే అదే వేదం. సుమారు 200 గ్రామాల్లో వీడీసీల పెత్తనం కొనసాగుతుంది. పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు రిజర్వేషన్లతో సర్పంచులు కావడంతో తమ ఆధిపత్యం కోల్పోతున్నామనుకున్న అగ్రకుల పెత్తందారుల పట్టు గ్రామాల్లో సడలకుండా ఉండడానికే ఈ వీడీసీలను ఏర్పాటు చేశారు. ప్రతీ కులానికి ఇద్దరు చొప్పున ఈ కమిటీల్లో చేర్చుకుంటారు. నూటికి 90శాతం గ్రామాల్లో అధ్యక్ష స్థానంలో మాత్రం ఆధిపత్య కులాలే వున్నాయి. దీంతో గ్రామ పెత్తనం తిరిగి వారిదే కాగా ఎన్నికైన సర్పంచులు, ఎంపీటీసీలు కేవలం ఉత్సవ విగ్రహాలుగానే మిగిలిపోతున్నారు. జక్రాన్‌పల్లి మండలంలో చింతలూర్ గ్రామ సర్పంచ్ (ఎస్సీ) ని వీడీసీ గ్రామ బహిష్కరణ చేసింది. రూ. 1,20,000/-లు జరిమాన వేసి అది చెల్లించిన తరువాతే తిరిగి సాంఘీక బహిష్కరణ ఎత్తివేశారు. గొల్ల కురుమలు గొర్లను ఏ ధరకు అమ్మాలో వారే నిర్ణయిస్తారు. ఊరి పండగలకు వారు చెప్పినవిధంగా గొర్లు, మేకలు ఉచితంగా ఇవ్వాలి. ఇవ్వకపోతే సాంఘీక బహిష్కరణ చేస్తారు. మంగళి క్షవరం ఎంతకు చేయాలి, గీత కార్మికుడి కల్లు సీసా ధర ఎంత ఉండాలో, బెల్టుషాపులు ఎన్ని ఉండాలి, ఎంత ధరకు అమ్మాలి, కోడిగుడ్డు ధర, కోడి ధర, మత్స్యకారులు సంవత్సరానికి వీడీసీకి ఎన్ని క్వింటాళ్ళ చేపలు ఉచితంగా ఇవ్వాలి, కిలో చేప ధర ఎంత ఉండాలో నిర్ణయించేదీ వీడీసీలే. వడ్డెరలు వీడీసీల అవసరానికి గ్రానైట్ రాయి ఉచితంగా ఇవ్వాలని షరతులు విధిస్తారు. షరతులు అమలు చేస్తే ఫర్వాలేదు... లేకుంటే సాంఘీక బహిష్కరణే.

ప్రత్యేకించి ఆర్మూర్ ప్రాంతంలో నెలకొక గ్రామంలో సాంఘిక బహిష్కరణలు జరుగుతు న్నాయి. ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో మధుకర్ రెడ్డి గారు మాల, మాదిగలకు ఇనాం ఇచ్చిన 40 ఎకరాల భూమి ఉండగా, అట్టి భూమిలో 4ఎకరాలు వీడీసీలు అమ్ముకోజూస్తే మాల మాదిగలు ఐక్యంగా ఉద్యమించారు. దీంతో ఎస్సీలను సాంఘిక బహిష్కరణ చేశారు. ఇదే మండలం ఇస్సాపల్లి గ్రామంలో ఎస్సీలు గణపతి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఊరేగింపు చేస్తామన్నందుకు దళితులను సాంఘీక బహిష్కరణ చేసారు. నందిపేట మండలం వెల్‌మల్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటును అడ్డుకున్నారు. మోపాల మండలం బోర్గాం (పి) గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని గ్రామపంచాయతీ ముందు పెట్టడానికి దళితులు ప్రయత్నించగా, వీడీసీ అడ్డుకుని సాంఘీక బహిష్కరణ చేసింది. బీంగల్ మండలం బెజ్జోరా గ్రామంలో దేవీమాతా గుడిలోకి వెళ్తామన్నందుకు సాంఘిక బహిష్కరణ చేశారు. మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలో ఎస్సీ మహిళా సర్పంచ్ భూమిని గ్రామ పశువులు మేపడానికి ఇవ్వాలన్న వీడీసీ షరతుకు అంగీకరించ నందుకు ఆమెను సాంఘీక బహిష్కరణ చేశారు. మోర్తాడ్ మండలం వడ్డిమార్ట్ గ్రామంలో కల్లుగీత కార్మికులు తమ సొసైటీ పేరిట 3 ఎకరాల భూమిని తాటిచెట్ల పెంపకానికి కొనుక్కున్నారు. అట్టి భూమిని వీడీసీ కి ఇవ్వాలని షరతు విధించగా, అందుకు అంగీకరించనందుకు 40 గీతకార్మిక కుటుంబాలను గ్రామంనుండి వెలివేశారు. ఎర్రగట్ల మండల కేంద్రంలో గీతకార్మికులు కల్లు అమ్మకాల ద్వారా ఏటా రూ.10 లక్షలు వీడీసీకి ఇవ్వాలని షరతుపెట్టారు. అంగీకరించనందుకు తాటిలొట్లను పగులగొట్టారు. ముప్కాల్ గ్రామంలో గీతకార్మికులు ఉచితంగా జాతరకు కల్లు పోయాలని నిర్ణయించగా మేము పొయ్యం అన్నందుకు ఈత వనాన్ని తగులబెట్టారు. వేల్పూరు మండలం, పడ్గల్ గ్రామంలో వడ్డెర్లను సాంఘీక బహిష్కరణ చేశారు. ఆర్మూర్ మండలం ఆలూరు గ్రామంలో ఎస్సీల స్మశానవాటికలో వీడీసీలు కర్షక భవన్ నిర్మిస్తామని చెప్పగా దళితులు అంగీకరించనందుకు సాంఘీక బహిష్కరణ చేశారు. ఎమ్మెల్యేలు ఎప్పుడైనా గ్రామానికి వచ్చి గ్రామసభ నిర్వహిస్తే వీడీసీ అధ్యక్షుడే ఆ సభలో కీరోల్ చేస్తాడు. సర్పంచు, ఎంపీటీసలకు సరైన గౌరవం ఇవ్వరు. సాంఘిక బహిష్కరణ జరిగిన ప్రతీచోట దళితులు కేసులు పెడితే అధికార పార్టీ స్థానిక ఎమ్మెల్యే అండదండలతో రాజీ కుదుర్చుతోందే తప్ప ఏ ఒక్కరికీ శిక్ష పడడంలేదు. దీంతో వీడీసీలు మరింత పేట్రేగిపోతున్నాయి. నందిపేట మండలం మారంపల్లి గ్రామంలో వీడీసీ అన్ని కులాలకు భవనాలు నిర్మిస్తామని ప్రతీ కులంనుండి రూ.50వేలు చొప్పున వసూలు చేశారు. ఎస్సీ మాల కుటుంబాలు రూ.50వేలు చెల్లించారు. అయినప్పటికీ భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో దళితులే అంబేద్కర్ భవన నిర్మాణానికి పూనుకోగా ఆగ్రహించిన వీడీసీలు అడ్డుకున్నారు. దళిత యువతరం ప్రతిఘటించడంతో 80 ఎస్సీ కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేశారు. పొలం దున్నడానికి ట్రాక్టరు కిరాయికి ఇవ్వనీయలేదు, క్రిస్టమస్ పండగకు బట్టలు కుట్టనీయలేదు, ఆర్ఎంపీ డాక్టరు వద్ద వైద్యం చేయించుకోనీయలేదు, ఆటో ఎక్కనీయలేదు. ఎముకలు కొరికే చలిలో దళితులు టెంట్‌కింద బిక్కుబిక్కుమంటూ నేటికీ సాంఘిక బహిష్కరణను అనుభవిస్తున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు వీడీసీల ఆగడాలను గమనిస్తూనే చోద్యం చూస్తున్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించే ప్రజా ప్రతినిధులు, అధికారులు రాజ్యాంగేతర శక్తిగా ఉన్న వీడీసీలను ఎందుకు నిషేధించడం లేదు?

సెల్: 9177549646

విజ్ఞాన సభలో... అజ్ఞానమా?



సి.సాంబిరెడ్డి

మానవ కళ్యాణానికి తోడ్పడేది శాస్త్ర విజ్ఞానం. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధికాకముందు ప్రపంచమంతా అంధకారం ఆవహించి వుండేది. 16,17 శతాబ్దాల్లో చోటుచేసుకున్న పునర్వికసనోద్యమంతో ఐరోపా దేశాలు ఆ అంధకారం నుండి బయటపడ్డాయి. కోపర్నికస్, గెలీలియో, లాప్లాస్ లాంటి మహామహులు తమ ప్రయోగాల ఆధారంగా, చర్చి, క్రైస్తవమత బోధనలకు విరుద్ధంగా భూమిచుట్టూ సూర్యుడు కాదు, భూమియే సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉందని సిద్ధాంతీకరించారు. దానికి ఆనాటి చర్చి మరియు ఆ దేశాల్లోని ప్రభుత్వాలు కలిసి వారిని జైలుపాలు చేశాయి. అయినా శాస్త్ర విజ్ఞానం మరింత వేగంతో ముందుకు పోయింది. అప్పటివరకు గుడ్డిగా నమ్మిన ప్రతి విషయాన్ని ప్రశ్నించడం ప్రారంభమైంది. హేతువు కందని ప్రతి విషయాన్నీ చెత్తబుట్టలోకి నెట్టివేశారు. ఆ వరవడిలోనే న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతం వునికిలోకి వచ్చింది. అట్లాగే ప్రకృతిలోని సకల జీవరాశులు బైబిల్‌లో చెప్పినట్టుగా ఒక వారంలో సృష్టించబడలేదని, లక్షలాది సంవత్సరాల పరిణామ క్రమంలో భాగంగా కోటాను కోట్ల వైవిధ్యభరితమైన జీవరాశులు ఉద్భవించాయని డార్విన్ రుజువు చేసాడు. యిలాంటి ఆవిష్కరణలతో ప్రపంచం గొప్ప ముందడుగు వేసింది.

ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని పలుదేశాలపై పాశ్చాత్య దేశాలు పై చేయి సాధించానికి మూలం వారి పునర్వికసనోద్యమమే. మనదేశంలో కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి బీజాలు పడివుంటే, ఐరోపా దేశాలకంటే ముందే యీ వికసనోద్యమం మన దేశాలలో ప్రారంభమై వుంటే, యిక్కడ కూడా మనం మతమౌఢ్యాన్ని ప్రశ్నించగలిగి వుంటే, మనం కూడా హేతుబద్ధంగా ఆలోచించటం ప్రారంభించి వుంటే మన బుర్రలకు పట్టిన బూజు కూడా వదిలి వుండేది. యిక్కడా వ్యవసాయ పారిశ్రామిక రంగాలు విస్తరించి వుండేవి. అప్పుడు బ్రిటీష్ వాళ్లకు మనలను వోడించటం సాధ్యమయ్యేది కాదు. మనకు 200సంవత్సరాల బానిసత్వం తప్పి ఉండేది.

స్వాతంత్ర్య పోరాటంలో అన్ని వర్గాలు, కులాలు ఏకమయ్యాయి. కాబట్టే విధిలేక బ్రిటీష్ వాళ్లు దేశాన్ని వదలి వెళ్లిపోవలసి వచ్చింది. అందరూ పోరాటంలో పాల్గొన్నారు. కాబట్టి స్వాతంత్ర్య ఫలాలు అందరికీ దక్కాల్సిన పరిస్థితి యేర్పడింది. అయినా పాలక వర్గాలు పేద ప్రజానీకానికి మడులు,మాన్యాలు యివ్వకపోయినా వారు రచించిన రాజ్యాంగం అందరికి సామాజిక, రాజకీయ సమానత్వాన్ని పంచి పెట్టింది. ఆ విధంగా రాజ్యాంగం మనుధర్మాన్ని కొంతమేరకు వెనక్కు నెట్టగలిగింది. అయినా మన సామాజిక చైతన్యంలో అది నేటికీ ఒక భాగంగానే మిగిలిపోయింది. తాత్కాలికంగా వెనకడుగు వేసినా తగిన సమయం కొరకు యింతకాలం అది యెదురు చూస్తూనే వుంది. భారత రాజకీయ రంగంలో యీ మధ్య మతోన్మాద, తిరోగమన వాదులది పైచేయి కావటంతో మనుధర్మం చెలరేగిపోతూ వుంది. మనుధర్మానికి వ్యతిరేకమైన హేతువాదం, శాస్త్ర విజ్ఞానం, అభ్యుదయ భావాలపై యెదురు దాడి ప్రారంభమైంది.

యీ నేపధ్యంలో పంజాబు రాష్ట్రంలోని జలంధర్ పట్టణంలో గతవారం 106వ యిండియన్ సైన్సు కాంగ్రెస్ జరిగింది. దానిలో కొందరు శాస్త్రజ్ఞులు చేసిన ప్రసంగాలు, వారు సమర్పించిన పత్రాలను చూసి విజ్ఞాన ప్రపంచం విస్తుపోయింది. సభకు హాజరైన అనేక మంది



స్వదేశీ,విదేశీ ప్రతినిధులు నవ్వుకున్నారు. శాస్త్ర విజ్ఞానమంతా భౌతిక ప్రపంచాన్ని గురించే. భౌతిక ప్రపంచాన్నే, ప్రకృతినే శాస్త్రజ్ఞులు అధ్యయనం చేస్తారు. ప్రకృతి రహస్యాలను వెలికి తీస్తారు. మన జీవితాలలో వెలుగులు నింపుతారు. అక్కడ విశ్వాసాలకు తావులేదు. అయినా మనువాదులు ఆ మహాసభలో తమ నమ్మకాల గురించే మాట్లా డారు. తాము చెప్పిన వాటికి వారు రుజువులేమీ చూపలేదు. రుజువులేని విషయాలకు శాస్త్ర సమ్మతం వుండదు. ఉదాహరణకు ప్రఖ్యాత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గా వున్న ప్రొ॥ నాగేశ్వరరావు. ఆయన రసాయనిక శాస్త్రజ్ఞుడు. ఆయన కౌరవులు టెస్టు ట్యూబ్‌బేబీలని చెప్పాడు. దీనికి రుజువులు అవసరంలేదా? రామాయణ కాలంలోనే గైడెడ్‌మిసైల్స్ వున్నాయట. రావణాసురుడికి 24 రకాల విమానాలు, యుద్ధ విమానాలు ఉన్నాయట. లంకలో విమాన స్థావరాలు యెన్నో వున్నాయట. అట్లాగైతే యుద్ధంలో రావణుడిని ఓడించిన రామునికి ఎన్ని విమానాలుండాలి? వుంటే వాళ్ల మధ్య నేలమీదనే కాక వైమానిక యుద్ధం కూడా జరిగిందా? ఆ యుద్ధంలో మనకు కన్పించే ఆయుధాలు విల్లంబు, గద, కత్తి, డాలు మాత్రమే. వాళ్ల విమానాలు వాడారని చారిత్రక పరిశోధనలలో యేమైనా బయట పడ్డాయా? బయటపడితే మహాసభలో ఆ పరిశోధనల గురించి చెప్పి వుండవచ్చును, కదా! రుజువులు లేవు కాబట్టే చెప్పలేదు. అతని కంటే ఘనుడు ఆచంటమల్లన్న అన్నట్టు ఆ ప్రక్కనే తమిళనాడుకు చెందిన శాస్త్రవేత్త కె.జె. క్రిష్ణన్ మరింత ముందుకు పోయి ఐన్‌స్టీన్, న్యూటన్‌లు అసలు శాస్త్రవేత్తలే కాదు పొమ్మన్నాడు. వారికంటే తానే మేలైన శాస్త్రవేత్తనని చెప్పుకున్నాడు. జాతీయ అభిమానం వుండవలసిందే. కానీ దురభిమానం తగదు కదా? ఆ శాస్త్రజ్ఞుల ఆవిష్కరణలు సార్వజనీనాలు. వాటి ప్రయోజనం పొందని మానవ మాత్రుణ్ణి మొత్తం మానవ ప్రపంచంలో ఒక్కరినైనా చూపగలరా? వారి ఆవిష్కరణలు లేకపోతే మానవ సమాజం యేదశలో వుండేది? పాశ్చాత్య ప్రపంచం చర్చి యేలుబడిలోను, మన దేశం మనుధర్మ శాస్త్రం యేలుబడిలోను వుండేవి.

మన ప్రధాని మోడీ కూడా యేమీ తక్కువ తినలేదు. పురాణ కాలంలోనే మన దేశంలో ప్లాస్టిక్ సర్జరీ వుండేదని, వినాయకుడికి ఏనుగుతలను అతికించారని చెప్పారు. మరొక బీజేపీ ముఖ్యమంత్రి ఆ కాలంలోనే యింటర్‌నెట్, వై.ఫై సౌకర్యాలు వున్నాయని శెలవిచ్చాడు. వీరిని మించిన మరొకాయన పులిచర్మం మీద యోగా చేస్తే ముసలితనం రాదని చెప్పాడు. మంచిదే. ఆయన చేసి చిరంజీవి అయితే మనమూ వారు చెప్పేదానిని నమ్మటమే కాదు, ఆచరిస్తాం కూడా. అయితే, సాపేక్ష సిద్ధాంతం ప్రకారం కాంతి వేగంతో ప్రయాణించగలిగిన వారు చిరంజీవు లౌతారు. ఆ వేగంతో ప్రయాణించే వారికి కాలం స్థంభించిపోతుంది. కాబట్టి అలాంటి స్థితిలో యే వయసువాళ్లు ఆవయసులోనే వుండిపోతారు. కాబట్టి వారు చిరంజీవులు. కాని ఆవేగాన్ని అందుకోవటం అసాధ్యం. రాకెట్టు శక్తిని యెంత పెంచినా దాని వేగాన్ని కాంతివేగానికి దగ్గరకు కూడా తీసుకపోలేము. కాని వీరి పులిచర్మం మనలను కాంతివేగంతో తీసుక పోతుందా!?

ఇదంతా వారికి తెలియక కాదు. శాస్త్ర విజ్ఞానానికి మూలం హేతువు. ప్రశ్న. కాని మనువాదం ప్రశ్నించటానికి, హేతువాదానికి బద్ధశత్రువు. కాబట్టి యీ విజ్ఞాన శాస్త్రాలను, వాటికి పునాది అయిన హేతుబద్ధ ఆలోచనను వాటికి అండగా వుండే ప్రగతిశీల శక్తులను దెబ్బ కొట్టకుండా మనుధర్మం మరలా నిలదొక్కుకోలేదు. మనుధర్మం యేమేరకు వెనక్కు కొట్టబడిందో ఆ మేరకు సామాజిక అభివృద్ధి, దానితో పాటు కొంతమేరకైనా బడుగు,బలహీన వర్గాలు, కులాల అభివృద్ధి సాధ్యపడింది. కాబట్టి యీ పురోగమనాన్ని ఆపకపోతే, యీ ప్రగతిశీల శక్తులు మరింత బలపడతాయని వారికి తెలుసు. కాబట్టే వారు యీ పురోగామి శక్తులకు వ్యతిరేకంగా భావజాల రంగంలో సర్వం ఒడ్డి పోరాడుతున్నారు. భౌతికదాడులకూ పూనుకొంటున్నారు. గోరక్షణ పేరుతో నరమేధం సృష్టిస్తున్నారు. కులాల పరంగా ప్రజలను చీల్చి గతంలో ఆధిపత్యం చెలాయించారు. మరలావారు యిప్పుడు అదే ప్రయత్నంలో ఉన్నారు.

సెల్: 9490300107

అందానికి చక్కనైన చిట్కా...



అవిసె గింజలు శరీరానికి ఎంతో ఎనర్జీని ఇస్తాయి. పీచు, మాంసకృతులు, విటమిన్లు, పలురకాలైన ఖనిజాలు వీటిల్లో సమృద్ధిగా ఉన్నాయి. లావు తగ్గడం నుంచి చర్మ సౌందర్యం వరకూ వీటివల్ల పొందే ఆరోగ్య లాభాలెన్నో. ఒమెగా3 ఫ్యాటీ ఆమ్లాలు వీటిల్లో పుష్కలంగా ఉన్నాయి. పీచు, మాంసకృతులు, విటమిన్లు బాగా ఉన్నాయి. వీటిని రోజూ తీసుకోవడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయి. వీటిలోని యాంటి–ఇన్ఫ్లమేటరీ గుణాల వల్ల మోకాళ్లు, కీళ్ల నొప్పులు రావు. జీర్ణ సంబంధిత వ్యాధుల ధరి చేరకుండా కాపాడతాయి. మెనోపాజ్ దశలోని మహిళలకు అవిసెగింజల్లోని లింగ్‌నాన్స్ ఎంతో మేలు చేస్తాయి. కారణం వీటిల్లో ఈస్ట్రోజన్ గుణాలు బాగా ఉన్నాయి. హార్మోన్ల సమతుల్యతకు అవిసె గింజలు బాగా ఉపయోగపడతాయి. ఎముకలను దృఢంగా ఉంచుతాయి. ఆడవాళ్లల్లో రుతుక్రమం సవ్యంగా జరిగేలా సహాయపడతాయి. రోజూ వీటిని తినడం వల్ల చర్మం, జుట్టు, గోళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అవిసె మాస్కును జుట్టుకు రాసుకుంటే వెంట్రుకలు బాగా పెరుగు తాయి. అవిసె గింజలు చర్మం పొడిబారడాన్ని తగ్గించడమే కాకుండా చర్మాన్ని మృదువుగా ఉంచుతాయి. కొవ్వు, పీచుపదార్థాల వల్ల మలబద్ధకం సమస్య తగ్గుతుంది. ఇవి శరీర జీవక్రియను మెరుగుపరుస్తాయి. బరువు తగ్గించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్, రక్తపోటు, మధుమేహాలను ఇవి అదుపులో ఉంచుతాయి. అవిసెగింజల్లో శరీరంలోని కొలెస్ట్రాల్‌ని తగ్గించే గుణాలు బాగా ఉన్నాయి. నిత్యం ఉదయం కొన్ని అవిసెగింజలు తింటే అల్సర్ సమస్య తగ్గుతుంది.

పదే పదే.. తిట్టకండి!



స్నేహితులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు... ఎవరయినా గానీ కౌమారదశలో ఉన్న పిల్లల్ని పదే పదే తిట్టడం, అవమానించడం, హేళన చేయడం చేస్తే వాళ్ల భవిష్యత్తులో అనేక మానసిక సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుందని చెబుతున్నారు నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్‌కి చెందిన పరిశోధకులు. ముఖ్యంగా ఇటీవల కొంతమంది పిల్లలు సోషల్ మీడియా కారణంగా అనేక అవమానాల బారిన పడటం బాగా పెరిగింది. అంతేకాదు, పోటీ ప్రపంచంలో భాగంగా చదువులో ఇతర కార్యక్రమాల్లో వెనకబడిన పిల్లలు ఇంటా బయటా కూడా అనేక అవమానాలను ఎదుర్కొంటున్నారు. అలా హేళనకు గురవుతూ అవమానాల పాలయిన కొందరు పిల్లల మెదడు స్కాన్ చేసి పరిశీలించగా వాళ్లకీ, మామూలుగా ఉండే పిల్లల మెదడు కణజాలానికీ ఎంతో వ్యత్యాసం కనిపించిందట. పైగా వీళ్ల మెదడులో ఒత్తిడిని కలిగించే హార్మోన్లు ఎక్కువగా ఉన్నట్లు తేలిందట. దాంతో వాళ్లలో అధ్యయన శక్తి తగ్గిపోవడంతో పాటు శారీరకంగా కూడా తరచూ అనారోగ్యానికి గురవుతుంటారని తేలింది. కాబట్టి టీనేజీలోని పిల్లల్ని ప్రేమతోనూ దారికి తెచ్చుకోవాలేకానీ తిట్టడం, హేళన చేయడం కూడదు అంటున్నారు విశ్లేషకులు.


ఆందోళన తగ్గాలంటే...



ఒత్తిడిగా అనిపించినప్పుడు లేచి నిలబడాలి. తల, వెన్ను, భుజాలని నిటారుగా ఉంచుకుని నిదానంగా, దీర్ఘంగా ఊపిరి పీల్చుకోవాలి. బయటకు వదిలే ప్రతి ఊపిరితోనూ మీలోని ఉద్వేగం తగ్గిపోతున్నట్లుగానూ, లోపలికి తీసుకునే ప్రతి శ్వాసతోను మనసు తేలిక పడుతున్నట్లు భావించాలి.

- ఓ అందమైన దృశ్యం లేదా సాంత్వన కలిగించే చిత్రాన్ని కాసేపు గమనించాలి. కిటికీలో నుంచి బయట ప్రకృతిలోకి చూడటమో, మీకు ఇష్టమైన రంగులో ఉన్న వస్తువుని పరిశీలించడమో చేయవచ్చు. ఏదీ కుదరకపోతే కళ్ళు మూసుకుని ఓ అందమైన ప్రకృతి దృశ్యాన్ని (ఉదా...జలపాతం) ఊహించుకోండి.
- ఉద్వేగం ఓ విషవలయం. ఉద్వేగంతో మన కండరాలన్నీ బిగుసుకుంటాయి. బిగుసుకుపోయిన కండరాలు మరింత ఉద్వేగానికి దారితీస్తాయి. కాబట్టి మనసు ఆందోళనగా ఉన్నప్పుడు ఆ ప్రభావం మన ముఖంలో కనిపించకుండా జాగ్రత్తపడాలి. అందుకోసం ఒక్కసారి మన శరీరం మీద ధ్యాస ఉంచాలి. నుదురు, పిడికిళ్ళు బిగ్గరగా లేకుండా చూసుకోవాలి.
- ఉద్వేగాన్ని ఎదుర్కొనేందుకు నవ్వుని మించిన ఔషధం లేదు. నవ్వడం వల్ల మన శరీరంలో ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ అనే రసాయనాల ఉత్పత్తి తగ్గి, వాటి బదులుగా ఆనందాన్ని రేకెత్తించే ఎండోమార్ఫిన్స్ అనే రసాయనాలు వెలువడతాయి. కాబట్టి మనస్ఫూర్తిగా నవ్వడమో, అలా నవ్వేందుకు ఇష్టమైన కామెడీ సన్నివేశాన్ని చూడటమో చేయవచ్చు.
- శబ్దమే కాదు, స్పర్శ కూడా ఉద్వేగాన్ని దూరం చేస్తుంది. మనకి ఇష్టమైన వస్తువుని పట్టుకుని ఉండటమో (ఉదా...టెడ్డీబేర్), రబ్బర్ బాల్‌ని చేత్తో నొక్కడమో, వేడినీటితో స్నానం చేయడమో, వెచ్చటి దుప్పటిని కప్పు కోవడమో చేయడం వల్ల ఆందోళన నుండి కాస్త ఉపశమనం పొందుతారు.

బఠానీల్లో ప్రొటీన్స్ ఎక్కువగా ఉంటాయి. అతి ముఖ్యమైనవి విటమిన్లు బి1, బి2లు లభిస్తాయి. పిండి పదార్థాలు, ఫైబర్, ప్రొటీన్, విటమిన్ ఎ, విటమిన్ బి6, విటమిన్ సి, విటమిన్‌కె, భాస్వరం, మెగ్నీషియం, రాగి, ఇనుము, జింక్ ఎక్కువగా ఉంటాయి. సీజన్‌గా లభించే వీటిని ఇతర కూరగాయల కాంబినేషన్‌తో ఎంతో రుచికరమైన పదార్థాలను తయారుచేయవచ్చు.



భలే భలే బఠానీ..

పన్నీర్ బఠానీ..



కావాల్సిన పదార్థాలు

పన్నీర్ ముక్కలు – 2 కప్పులు
నూనె – టేబుల్ స్పూన్
కొత్తిమీర తురుము – టేబుల్ స్పూన్
నిమ్మరసం – టీస్పూన్
ఆలుగడ్డ – పావుకిలో
ఉడికించిన బఠానీలు – కప్పు
అల్లం తురుము – టీస్పూన్
పచ్చిమిర్చి తురుము – టీస్పూన్
మిరియాల పొడి – అరటీస్పూన్
ఉప్పు – రుచికి తగినంత

తయారు చేసే విధానం

బాణలిలో నూనె వేసి కాగాక పచ్చిమిర్చి తురుము, అల్లం తురుము వేసి ఓ నిమిషం వేయించాలి. తరువాత పన్నీర్ ముక్కలు, ఉడికించిన ఆలుగడ్డ ముక్కలు, బఠానీలు వేసి ఐదు నిమిషం వేయించాలి. ఇప్పుడు మిరియాల పొడి, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలపాలి. చివరగా కొత్తిమీర చల్లితే సరి.

చపాతిలోకి



కావలసిన పదార్థాలు

ఆలుగడ్డ – అర కిలో
పచ్చి బఠానీలు – అరకప్పు
ఉల్లిపాయలు – 2 పెద్దవి
వెల్లుల్లి ముక్కలు – రెండు టీ స్పూన్లు
అల్లం ముక్కలు – 2 టేబుల్ స్పూన్లు
వంటనూనె – 3 టేబుల్ స్పూన్ లు
కొత్తిమీర – కొద్దిగా
ఉప్పు – రుచికి తగినంత

తయారుచేసేవిధానం...

ముందుగా ఆలుగడ్డలు ఉడికించి తొక్క తీసి ముక్కలుగా చేసి పక్కన పెట్టుకోవాలి. బాండ్లీలో నూనె వేయాలి. వేడి అయ్యాక ఉల్లిపాయల ముక్కలు, వెల్లుల్లి, అల్లం ముక్కలు వేసి బాగా వేయించాలి. ఇప్పుడు పచ్చిబఠానీలు వేసి కలిపాలి. కొద్దిగా నీరుపోసి బఠానీలు ఉడకనివ్వాలి. ఇప్పుడు ముందుగా ఉడికించిన ఆలుగడ్డ ముక్కలను వేసి బాగా కలపాలి. ఐదు నిమిషాల తర్వాత కొత్తిమీర చల్లి స్టవ్ ఆఫ్ చేయాలి.

బఠానీ ఫ్రైడ్ రైస్



కావలసిన పదార్థాలు:

బాస్మతి బియ్యం – ఒక గ్లాస్
పచ్చిబఠానీ – అర కప్పు
కొబ్బరితురుము–అర కప్పు
ఉల్లిపాయ –ఒకటి
మిర్చి – ఒకటి
కొత్తిమీర – ఒక కట్ట
అల్లంవెల్లుల్లి ముద్ద – ఒక టీ స్పూన్
గరంమసాలా పొడి– ఒక టీ స్పూన్
మిరియాలపొడి – ఒక టీ స్పూన్
బిర్యానీ ఆకులు – 2
కొద్దిగా కాజూ,తగినంత ఉప్పు
రెండు టేబుల్ స్పూన్స్ నూనె

తయారు చేసే విధానం

బియ్యం కడిగి పొడిపొడిగా అన్నం వండుకోవాలి. ఒక టీ స్పూన్ నూనెలో కాజూ వేయించి తీసుకోవాలి. నూనె వేడిచేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ, బిర్యానీ ఆకు, మిర్చివేసి దోరగా వేయించాలి. ఇందులో ఉడికించిన బఠానీలు, కొబ్బరితురుము కూడా వేసి కలపాలి. అల్లంవెల్లుల్లి ముద్ద వేసి బాగా కలపాలి. ఇవి వేగిన తరువాత అన్నం వేయాలి. తగినంత ఉప్పు, మిరియాలపొడి, గరంమసాలా పొడి, కొత్తిమీర వేసి బాగా కలుపుతూ సన్నని మంటపై ఐదునిమిషాలు ఉంచాలి. అంతే బఠానీ ఫ్రైడ్ రైస్ రెడీ..!

వంకాయ–బఠానీ కూర



కావలసిన పదార్థాలు:

వంకాయలు పావుకిలో
బఠానీలు– అర కప్పు
ఉల్లిపాయ – ఒకటి
పచ్చిమిర్చి– నాలుగు
అల్లం – చిన్నముక్క
కరివేపాకు –ఒక రెమ్మ
మసాలాపొడి –అర స్పూన్
ఉప్పు,కారం,పసుపు,నూనె,కొత్తిమీర
పోపు దినుసులు
(శనగపప్పు,ఆవాలు,జీలకర్ర,ఎండుమిర్చి)

తయారు చేసే విధానం:

ముందుగా బఠానీలు ఉడికించుకోవాలి. గిన్నెలో నూనె వేడిచేసి పోపు దినుసులు వేసుకోవాలి. కరివేపాకు, సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి వేయించాలి. ఇప్పుడు అల్లం,మిర్చి,కొత్తిమీర కలిపి నూరిన పేస్ట్ వేసి వేగనివ్వాలి. సన్నగా కోసిన వంకాయ ముక్కలు,చిటికెడు పసుపు వేసి కలిపి ఐదు నిమిషాల పాటు మగ్గనివ్వాలి. వంకాయ ముక్కలు వేగిన తరువాత, తగినంత ఉప్పు, కారం వేసి కలిపాలి. చివరకగా ఉడికించిన బఠానీలు కూడా వేయాలి. ఐదు నిమిషాలపాటు ఉడికిన తర్వాత గరంమసాలాపొడి చల్లి రెండు నిముషాలు ఉంచి దింపెయ్యాలి.

ఇట్లచేద్దాం



పొడి దగ్గుతో బాధపడుతుంటే అర టీస్పూన్ ఇంగువ పొడి, ఒక టీస్పూన్ తాజా అల్లం రసం, ఒక టేబుల్ స్పూన్ తేనెలను బాగా కలపాలి. దీన్ని రోజుకి ఒక సారి తీసుకోవాలి. రసాన్ని నోటిలో ఉంచుకుని నెమ్మదిగా కొద్దికొద్దిగా మింగాలి. దీని వల్ల గొంతు గరగర పోతుంది. పొడి దగ్గు తగ్గిపోతుంది.

మహిళలకు ప్రాణాంతకం.. !

ప్రపంచవ్యాప్తంగా ఇటీవల జరిపిన కొన్ని పరిశోధనల్లో పురుషుల కంటే మహిళలు చాలా త్వరగా మరణిస్తారని నిర్ధారిస్తున్నారు. ఎందుకంటే వీరిలో ఎనిమిది రకాల వ్యాధులు చాలా త్వరగా మరణానికి కారణం అవుతున్నాయని వెల్లడిస్తున్నారు.



కారణాలు అనేకం! : ప్రపంచంలో రెండు మిలియన్ల కంటే ఎక్కువగా బ్రెస్ట్, ఓవేరియన్ క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. ఇందులో అతి భయంకరమైన విషయం ఏంటంటే, కొంతకాలం నుంచి మహిళలు ఎక్కువగా డయాబెటిస్‌కు గురి అవుతున్నారు. ఇది ప్రాణాంతకంగా మారుతున్నది. ఎనీమియా కూడా మరణానికి కారణం అవుతున్నది. మరి మహిళల్లో ప్రాణాంతకంగా మారే కొన్ని వ్యాధులేమిటో చూద్దాం.

గుండె పోటు : మహిళల్లో 38శాతం మంది మొదటి హార్ట్ అటాక్ సమయంలోనే మరణిస్తున్నట్టు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. మహిళల్లో హార్ట్‌లో బ్లాక్స్ ఏర్పడి తద్వారా హార్ట్ అటాక్, గుండె సంబంధిత వ్యాధులకు కారణం అవుతున్నాయి.

బ్రెస్ట్ క్యాన్సర్ : మహిళలు 35సంవత్సరాల తర్వాత మామోగ్రామ్ టెస్టును తప్పకుండా చేయించుకోవాలి. దీని వల్ల బ్రెస్ట్ హెల్తీగా ఉందా లేదా అనే విషయం తెలుస్తుంది. 23 ఏళ్ళ తర్వాత ప్రతి ఒక్క మహిళ సెల్ఫ్ చెకప్ చేసుకోవడం చాలా అవసరం. ఇలా సెల్ఫ్ చెకప్ వల్ల బ్రెస్ట్‌లో ఏర్పడే అసాధారణ కణుతులు గుర్తించినట్లయితే అది బ్రెస్ట్ క్యాన్సర్‌కు ప్రారంభ చిహ్నాంగా గుర్తించాలి.

సర్వైకల్ క్యాన్సర్ : సర్విక్స్‌లోని కణాల్లో క్యాన్సర్ కణుతులు ఏర్పడతాయి. మహిళలు మల్టిపుల్ సెక్సువల్ సంబంధాల్ని కలిగి ఉండటం సర్వైకల్ క్యాన్సర్ డెవలప్‌మెంట్‌కు కారణం అవుతుంది. దీనికి ఎలాంటి లక్షణాలుండవు. క్యాన్సర్ పూర్తిగా ఫార్మ్ అయిన తర్వాత లక్షణాలు కనబడతాయి.

ఓవేరియన్ క్యాన్సర్: ఓవేరియన్ క్యాన్సర్ ఓవరీస్‌లో వస్తుంది. మహిళల్లో వచ్చే అత్యంత ముఖ్యమైన క్యాన్సర్ ఇది. ప్రపంచంలో కొన్ని మిలియన్ల సంఖ్యలో ఈ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఓవేరియన్ క్యాన్సర్‌కు ప్రారంభ చిహ్నాలేవీ లేవు.

డిప్రెషన్: సోషియల్ సిగ్మా వల్ల, చాలామంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అందుకు కారణం డిప్రెషన్, వర్క్ ఫీల్డ్‌లో నిస్సహాయస్థితి, ఇంటా, బయటా డామినేటెడ్ పరిస్థితులు ఇందుకు కారణం అవుతాయి.

డయాబెటిస్: మహిళల్లో 28ఏళ్ల తర్వాత టైప్ 2 డయాబెటిస్ చాలా సాధారణమైపోయింది. ఆరోగ్యకరమైన జీవనశైలిని బ్యాలెన్స్ చేయలేనివారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది.

కిడ్నీ సమస్యలు: హై బ్లడ్‌ప్రెజర్, హార్ట్ సమస్యలు ప్రతీ కుటుంబంలో ఎవరికో ఒకరికి ఉంటున్నాయి. మహిళల్లో కిడ్నీ వ్యాధులు కూడా సాధారణంగా మారాయి. కిడ్నీ వ్యాధి ప్రారంభ లక్షణాలు బ్లీక్, యూరిన్ బ్లడ్ టెస్ట్ వల్ల తెలుసుకోవచ్చు.

ఎనీమియా: ఎనీమియాకు కారణాలు అనేకం. ప్రతి ముగ్గురిలో ఒకరు ఉండాల్సిన బరువు కంటే తక్కువగా లేదా అధికంగా ఉండటం కూడా ఎనీమియాకు కారణం అవుతుంది. ఈ హెల్త్ సమస్య గర్భవతుల్లో, అలాగే ఫీటస్‌లో ఇతర సమస్యలకు దారితీస్తుంది.

హెల్త్ చెకప్ తప్పనిసరి! : ఇలాంటి ప్రాణాంతకమైన వ్యాధులతో పోరాడాలన్నా, మరికొంత కాలం జీవించాలన్నా అనేక ట్రీట్‌మెంట్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. మహిళలు నెలకొకసారి వైద్యులను సంప్రదించి మెడికల్ టెస్టులు, ఓవరాల్ హెల్త్ చెకప్స్ చేయించుకోవడం మంచిది. ఇలాంటి మెడికల్ విజిట్స్ వల్ల ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కాబట్టి 25 ఏళ్ళు దాటినప్పటి నుంచి మహిళలు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. ఎంత బిజీగా ఉన్నా ఎంతోకొంత సమయాన్ని తమ ఆరోగ్యం కోసం సమయాన్ని కేటాయించాలి.

యానిమేషన్, గేమింగ్ దారెటు!

కోర్సు కాలపరిమితి మూడేండ్లా... నాలుగేండ్లా

సర్కారు తర్జనభర్జన

- జేఎన్ఏఎఫ్ఏయూతో కాలేజీల ఒప్పందం
- ఏఐసీటీఈ అనుమతి లేకుండానే కోర్సుల నిర్వహణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని యానిమేషన్ అండ్ గేమింగ్ కోర్సుపై తెలంగాణ ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాలేకపోతున్నది. ఈ కోర్సును నాలుగేండ్లు కాలపరిమితితో కూడిన కోర్సుగానే అందించాలా? లేక మూడేండ్ల కోర్సుగా కుదించాలా?అనే విషయమై తర్జనభర్జన పడుతున్నది. దీంతో యానిమేషన్, గేమింగ్ కోర్సు దారెటు?అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ)తో రాష్ట్రంలో ఉన్న 17 ప్రయివేటు కాలేజీలు యానిమేషన్, గేమింగ్ కోర్సులను నాలుగేండ్లపాటు అందిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కోర్సులు కావడంతో ఆ కాలేజీలు తప్పనిసరిగా అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అనుమతి పొందాల్సి ఉంది. కానీ ఏఐసీటీఈ అనుమతి లేకుండానే, రాష్ట్రంలో ఏ విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపు లేకుండానే యానిమేషన్, గేమింగ్ కోర్సును అందించడం విశేషం. ఈ కాలేజీలు ఏఐసీటీఈ అనుమతి పొందడం, ప్రమాణాలు పాటించడం, అర్హులైన అధ్యాపకులను నియమించడం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిబంధనలకు అనుగుణంగా ఉండడం వంటివి కచ్చితంగా కావాలి. అందుకే ఏఐసీటీఈ అనుమతి పొందడం కొంత ఇబ్బందిగా మారిందని కాలేజీల యాజమాన్యాల నుంచి ఓ అభిప్రాయం వెల్లడవుతున్నది. ఈ నేపథ్యంలో యానిమేషన్, గేమింగ్ కోర్సును ఎలా కొనసాగించాలన్న దానిపై ఉన్నత విద్యామండలిలో కాలేజీల యాజమాన్యాలు, జేఎన్ఏఎఫ్ఏయూ అధికారులు పలు మార్లు సమాలోచన చేశారు. మూడేండ్ల కోర్సును అందిస్తే ఏఐసీటీఈ అనుమతి అవసరం ఉండదనే ఈ అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. మూడేండ్ల కోర్సును అందిస్తే రాష్ట్ర పరిధిలోని అంశంతోపాటు ఆ విశ్వవిద్యాలయానికే అధికారాలుంటాయి. మూడేండ్ల కోర్సును అందించడానికి ఆయా కాలేజీలు ఆ విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపు పొందితే సరిపోతుంది. ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. అందుకే మూడేండ్ల కోర్సుగానే యానిమేషన్, గేమింగ్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సమాలోచన చేస్తున్నట్టు సమాచారం.

ప్రపంచంలో నాలుగేండ్ల కోర్సుకే గుర్తింపు

సాంకేతిక విద్యలో నాలుగేండ్ల అండర్‌గ్రాడ్యుయేట్ (యూజీ) కోర్సుకే ఎక్కువ గుర్తింపు ఉంటుందని విద్యావేత్తలు చెప్తున్నారు. సాంకేతిక విద్య చదివే విద్యార్థులు 10+2+4 చదివితేనే విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) చేసేందుకు అర్హత లభిస్తుంది. రాష్ట్రంలో యానిమేషన్, గేమింగ్ కోర్సును మూడేండ్లకు కుదిస్తే ఆ విద్యార్థులు విదేశాల్లో పీజీ చేసేందుకు అనర్హులుగా మిగులుతారు. ఈ సమస్యను అధిగమించడం అధికారులకు కొంత ఇబ్బందిగా మారింది. ఏ కోర్సు అందించినా అంతిమంగా విద్యార్థులు ప్రయోజనం పొందాలి. ప్రభుత్వం ఆలోచిస్తున్న నిర్ణయం వల్ల విద్యార్థులకు నష్టమే తప్ప లాభముండబోదని పలువురు విద్యావేత్తలు వాపోతున్నారు. అందుకే యానిమేషన్, గేమింగ్‌లో నాలుగేండ్ల కోర్సుగానే అందించాలని సూచిస్తున్నారు. అప్పుడే విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా



రాణిస్తారనీ, ఉన్నత విద్యకు వెళ్తారనీ, ఉపాధి అవకాశాలు పొందుతారనీ చెప్తున్నారు.

ఉపాధి అవకాశాలెన్నో..

ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నది. రోజురోజుకూ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో వేగంగా విస్తరిస్తున్నది. అందులోనూ యానిమేషన్, గేమింగ్ రంగం మరింత ముందుకు వెళు తున్నది. సినిమా రంగం, టీవీ రంగంలో యానిమేషన్, గేమింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉన్నది. ఈ నేపథ్యంలో యానిమేషన్, గేమింగ్ కోర్సులు చదివే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. అవతార్, 2.ఓ, బాహుబలి, బాహుబలి-2, లైఫ్ ఆఫ్ పై, ఘాజీ, అంతరిక్షం వంటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సినిమాలు యానిమేషన్, గేమింగ్ వినియోగం వల్లేనని నిపుణులు చెప్తున్నారు. ఇంకోవైపు హైదరాబాద్ నగరానికి ప్రపంచంలోనే మంచిపేరుంది. ఐటీ రంగానికి కేంద్రంగా ఉన్నది. భవిష్యత్తులో ఐటీ రంగం స్థానంలో యానిమేషన్, గేమింగ్ రంగం ముందుకెళ్తుందనీ, ఉపాధి అవకాశాలూ ఇందులోనే ఎక్కువుంటాయనీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం యానిమేషన్, గేమింగ్ రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఆ కోర్సులు అందించే కాలేజీలపైనే ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. రాష్ట్రంలోని 17 ప్రయివేటు యానిమేషన్, గేమింగ్ కాలేజీల్లో సుమారు 5 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

కాలేజీలను బట్టి ఫీజుల విధానం ఇష్టారాజ్యంగా యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు విద్యార్థుల నుంచి గుంజుతున్నాయి. ఇంత భారీగా డిమాండ్ ఉన్న ఈ కోర్సులపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టండి : సీ.ఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హరితహారం కింద ఈ సారి నీడ, పండ్ల నిచ్చే మొక్కలు నాటడంపై అధిక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే. జోషి అధికారులను ఆదేశించారు. ఈ వర్షాకాలంలో మొదలు పెట్టాల్సిన ఐదో విడత హరితహారంపై రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం సచివాలయంలో బుధవారం జరిగింది. భవిష్యత్ తరాలు కూడా ఆరోగ్యకర వాతావరణంలో అందించాలనే లక్ష్యంతో చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపైనా ఉందన్నారు. ఈయేడాది వంద కోట్ల మొక్కలు నాటే భారీ లక్ష్యాన్ని సీఎం కేసీఆర్ మన ముందు ఉంచారని, అందుకనుగుణంగా అధికారులంతా పనిచేయాలని సూచించారు. అటవీ, పంచాయితీ రాజ్, మున్సిపల్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో నర్సరీల సంఖ్య పెంచటం, వంద కోట్ల మొక్కల పెంపకంపై శాఖల వారీగా చీఫ్ సెక్రటరీ ఆరాతీశారు. హైదరాబాద్ చుట్టుపక్కల తొలివిడతలో ఏర్పాటు చేస్తున్న 59 అర్బన్ ఫారెస్ట్ పార్కులను జూలైలో ప్రారంభించాలని సీఎం డెడ్ లైన్ పెట్టారని, అందుకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఫిబ్రవరి 23న ఢిల్లీలో నిరాహారదీక్ష

- బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్లలో అన్యాయం: సవ్యసాచి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విశ్రాంత బ్యాంకు ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఏ ప్రయోజనం లేకుండా పోయిందని, ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 23న ఢిల్లీలో నిరాహార దీక్ష చేస్తామని అఖిల భారత విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల పోరాట వేదిక కన్వీనర్ సవ్యసాచి సన్యాల్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర ఉద్యోగులకు ఇస్తున్నట్టుగా ఫ్యామిలీ పెన్షన్‌ను ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీపై సీలింగ్‌ను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు కేంద్రం పెంచిందని, ఇతర ఉద్యోగులకు అది అమలవుతుండగా రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులకు మాత్రం వర్తించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రాట్యూటీ విషయంలో జరుగుతున్న అన్యాయంపై పలువురు బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు కోర్టుల్లో కేసులు వేశారని గుర్తుచేశారు. ప్రతి ఐదేండ్ల కోసం చేయాల్సిన పెన్షన్ రివిజన్‌ను అస్సలు పట్టించుకోవడంలేదన్నారు.

ఇందూ అరణ్య కేసులో జోషికి హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కోర్టు ధిక్కార వ్యాజ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుమోటోగా ప్రతివాదిని చేస్తూ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్ నగర శివార్లలోని హయత్‌నగర్ ప్రాంతంలో ప్లాట్లు, విల్లాల కోసం డబ్బులు చెల్లించిన వినియోగదారులకు ఇందూ అరణ్య ప్రాజెక్టు రిజిస్ట్రేషన్ చేయకపోవడం సబబుకాదనే కేసులో ప్రభుత్వం ఆరు మాసాల గడువు కోరడంతో న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోని పక్షంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేయాల్సి వస్తుందని గత సోమవారం హైకోర్టు హెచ్చరించిన సంగతి తెలిసిందే. బుధవారం తిరిగి కేసు విచారణకు వచ్చినప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిందని, ఆరు మాసాల సమయం కావాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ కోరారు. గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో బాధితుడు డీవీఏస్ రవి ప్రసాద్ ఇతరులు దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని న్యాయమూర్తి విచారించారు. హయత్‌నగర్‌కు సమీపంలోని తట్టిఅన్నారం వద్ద స్థలాలను గత ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలోని గృహ నిర్మాణ సంస్థ ఇందూ ప్రాజెక్టుకు భూములు కేటాయించిందని, ఇప్పుడు ఇందూ సంస్థ వినియోగదారులు డబ్బులు చెల్లించినా ప్లాట్లు, విల్లాలను రిజిస్ట్రేషన్ చేయడం లేదని పిటిషనర్ల వాదన. ఎన్నికల కారణంగా జాప్యం జరిగిందని గత విచారణలో చెప్పిన ప్రభుత్వం బుధవారం నాటి విచారణలో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటైందని, దీనికి చెందిన ఫైలు సీఎం దగ్గర ఉందని, తగిన నిర్ణయం తీసుకుంటారని, తమకు ఆరుమాసాల సమయం కావాలని కోరింది. ఇందుకు సమ్మతించని హైకోర్టు సుమోటోగా సీఎస్‌ను ప్రతివాదిగా చేసి నోటీసులిచ్చింది. రెండు వారాలకు కేసు విచారణను వాయిదా వేస్తున్నామని, ఈలోగా సీఎస్ తమ వాదనలతో కౌంటర్ వ్యాజ్యాన్ని దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

ఏఎంటీఐలో సత్తాచాటిన 'నారాయణ'

హైదరాబాద్: జాతీయస్థాయిలో యేటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అసోసియేషన్ ఆఫ్ మ్యాథ్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా(ఏఎంటీఐ) తుది దశ పోటీపరీక్షలో తమ విద్యార్థులు ఆలిండియా టాప్10లో 2,5,6,7.8,10 ర్యాంకులను సాధించినట్టు నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం తెలిపింది. అన్ని కేటగిరిల్లో ప్రకటించిన 156 ఫలితాల్లో 57 సెలక్షన్లు తమ విద్యార్థులే కైవసం చేసుకున్నట్టు ఆ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డా.పి. సింధూర నారాయణ అన్నారు. జాతీయ స్థాయిలో ప్రైమరి స్థాయి(5,6 తరగతులు)లో 48లో 22సెలక్షన్లు, సబ్ జూనియర్ కేటగిరి(7,8 తరగతులు)లో 54లో 25 సెలక్షన్‌లు, జానియర్(9,10తరగతులు)ల్లో 54లో10 సెలక్షన్‌లు తమ విద్యార్థులే కైవసం చేసుకున్నట్టు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....ఈ రికార్డు స్థాయి ఫలితాలు మరే ఇతర విద్యాసంస్థ సాధించలేదన్నారు. ఇంటిగ్రేటెడ్ సిలబస్‌తో పాటు విశ్లేషణాత్మకంగా బోధించే ఉపాధ్యాయులు, అనుభవజ్ఞులచే రూపొందించిన స్టడీ మెటీరియల్స్ తమ విజయంలో కీలక పాత్ర వహిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునిత్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నికల్లో పాల్గొనే టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎన్నికల సంఘానికి పీఆర్టీయూటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ కోరింది. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం అశోక్‌కుమార్‌ను ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికలు పూర్తి చేసి రిసీవింగ్ సెంటర్లలో సమాచారం అందజేసిన తర్వాత అర్ధరాత్రివేళల్లో రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రవాణా సౌకర్యాన్ని మిగిలిన రెండు విడతలకు కల్పించాలని సూచించారు. టీఏ, డీఏ చెల్లింపు వేర్వేరు జిల్లాల్లో వేర్వేరుగా చెల్లిస్తున్నందున అన్ని జిల్లాల్లోనూ ఒకే విధంగా చెల్లించాలని కోరారు. రిజర్వులో ఉన్న సిబ్బందికి, ఏకగ్రీవమైన పంచాయతీల్లో విధులు నిర్వహించిన వారికి టీఏ, డీఏ చెల్లించాలని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు మూడు విడతల్లో రెండు విడతల్లో డ్యూటీ వేశారనీ, కానీ సంగారెడ్డి, గద్వాల, రంగారెడ్డి జిల్లాలతోపాటు కొన్ని జిల్లాల్లో మూడు విడతలు వేశారనీ పేర్కొన్నారు. కొందరికి డ్యూటీలు రాకుండా ఉన్న వారిని ఉపయోగించుకోవాలని సూచించారు. వంద కిలోమీటర్లపైన డ్యూటీ పడిన వారు మరుసటిరోజు విధులకు హాజరుకావడానికి ఒకపూట ఓడీ సౌకర్యం కల్పించాలని కోరారు. ఓటుహక్కుగల ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఓటు హక్కు వినియోగిం చుకునేందుకు ఓడీ సౌకర్యం కల్పించాలని సూచించారు.

విద్యార్థులకు ఉచితంగా నాసా సందర్శించే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అమెరికాలోని నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా)ను సందర్శించే అవకాశం లభించింది. మై సూపర్‌బ్రెయిన్, మహీంద్రా గ్రూపునకు చెందిన క్లబ్ మహీంద్ర ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఓ పరీక్షను నిర్వహిస్తున్నది. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చు. www.superbrain.com వెబ్‌సైట్‌లో ఆసక్తి విద్యార్థులందరూ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 9550114466 నంబర్‌ను సంప్రదించాలి.

యాదగిరిగుట్టలో మోడల్ బస్‌స్టేషన్ : సీ.ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని యాదగిరిగుట్టలో మోడల్ బస్‌స్టేషన్ నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకు సంబంధించి తగు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ఆదేశించారు. బుధవారం సచివాలయంలో యాదగిరిగుట్ట దేవాలయం అభివృద్ధి అథారిటీ (వైటీడీఏ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, రహదారులు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, వైటీడీఏ వైస్ చైర్మెన్ కిషన్‌రావు, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, సీడీఎంఏ టికె శ్రీదేవి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, యాదాద్రి దేవాలయం ఈవో గీత, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం సీఎస్ జోషి ఓ ప్రకటన విడుదల చేశారు. యాదగిరిగుట్ట బస్ స్టేషన్ నిర్మాణానికి కాలపరిమితి విధించుకొని పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దగుట్టలో 132/33 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఐటీఐ కళాశాలలో మాస్ కాపీయింగ్

నవతెలంగాణ-సారపాక

భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీఐ కళాశాలలో సోమవారం మూడో సెమిస్టర్ ప్రాక్టికల్స్‌లో మాస్ కాపీయింగ్ జరిగింది. విషయం తెలిసి బుధవారం అక్కడికి వెళ్లిన మీడియాతో యాజమాన్యం వాగ్వివాదానికి దిగింది. బలవంతంగా మీడియా ప్రతినిధులను బయటకు పంపించారు. గేటు వేసి మరీ మాస్ కాపీయింగ్ నిర్వహించారు. ఈ తతంగం అంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే చర్చ విస్తృతంగా సాగుతోంది. ఎన్నడూ లేని విధంగా ఏ కళాశాలకు ఆ కళాశాలనే పరీక్షా కేంద్రంగా కేటాయించటంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. ఆయా కళాశాలల్లో చదువుతున్న సీనియర్ విద్యార్థులు, కళాశాల సిబ్బంది, అటెండర్లను పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా నియమించి మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు.

'గురుకుల' సమస్యలు పరిష్కరించాలి

- విధినిర్వహణలో స్వేచ్ఛాయుత వాతావరణముండాలి: గురుకుల సొసైటీల కార్యదర్శులకు టీఎస్‌యూటీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ యాజమాన్యాలలో నిర్వహిస్తున్న సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డిమాండ్ చేసింది. గురుకుల విద్యాలయాల్లో కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడిని తగ్గించి, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో విధినిర్వహణకు అవకాశం కల్పించాలని సూచించింది. ఈ మేరకు ఐదు గురుకుల విద్యాలయాల సొసైటీల కార్యదర్శులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, షఫీఉల్లా, మల్లయ్యభట్టు, ఎ సత్యనారాయణరెడ్డి, నవీన్ నికోలస్ (జేఎస్)లను బుధవారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి, కార్యదర్శి ఎస్‌వై కొండల్‌రావులు కలిసి వినతిపత్రాలు సమర్పించారు. గురుకులాలల్లో శాశ్వత భవనాలు లేకున్నా, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలు లేకున్నా సర్దుకొని ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. అయినా బోధనేతర పనులను అప్పగించి, నిర్దేశించిన పనివేళలు కాకుండా అదనంగా పని చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రశ్నించే స్వేచ్ఛనూ హరించి వేధింపులకు గురిచేస్తున్నారని వినతిపత్రంలో తెలిపారు. యాజమాన్యాలు వేరైనా సమస్యలు మాత్రం అన్ని పాఠశాలల్లో ఒకే రకంగా ఉన్నాయని పేర్కొన్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించి పాఠశాలల్లో సానుకూల వాతావరణం కల్పించాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయ వృత్తి బాధ్యతలు సాధారణ పాఠశాలలకు ఒకింత భిన్నంగా ఉండే మాట వాస్తవమేనని తెలిపారు. అయితే అందుకు తగినట్లు ఉపాధ్యాయులను మానసికంగా సంసిద్ధులను చేయాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్స్ మొదలు అందరు అధికారులు ఉపాధ్యాయులను ప్రోత్సహించి పనిచేయించుకోవటం కంటే వేధింపులు, బెదిరింపులతో తీవ్రమైన మానసిక ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగం వచ్చిన సంతోషం కూడా లేదని పలువురు మహిళా ఉపాధ్యాయులు ఆవేదనలో ఉన్నారని పేర్కొన్నారు. వివిధ సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటైన నూతన గురుకుల విద్యాలయాల్లో దాదాపు 7 వేల మంది నూతన ఉపాధ్యాయులు నియామకమయ్యారని తెలిపారు. మైనార్టీ, గిరిజన, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించటం కోసం ఇవి ఏర్పాటు చేయబడ్డాయని పేర్కొన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించారనీ, సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామనీ హామీ ఇచ్చారని తెలిపారు.

పాత్రికేయులకు ఇండ్లస్థలాలు ఇప్పిస్తా

- ఆంధోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సన్మానసభలో కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


'మాజీ మంత్రిగా, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభుత్వంలో నా పాత్ర ఉన్నా, లేకున్నా రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే బాధ్యత తీసుకుంటా. పాత్రికేయులకు ఇండ్లస్థలాలు ఇప్పించే బాధ్యత నాది. కోర్టు వివాదాలకు తావులేకుండా, ఎవరూ వేలెత్తి చూపకుండా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తాం. రాష్ట్రంలో జర్నలిస్టులకు పెద్దపీట వేస్తాం' అని కె. తారక రామారావు అన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ప్రియదర్శిని ఆడిటోరియంలో ఆంధోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన జర్నలిస్ట్ క్రాంతిని ఘనంగా సన్మానించారు. దీనికి మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ, ఎమ్మెల్యే రామలింగారెడ్డి, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్, సంపాదకులు బండారు శ్రీనివాసరావు, కె శ్రీనివాస్‌రెడ్డి, అప్పిరెడ్డి (మైక్‌టీవీ ఎండీ), చంద్రమౌళి (టీవీ9), శ్రీనివాస్‌రెడ్డి (హెచ్ఎంటీవీ) తదితరులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ అమరావతిలో జర్నలిస్టులకు 30 ఎకరాలు చంద్రబాబు కేటాయించడంపై స్పందించారు. చంద్రబాబువన్నీ ఆపదమొక్కులని ఎద్దేవా చేశారు. చిత్తశుద్ధి లేని పూజలతో ఒరిగేదేం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రం వచ్చి నాలుగున్నరేండ్లయినా కొన్ని పత్రికలు, మీడియా సంస్థలు ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే భావనలో ఉన్నాయన్నారు. తెలంగాణ ఎడిషన్‌లో ఆంధ్ర వార్తలుంటాయనీ చెప్పారు. కానీ ఆంధ్ర ఎడిషన్‌లో తెలంగాణ వార్తలుండవని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆంధ్ర ఎడిషన్ పేపర్ వస్తున్నందున అక్కడ తెలంగాణ వార్తలకు చోటు లేదన్నారు. తెలంగాణ భారత్‌లో భాగం కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ముఖ్యమంత్రి, ప్రభుత్వం, వ్యవస్థ ఉందని చెప్పారు. ఆంధ్ర



ఎడిషన్‌లో తెలంగాణ వార్తలు లేనపుడు, తెలంగాణలో ఆంధ్ర వార్తలు అవసరమా? అని ప్రశ్నించారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఉనికిని చాటే పత్రికలను ప్రోత్సహిస్తామని చెప్పారు.

ఈ సన్మాన సభ తనకు వీడ్కోలు చెప్తున్నట్టుగా ఉందని ఆంధోల్ ఎమ్మెల్యేగా గెలిచిన జర్నలిస్టు చంటి క్రాంతి కిరణ్ అన్నారు. తనను వెళ్లగొట్టినా జర్నలిస్టుల సమస్యల పరిస్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. తన నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారంతోపాటు, జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడతానని చెప్పారు. మ్యాట్ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వం జర్నలిస్టులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, సాగర్, యూసుఫ్, ఇస్మాయిల్, భాస్కర్, యోగానంద్, యార నవీన్, కవిత తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడతా : ఎమ్మెల్యే క్రాంతికిరణ్



ఈ సన్మాన సభ తనకు వీడ్కోలు చెప్తున్నట్టుగా ఉందని ఆంధోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ చెప్పారు. తనను వెళ్లగొట్టినా జర్నలిస్టుల సమస్యల పరిస్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. తన నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారంతోపాటు, జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడతానని చెప్పారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వం జర్నలిస్టులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసిందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పాత్రికేయుల సమస్యలు తెలుసననీ, పరిష్కారమవుతాయనే భరోసా ఉందని ఎమ్మెల్యే రామలింగారెడ్డి అన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ క్రాంతికిరణ్ జర్నలిస్టుల సమస్యలపైనే కాకుండా ప్రజల హక్కులను కాపాడాలని కోరారు. సామాన్యులకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంపాదకులు బండారు శ్రీనివాసరావు, కె శ్రీనివాస్‌రెడ్డి, అప్పిరెడ్డి (మైక్‌టీవీ ఎండీ), చంద్రమౌళి (టీవీ9), శ్రీనివాస్‌రెడ్డి (హెచ్ఎంటీవీ), జర్నలిస్టు యూనియన్ నాయకులు రమణ, సాగర్, యూసుఫ్, ఇస్మాయిల్, భాస్కర్, యోగానంద్, యార నవీన్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఈబీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా..

సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్

రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం: బీసీ నాయకులు జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

అగ్రవర్ణాలకు రిజర్వేషన్లను కల్పించడాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దాదాపు 11 రాష్ట్రాల బీసీ సంఘాల నేతలు గత రెండు రోజులుగా ఢిల్లీలో సమావేశమై, సంఘటిత పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం భారత సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు పరిచిన తర్వాత బీసీ నేతలు మీడియాతో సంభాషించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ అగ్రవర్ణాల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్లతో సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు అన్న రాజ్యాంగ స్ఫూర్తికి ఆటంకం కలిగే ప్రమాదం ఉన్నదని గుర్తు చేశారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడంపై ఎటువంటి అధ్యయనం చేయకుండా, జనాభా దామాషా లేకుండా రిజర్వేషన్లు కల్పించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ ఉద్యమ నేత జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నత కులాల వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీసీలకు క్రిమిలేయర్ విధానాలంటూ ఇబ్బందులకు గురి చేయడం ఆందోళకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అగ్రవర్ణాలపై ఉన్న ప్రేమ బీసీలపై పదో వంతు కూడా లేదని విమర్శించారు. ఆర్థికంగా వెనకబడినప్పటికీ బీసీ కులాల వారిని పది శాతం రిజర్వేషన్ నుంచి తప్పించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఈ అన్యాయంపై ఉన్నత న్యాయస్థానంలో పోరాడతామని అన్నారు. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని వెల్లడించారు. బీసీలకు న్యాయం జరిగేంతవరకు ఉద్యమాలు చేస్తామన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా జంతర్‌మంతర్ వద్ద కూడా భారీ స్థాయిలో నిరసనలు చేపడుతామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా బీసీలపై కత్తి కట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని బీసీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిచ్చగాళ్ళుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. భవిష్యత్‌లో ఈ అంశంపై పోరాటాన్ని మరింత ఉధతం చేస్తామని ప్రకటించారు. ఇతర రాజకీయ, సామాజిక శక్తులతో కలసి ఐక్యంగా పోరాటం చేసి ప్రభుత్వాల మెడలు వంచుతామని విశ్వాసం వ్యక్తం చేశారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

నిజామాబాద్ కలెక్టర్ రామ్మోహన్‌రావు

- హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనలో పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతుందని నిజామా బాద్ కలెక్టర్ ఎం రామ్మోహన్‌రావు అన్నారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన 'పుస్తక మహోత్సవం'ను జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్‌తో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ప్రగతి పబ్లిషర్స్ ప్రచురించిన 'ఆహారంతో ఆరోగ్యం మరియు గృహవైద్యం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాలను పరిశీలించారు. 'ఎందుకని.. ఇందుకని' శాస్త్రీయదృక్పథం ఆధారంగా రూపొందించిన పుస్తకాన్ని కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పుస్తక పఠనంతో ప్రపంచాన్ని తెలుసుకునే ఆస్కారముందని అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్‌ను సాహితీవేత్తలు, పాఠకులు, విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ.. 1985లో ప్రారంభమైన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ మూడు దశాబ్దాలుగా అనేక పుస్తక ప్రదర్శనలు నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో బుక్‌ఫెయిర్ నిర్వహకులు రవికుమార్, సురేష్, సత్యనారాయణ, జిల్లా కేంద్ర గ్రంథాలయ గ్రంథ పాలకులు బీ.తారకం, సందీప్‌కుమార్, శ్రీనివాస్, ప్రతాప్, అబ్బయ్య పాల్గొన్నారు.

పది శాతంతో ప్రయోజనమెంత?



కోప్ర

హిందూ కుల వ్యవస్థ వేల ఏండ్లుగా కొనసాగిస్తున్న 'అసమానుల మధ్య పోటీ' నుండి అణగారిన తరగతులను రక్షించేందుకు ప్రవేశపెట్టిన రిజర్వేషన్లు కాలక్రమంలో ఎన్నికల రాజకీయాలలో నిర్ణయాత్మకంగా మారాయి. దీంతో రిజర్వేషన్ల అంశాన్ని పాలకపార్టీలు రాజకీయ కోణంలోనే చూస్తున్నాయి. తమ అధికారానికి ఒక సోపానంలా వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. దేశంలో మొదటగా కొల్హాపూర్ సంస్థానాధీశుడు సాహూమహరాజ్ 1902లో ప్రవేశపెట్టిన రిజర్వేషన్లకు నూరేండ్లు నిండినా వాటిని ప్రవేశ పెట్టిన ధ్యేయం మాత్రం పరిపూర్ణం కాలేదు, సరికదా, వాటి ఆవశ్యకత నానాటికీ పెరిగిపోతూనే ఉంది. సామాజక అణచివేత గీటురాయిగా ప్రవేశపెట్టిన ఆ గీతను దాటి సామాజిక అణచివేతకు కారణంగా భావించే అగ్రకులాలకు సైతం అనివార్యంగా మారాయి. సామాజిక కోణంతోపాటు ఆర్థిక కోణాన్నీ జోడించుకున్నాయి. దశాబ్దాల క్రితం నుండే తమకూ రిజర్వేషన్లను వర్తింపచేయాలని అగ్రకులాలు డిమాండ్‌చేయడం మొదలుపెట్టాయి. మొదట అణగారిన తరగతులకు రిజర్వేషన్లను వ్యతిరేకించిన అగ్రకులాలు క్రమంగా తమ పంథా మార్చుకుని అణగారిన కులాల రిజర్వేషన్లను వ్యతిరేకించకుండా తమకూ కావాలని డిమాండ్ చేయడం మొదలుపెట్టాయి. 1990లో మండల్ కమిషన్ ద్వారా బీసీలకు రిజర్వేషన్ కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ జరిపిన ఆందోళన ద్వారా పొందిన అనుభవం అగ్రకులాల ఆలోచనను మార్చి వారిచేత రిజర్వేషన్ల డమాండ్‌ను ముందుకు తెచ్చింది. దీంతో ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల డిమాండ్ అదృశ్యమైంది. అణగారిన కులాల రిజర్వేషన్లను వ్యతిరేకించడం, కులాలకు అతీతంగా ఆర్థిక ఆధారిత రిజర్వేషన్లను డిమాండ్ చేయడం కన్నా అగ్రకులాలలోని పేదలకూ రిజర్వేషన్లను డిమాండ్ చేయడంలో న్యాయబద్ధత ఉంది. ఇది సామాజిక ఉద్రిక్తతలను తగ్గించి సామరస్యతకు దారితీస్తుంది. అందుకే సీపీఐ (ఎం) లాంటి పార్టీలు ఎంతో కాలంగా అగ్రకులాలలోని పేదలకు రిజర్వేషన్లను డిమాండ్ చేస్తున్నాయి. బిల్లు ప్రవేశపెట్టినపుడు దాదాపు అన్ని పార్టీలూ పూర్తిగా సమర్థించాయి. అణగారిన తరగతుల నుండి కూడా పెద్దగా వ్యతిరేకత వ్యక్తం కాలేదు. మండల్‌కు వ్యతిరేకంగా అగ్రకులాలు వీధికెక్కినట్టుగా అగ్రకులాలకు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ అణగారిన తరగతులు వీధికెక్కలేదు. నిజంగా ఇది అభినందించాల్సిన విషయం.

నిజానికి మండల్ కమిషన్‌కు వ్యతిరేక ఉద్యమ సమయంలోనే అగ్రకుల పేదలకు రిజర్వేషన్ డిమాండ్ చర్చలో ఉంది. అయితే ఇదే బీజేపీ నాడు అద్వానీ నాయకత్వంలో మండల్‌కు వ్యతిరేకంగా కమండల్‌ను ప్రయోగించి రామ జన్మ భూమి పేరుతో దేశంలో ఒక ఉన్మాద వాతావరణాన్ని రేకెత్తించడంతో ఆ డిమాండ్ పక్కకు పోయింది. 1991లో నాటి ప్రధాని పీవీ నర్సింహ్మారావు ఈ ప్రతిపాదనను తీసుకొచ్చినా తన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చే కమండల్ ఉద్యమం మరుగున పడుతుందన్న భయంతో ఇదే బీజేపీ మోకాలడ్డింది. 2003లో అగ్రకుల పేదలకు రిజర్వేషన్ కల్పిస్తూ నాటి వాజ్‌పేయి క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం చట్టబద్ధం కాకుండా తన రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ సహాయ నిరాకరణ చేసింది..ఆయా సందర్భాలలో కేరళ, హర్యాణా, గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలు కూడా రకరకాల కారణాల వల్ల ఫలించలేదు. 1992లో ఇందిరా సహానీ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు 'ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవని, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనీ' ఇచ్చిన తీర్పు కూడా అగ్రకుల పేదల రిజర్వేషన్లకు అడ్డంకిగా మారింది. సుప్రీం కోర్టు తీర్పును అధిగమించి నిర్ణయం తీసుకునేందుకు రాజ్యాంగ సవరణ అవసరం కావడం, అందుకు తగిన మెజారిటీ లేకపోవడంతో సంకీర్ణ పాలక పార్టీలు అందుకు సాహసించలేకపోయాయి. ఈ విషయంపై 21 ప్రయివేట్ బిల్లులు పార్లమెంట్ ముందుకు వచ్చినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు బీజేపీకి పార్లమెంటులో తగిన బలం ఉండటం, ఎన్నికల సీజన్ కావడంతో అగ్రకులాల ఆగ్రహానికి భయపడిన ఇతర పార్టీలు సహకరించడంతో ఎన్డీఏ ప్రభుత్వం రాజ్యాంగంలోని 15, 16 అధికరణలను సవరించి అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేయగలిగింది. దీంతో కుల, మతాలకు అతీతంగా ఇప్పటి వరకూ రిజర్వేషన్ పొందని దేశంలోని 8 లక్షలలోపు సంవత్సరాదాయం కలిగిన దేశ ప్రజలందరికీ రిజర్వేషన్ అందుబాటులోకి వచ్చింది. వాస్తవానికి తమ రాజకీయ ప్రయోజనాల కోసం పాలక పార్టీలు అగ్రకుల పేదల రిజర్వేషన్లకు అంగీకరించినప్పటికీ ఈ విషయంలో అణగారిన తరగతుల సహకారం అత్యంత కీలకం, నిర్ణయాత్మకం. ఇక, ఈ రిజర్వేషన్లకు కోర్టు ద్వారా ఏవైనా అడ్డంకులు ఎదురవుతాయేమోనని కొందరు సందేహిస్తున్నారు. ఇందుకు కారణం పాలకుల అవకాశవాదమే. మోడీ ప్రభుత్వానికి ఓటుపై యావ తప్ప చిత్తశుద్ధి ఉండివుంటే ఎన్నికల ముందు ఇంత హడావిడిగా కాకుండా తాము అధికారానికొచ్చిన మొదట్లోనే ఇందుకు ఒక కమిషన్ వేసి దాని సిఫార్సులపై అన్ని పార్టీలతోను, పార్లమెం టులోనూ సమగ్రంగా చర్చించి చట్టం తీసుకొచ్చేది. సామాజిక వెనుకబాటుతనం లేకపోయినప్పటికీ ఆర్థికంగా పేదరికం ప్రాతిపదికన రిజర్వేషన్ల ఆవశ్యకతను, లోతైన అధ్యయనంతో కూడిన ఏదైనా కమిషన్ సిఫారసుల ఆధారంగా ఈ చట్టం చేసి ఉండేది. అలా జరగకపోవడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. పార్లమెంటులో తమ మూకబలాన్ని అడ్డు పెట్టుకుని తమ రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా, రిజర్వేషన్లకు అర్హతగా సంవత్సర ఆదాయం 8 లక్షలుగా నిర్ణయిస్తూ చట్టం తీసుకురావడంతో ఈ రిజర్వేషన్ మౌలిక లక్ష్యానికే గండి పడింది. సంవత్సరానికి 8లక్షల ఆదాయం, పట్టణ నేపథ్యం ఉన్న పిల్లలతో దారిద్రరేఖకు దిగువున ఉన్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన పిల్లలు ఎలా పోటీ పడగలరు? అగ్రకులాలలోని దాదాపు 95 శాతం మంది రిజర్వేషన్ల పరిధిలోకి వస్తే ఇక ఆర్థిక వెనుకబాటుతనం ఆధారిత రిజర్వేషన్లకు అర్థమేముంది? 8 లక్షల ప్రాతిపదిక కూడా ప్రశ్నార్థకమే. ఇది కూడా ఏదైనా కమిషన్ అధ్యయనం ప్రాతిపదికన చేస్తే అదివేరే విషయం. కానీ ఇక్కడ ప్రభుత్వమే నిర్ణయించింది. బీసీలకు, అగ్రకులాలకు ఆర్థిక పరిమితి 8 లక్షలే అయినపుడు బీసీలు అదనంగా అనుభవిస్తున్న సామాజిక వెనుకబాటుతనానికి చేయూత ఎక్కడిది? సామాజిక అణచివేత, వెనుకబాటుతనం రిజర్వేషన్ల కల్పనకు గీటురాయిగా ఉండాలన్న రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఏ చట్టాన్నీ అంగీకరించబోమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ చట్టం కోర్టులో నిలుస్తుందా? అన్న ప్రశ్నలకు పాలకుల వద్ద సమాధానం లేదు.

కాగా, అగ్రకుల పేదలకు రిజర్వేషన్లను ఆహ్వానిస్తూనే సమగ్రత, ప్రయోజనాలపై లోతుగా చర్చించుకోవాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్లు ప్రభుత్వ ఉద్యోగాలకు, ప్రభుత్వ రంగం సంస్థలకు మాత్రమే వర్తిస్తాయి. నూతన ఆర్థిక విధానాల కారణంగా దేశంలో ప్రభుత్వరంగం కుదేలవుతూ ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలు, శాఖలలో ఏటా ఉద్యోగ విరమణ చేసేవారే తప్ప ఉద్యోగం పొందే వారి సంఖ్య గణనీయంగా లేదు. అందువల్ల ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కూడా రిజర్వేషన్ సదుపాయం ఆచరణలో నిరుపయోగమ వుతున్నది. ఎన్నికలలో 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మోడీ వాగ్ధానం గంగలో కలిసింది. ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా ఉద్యోగాలు ఊడిపోయి ఉద్యోగులు, కార్మికులు వీధిన పడుతున్నారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి రిపోర్టు ప్రకారం ఏడాది కాలంలో 1.10 కోట్ల మంది ఉద్యోగాలు ఊడిపోయాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పెద్ద చదువులు చదువుకున్న యువకులే అత్యంత తక్కువ జీతాలకు, ఏమాత్రం భద్రతలేని పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. రిజర్వేషన్ల బిల్లు ఆమోదించినరోజే కనీస వేతనం నెలకు రూ.18 వేలుగా నిర్ణయించాలని 20 కోట్లమంది కార్మికులు దేశవ్యాప్తంగా సమ్మె చేశారు. ఆమాత్రం డిమాండును కూడా అంగీకరించని మోడీ ప్రభుత్వం, పేదలను నెలకు 60 వేలకు పైగా ఆదాయం పొందుతున్న అగ్రవర్ణ కుంటుంబాల పట్టణ యువతతో పోటీ పడాలంటున్నది. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పిస్తే తప్ప ఈ రిజర్వేషన్ల వల్ల పెద్దగా ప్రయోజనం దక్కదు. ఇక విద్యారంగం గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య అటుంచి, అసలు విద్య అందించడమే తమ బాధ్యత కాదని భావిస్తున్నారు పాలకులు. ప్రైవేటు విద్యా వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ విద్యకు గ్రహణం పట్టించేశారు. కావాలనే ప్రభుత్వ విద్యలో నాణ్యత తగ్గించి, లక్షలు పోసి ప్రైవేటు విద్యను కొనగోలు చేయక తప్పని స్థితి కల్పిండంతో, ఇప్పటికే విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకే రిజర్వేషన్లు నిరుపయోగంగా మారి, రిజర్వేషన్లు లేని ప్రయివేటు రంగంలో విద్యను కొనుక్కుని, ఉద్యోగాలు వెతుక్కోవాల్సిన అనివార్యతలోకి నెట్టబడ్డారు. ఇక ఇప్పుడు కొత్తగా అగ్రకులాలకు, హిందూయేతర మతస్తులకూ విద్య, ఉద్యోగ రంగాలో కల్పించిన పది శాతం రిజర్వేషన్లు ఏం ప్రయోజనం చేకూర్చగలవు?

ఈ నేపథ్యంలో కుల, మతాలకు అతీతంగా దేశంలోని పేదలంతా ప్రభుత్వ రంగ రిజర్వేషన్లకు పరిమితం కాకుండా ప్రైవేటు రంగ రిజర్వేషన్లపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. విద్యా, ఉద్యోగ రంగాలనుంచి ప్రభుత్వ ఆజమాయిషీ నుండి క్రమంగా తప్పించి, ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో పెడుతూ, మొత్తం రిజర్వేషన్లకే ఎసరుపెడుతున్న పాలకుల కుట్రలను ఎండగడుతూ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం సమైక్యంగా ఉద్యమించాల్సిన అవసరముంది.

సెల్ : 6301289321

కమ్యూనిస్టుల ఐక్యత సాధ్యంకాదా?




నైనారపు నాగేశ్వరరావు

వర్తమాన దేశ రాజకీయాలలో ఒక ఆసక్తికరమైన అంశాన్ని లెవనెత్తుతున్నారు. ప్రస్తుతం దేశంలో పెరుగుతున్న మతోన్మాదాన్ని ఎదుర్కోవాలంటే ప్రజా స్వామిక లౌకిక శక్తులు ఐక్యం కావటంతోపాటు, ముఖ్యంగా కమ్యూనిస్టులంతా ఐక్యంగా నడవాల్సిన అవసరం ఉందని సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు. విడివిడిగా ఉండటానికి ఆ పార్టీల నాయకులు చెప్పే కారణాల గూర్చి ఆలోచించే పరిస్థితులలో ప్రజలు లేరు.కమ్యూనిస్టులంతా ఐక్యంగా నడవాలన్న కోరిక చాలా కాలంగా బలంగా ఉందనేది వాస్తవం. ఆ పార్టీలు నడుపుతున్న ప్రజాసంఘాలలో కూడా ఇదే కోరిక బలంగా ఉంది. బహిరంగంగా బయట పడకపోయినా ఎక్కువ మంది నాయకులు కూడా కమ్యూనిస్టుల ఐక్యత మీద సానుకూలంగానే ఉన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేకతలోను, పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడీ విధానాన్ని విమర్శించటంలోనూ, దేశంలోని బూర్జువా పార్టీల వైఖరిలోనూ, భాషలో తప్ప భావంలో తేడా కనిపించదు. విమర్శ, ఆత్మవిమర్శలోనూ, కమ్యూనిస్టులందరిది లెనిన్ సూత్రీకరణే. అన్ని కమ్యూనిస్టు పార్టీల్లోనూ త్యాగాలు చేసిన వారు, చేస్తున్నవారు ఉన్నారు. భారతదేశంలో అమరత్వ, వారసత్వ సంపద ఏ రాజకీయ పార్టీకి లేనంతగా కమ్యూనిస్టులకు ఉంది. సామాన్యుడికి అర్థంకాని ప్రశ్న. ప్రజలలో చాలామందిని వేధించే ప్రశ్న. మార్క్సిజంలో మునిగితేలిన కొంత మంది మేధావులకు మాత్రం ఎక్కడో కమ్యూనిస్టుల అనైక్యతకు కారణం దొరుకుతుంది. కానీ సామాన్యుడికి కొంచెం ఆలోచించే వాడికి ఇవేమీ పట్టడం లేదు. వాళ్ళు సమస్యలతో సతమతమౌతున్నారు. వారికి జీవించడమే పెద్ద కష్టంగా ఉంది. చావో–రేవో అన్న చందంగా ప్రజల పరిస్థితి ఉంటే అనైక్యతకు కమ్యూనిస్టులు చెప్పే కారణాలు వారికి అర్థం కావడం లేదు. ప్రజల కోరికను కమ్యూనిస్టులు గుర్తించాలి, గ్లోబల్ దోపిడీపై స్వారీ చేస్తున్న ఫైనాన్స్ పెట్టుబడి చర్యలు కమ్యూనిస్టుల ఐక్యత అవసరాన్ని మరింత ముందుకు తెస్తున్నాయి. ఈ తరుణంలో దేశంలో ప్రజాస్వామ్య విధ్వంసానికి బీజేపీ ప్రభుత్వం పూనుకుంటుంది, ప్రస్తుతం బీజేపీ చేతులో మతం అనేది ఆయుధం, మూఢవిశ్వాసాల కు, సనాతన చాందస వాదానికి నిలయమైన మన దేశంలో మతవిద్వేషం తోడవటంతో వ్యవస్థకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఒక మాటలో చెప్పాలంటే ప్రస్తుతం దేశంలో "హిందుత్వం" పేరుతో "రాజ్యం – మతం" చెట్టాపట్టాలు వేసుకొని పెత్తనం చేయడానికి బీజేపీ విత్తనం నాటింది. తెలుగు రాష్ట్రాలలో కూడా అధికార కార్యక్రమాలన్నీ మతం పేరుతోనే నిర్వహించడం చాలా బాధాకరం. భిన్న సంస్కృతులు, మతాలు, కులాలు , జాతులు ఉన్న భారతదేశానికి ఈ పరిస్థితి దాపరించడం ప్రమాదకరం. సమాజ చరిత్రలో ప్రకృతి ద్వారా మానవుడు ఎన్నో విధ్వంసాలు ఎదుర్కొన్నాడు. తన సుధీర్ఘ ప్రయాణంలో నిలదొక్కుకున్నాడు. కానీ మత ఘర్షణలు జరిగిన అన్ని సందర్భలలోనూ, మానవ సమాజం మతపీడనకు గురైంది. ఇక్కడా సామాన్య మానవుడే బలిపశువయ్యాడు. మనదేశ భవిష్యత్ పరిస్థితి కూడా దీనికి భిన్నంగా, ఉండబోదని, విద్యావంతులు, మేధావులు, అభ్యుదయవాదుల అందరిలోనూ ఈ ఆందోళన ఉంది. మత మౌఢ్యాన్ని ఎదుర్కోవాలంటే "శ్రామిక ఐక్యత పోరాటం"ఒక్కటే మార్గం. చరిత్రలో అనేక సంఘటనలు దీన్ని రుజువు చేస్తున్నాయి. కమ్యూనిస్టు సోషలిస్టుల మధ్య అనైక్యత కారణంగా నాటి 1919లో జర్మనీలో రోజాలగ్జంబర్గ్, కార్ల్‌లీ బ్నెక్ట్ లాంటి నాయకులను సామ్రాజ్యవాదులు ఉరితీ యగలిగారు. ఈ అనైక్యత వల్ల జర్మనీలో ఫాసిజం తలెత్తింది. దేశ రాజకీయ పటంలో బూర్జువ పార్టీలు, జాతీయ స్థాయి అయినా, ప్రాంతీయ స్థాయి అయినా వీటి పాత్ర ఎల్లప్పుడు మౌలికంగా ఒక్కటే. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా వీరి విధానాలలో తేడా ఉండదు. శ్రమ శక్తిని దోపిడీ చేయడంలో వీరి అధికార పీఠాలు మారుతూ ఉంటాయి. ఎవరిని అధికారంలో ఉంచాలో ఎవరిని ప్రతిపక్షంలో ఉంచాలో దేశీయ పెట్టుబడిదారులు నిర్ణయించే పరిస్థితికి నేటి దేశ రాజకీయ వ్యవస్థ దిగజారింది. గ్లోబల్ ఫైనాన్స్ పెట్టుబడి నుంచే ఈ మొత్తం దోపిడీ ప్రక్రియకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు మాత్రమే నిలబడగలరు. ఈ బాధ్యతను వీరు మాత్రమే మోయగలరు. ప్రపంచ చరిత్రలో ఐక్య కమ్యూనిస్టు ఉద్యమమే అంతిమంగా ఫాసిజాన్ని ఓడించగలదు. విముక్తి పోరాటాలకు అండగా నిలబడగలదు. కొంత మేరకైనా ప్రజాస్వామ్యం మనుగడ ఉంటుందంటే ఏ దేశంలోనైనా అది కమ్యూనిస్టుల త్యాగాల వల్లనే. ప్రస్తుతం దేశంలో సామాజిక శక్తులు సహజీవనానికి కమ్యూనిస్టు ఐక్యత అనివార్యమైంది. గత 30 సంవత్సరాల నాడే అమరజీవి కా॥పుచ్చలపల్లి సుందరయ్య 1983లో విజయవాడలో జరిగిన కంభంపాటి సత్యనారాయణ వర్ధంతి సభలో కమ్యూనిస్టుల ఐక్యత ప్రాధాన్యతను అవసరాన్ని గురించి మాట్లాడిన విషయాలు నాటి నుండి నేటి వరకు అనేక మంది నాయకులు ఈ విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తూ చేసిన అనేక ప్రసంగాలు ఇంకా మెదులుతూనే ఉన్నాయి. కా॥ సుందరయ్య మాటల్లోని సారాంశాన్ని పూర్తిగా తీసుకోవడం నేటి కమ్యూనిస్టుల కర్తవ్యం, బాధ్యత.

సెల్ : 8331006110

పల్లెల ప్రగతే దేశాభివృద్ధికి సూచిక



డా.పోలం సైదులు

గ్రామాలలో ప్రజాస్వామ్యం వికసించి, అది స్వయం సమృద్ధి సాధించిన ప్పుడే జాతి పురోగతి సాధ్యమవుతుందని సెలవి చ్చారు మహాత్మ గాంధీ. ప్రజల భాగస్వామ్యం తో గ్రామాలలో స్వయం పాలన బాట పట్టించడం కోసం పంచాయతీ రాజ్ వ్యవస్థను ఏర్పా టు చేశారు. అంటే గ్రామాల అభివృద్ధి కొనసాగి నప్పుడే రాష్ట్రం దేశం అభివృద్ధి దిశగా పయని స్తుందని అర్థం. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆ సమయం ఆసన్నమైనది. ఎన్నో అవాంతరా లను అధిగమించి ఎట్టకేలకు ఎలక్షన్ కమిషన్ రిజర్వేషన్స్ ఖరారు చే సి ఎన్నికలకు సిద్ధమైంది. జనవరి 21, 25, 29తేదీలలో మూడు వి డతలుగా ఒక నెలలోపే సర్పంచులను నియమించబోతుంది. కానీ ఎ న్నుకోబడే వ్యక్తులు ఎలా ఉండాలి? ఎవరిని ఎన్నుకోవాలి? అనే సం గతి సమాజ నిర్మాతలను ఆవిష్కరించే ఓటర్ల పైననే వున్నది. ఓటర్ల ను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా, అధికార బలంతో గట్టెక్కినా ఇ లా ఎన్నో కారణాలతో గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నికయ్యారంటే త న విధులేంటో, గతంలో దేశంలో గ్రామాలాభివృద్ధికి పాల్పడిన గ్రామ ప్రథమ పౌరుల గురించి తెలుసుకుని అదే బాటలో నిస్వార్థంగా పయ నిస్తూ అభివృద్ధి బాట పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దేశంలో, రాష్ట్రాలలో జరిగే ఎన్నికలు ఒక్కెత్తైతే గ్రామస్థాయిలో జరిగే ఎన్నికలు మరో ఎత్తు అనడంలో ఎలాంటి సంశయం అక్కరలేదు. ఎందుకంటే రాష్ట్ర, కేంద్ర నాయకులు ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు ఎంత ఘాటుగా చేసుకున్నా వ్యక్తిగతంగా ఒకరికొకరు స్నేహభావంతో మె లుగుతారు. అదే విషయాన్ని గ్రామస్థాయిలో చూ స్తే ఒకరిపై ఒకరు పగలు, ప్రతీకారాలు పెంచుకుంటూ తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారనడంలో ఎలాంటి అనుమానం లేదు. తమ పార్టీనేమన్న, పార్టీ నాయకుడినేమన్నా తమ కుటుంబ సభ్యుల కంటే ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ మెలుగుతుంటారు. అసెంబ్లీ, పార్ల మెంటు ఎన్నికలు నిర్వహించడం కంటే పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం కష్టమని చెప్పకతప్పదు. ఏది ఏమైనప్పటికీ సర్వం సిద్ధమైంది. రిజ ర్వేషన్స్‌లో తేడాలొచ్చాయని కొంతమంది కోర్టు మెట్లు ఎక్కారు కానీ కోర్టు సైతం ఎన్నికలు జరపడానికే మొగ్గుచూపింది. అలాంట పుడు గ్రామీణ ప్రజలు ఎంతో అప్రమత్తమై నిస్వార్థంతో, గ్రామాభివృద్ధికి పా టుపడే నాయకుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇప్పు డు జరిగే పంచాయతీ ఎన్నికలలో యువతే కీలకం కానున్నారు. కావు న గతంలో రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసి చరిత్ర సృష్టించిన కొన్ని విషయాలను చూస్తే రంగారెడ్డి జిల్లా హాజీపల్లి గ్రామానికి చెందిన గ్రామ ప్రథమ పౌరురాలిగా ఎన్నికై గ్రామంలోని వీధులన్నీ సిమెంట్ రోడ్లతో నిర్మించి, ప్రతి వీధికి భూ అంతర్భాగం ద్వారా మురి కి కాలువలను నిర్మించి, ప్రతి ఇంటికి మరుగు దొడ్లు కట్టించి, పాఠశా లలను, అంగన్వాడీ కేంద్రాలను, గ్రామ పంచాయతీ భవ నాన్ని, గ్రం థాలయాన్నీ నిర్మించి, 2008లో అప్పటి దేశ ప్రథమ పౌరురాలు (రా ష్ట్రపతి) ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా 'నిర్మల్ గ్రామ పురస్కారం' అందుకున్నారు. అదే సంవత్సరం నవంబర్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి 'శుభ్రం' అవార్డు పొందడం అనేది మిగతా గ్రామ ప్రథమ పౌరులకు నిదర్శనం. వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి, కరీంనగర్ జిల్లాలోని రామచంద్రపురం, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్, మ హారాష్ట్రంలోని అహ్మదనగర్ జిల్లాలోని హైవేర్ బజార్‌లో కొన్ని అభివృ ద్ధి కార్యక్రమాలు పరిశీలిస్తే గ్రామ సభలను విజయవంతంగా జరిపి, పలు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ, ఆ సభలలో గ్రా మంలోని ప్రతి ఒక్కరిని హాజరయ్యేటట్టు చేసి, గ్రామాభివృద్ధికి కృషి చే శారు. గంగాదేవిపల్లిలో 18 రకాల కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామసభ ద్వారా శుద్ధమైన తాగునీరు కమిటీ, పారిశుద్ధ కమిటీ, ఆరోగ్య కమిటీ, సమాచార కమిటీ మొదలైనవి ఏర్పాటు చేసి ఎవ్వరికి ఏ విష యంలో సమస్య వచ్చినా, తగిన కమిటీలను సంప్రదించి సులభంగా పరిష్కరించుకునే విధంగా యంత్రాంగాన్ని ఏ ర్పాటు చేసి అభివృద్ధికి దోహదపడ్డారు. పాఠశాలకు వెళ్లే వయసుగల బాలబాలికలను పాఠశా లలలో చేర్పించేటట్టు యంత్రాంగాన్ని తయారుచేసి గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషిచేస్తూ విజయవంతం కావడం. ప్రతి ఇంటికి పరిశుభ్రమైన తాగునీరు అందేటట్టు చూడటం. జనాభా నియంత్రణలో భాగంగా దంపతులను ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలు చాలని ప్రోత్సహిస్తూ ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరే షన్స్ చేయించడం. గ్రా మంలోని ప్రతి పసిపిల్లలకు ప్రభుత్వం తరుపున అందించే పోలియో చుక్కలు, టీకాలు, వివిధ వ్యాక్సిన్లు సకాలంలో అందరికి అందేటట్టు చూడటం. గ్రామంలోని ప్రతి కుటుంబానికి బ్యాంకులో ఖాతా తెరిచి నగదు నమోదు చేసుకోవడానికి ప్రోత్సహించడం. గ్రామంలో పారిశుధ్యానికి అధిక ప్రాముఖ్యతనిస్తూ, ఎవరికి ఎలాంటి అంటూ రోగాలు రాకుండా జాగ్రత్తా పడటం. గ్రామంలో అందరి ఐక్యంగా మద్యపా నాన్ని నిషేధించి అభివృద్ధిలో పరుగులు తీసేవి ధంగా తీర్చిదిద్దడం అ నేది యావత్తు రాష్ట్రానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. ఇవే కాకుండా గ్రామాలలో ప్రథమ పౌరులే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసిన గ్రా మాల గురించి తెలుసుకుని, వాటిని ఆదర్శంగా తీసుకుని ఎన్నికైన స ర్పంచులు వాటితో సహా, మారుతున్న కాలానుగుణంగా మరికొన్ని అ భివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, యావత్తు రాష్ట్రంలో ప్రతిగ్రామం అభివృద్ధిలో ఒకరికొకరు పోటుపడుతూ, గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలాభివృద్ధి కీలకమని ప్రత్యక్షంగా రుజువు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. గ్రామంలోని ప్రజలంతా కలిసికట్టుగా వుండి అభివృద్ధిని కాంక్షి స్తూ వీలైతే ఇనానామా స్గా ఎలాంటి ఎన్నికలు లేకుండా నిస్వార్థ ప రుడిని, గ్రామ క్షేమం, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తులను ఎ న్నుకోవడం ఎంతో మంచి పరిణామం. కక్షలు, కుట్రలు లేకుండా, ఎ న్నికల అధికారులతో సహకరిస్తూ, పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అ వాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్ర తి పౌరుడిపై వున్నది. ప్రశాంత వాతావరణంలో, మరెంతో ప్రశాంతంగా ఎన్నికలలో పాల్గొంటూ, ఒక మంచి వ్యక్తిని గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నుకొని గ్రామాభివృద్ధికి దోహదపడాలని ఆశిద్దాం.

సెల్ : 9441930361

రంగనాయకమ్మ

-3-

భర్త ప్రియురాలిని భార్య బాదడం పరిష్కారమా?

ఇది, సావిత్రికి అన్యాయమే. సావిత్రి నిజం కూతురు ఇక్కొన్ని వీడియోల్లో, తమ తల్లి తమతో బాగా గడిపేదని చెప్పింది మరి. ఆ దృశ్యాలే వీ, సినిమాలో లేవు. ఇక, విషాద ఘ ట్టాల ప్రారంభం ఎలా జరిగిందో చెప్ప డానికి సినిమా కొన్ని దృశ్యాల్ని చూపిం చింది. సావిత్రికి సినిమాలు పెరిగిపో తూ, పేరు ప్రఖ్యాతులు పెరిగిపోతూ వుంటే, గణేషన్ సినిమాలు ఫ్లాప్ అవ డం అతని కీర్తి తగ్గడం జరుగుతోంద నీ, దానివల్ల అతనికి సావిత్రి మీద కొంత అసూయ బైల్దేరిందనీ, దాన్ని సావి త్రి స్పష్టంగా గమనించడం లేదనీ, చి న్న చిన్న ఘట్టాలు కొన్ని సాగాయి సి నిమాలో. ఈ ఘట్టాల తర్వాత, అతని వల్లే ఆమెకి తాగుడు అలవాటైనట్టు క థనం. ఒక సందర్భంలో, గణేషన్ ఏదో ఒక అబద్ధం చెప్పినట్టుగా, ఒకరి మాట ల వల్ల, సావిత్రికి ఏదో అనుమానం బైల్దేరింది. వెంటనే తన కారు మీద, డ్రై వరు లేకుండా ఎక్కడికో బైల్దేరింది. ఒక ఇంటి ముందు ఆగి, తలుపులు బార్లా గా తెరిచి వున్న ఆ ఇంట్లోకి విసురుగా ప్రవేశించింది. ఆ ఇల్లు, సావిత్రి ఇల్లు కాదు, గణేషన్ ఇల్లూ కాదు. ఒకవేళ అది, గణేషన్ ఆఫీసేమో, ఆ స్పష్టత లేదు. గణేషన్ అక్కడే వుంటాడని సావిత్రి ఎలా అనుకుంది? ఆ ఇల్లు ఆమెకి అం తకు ముందు తెలిసే వుంటుందా? యేమో ఆ వివరం లేదు! "ఏమండీ, ఏమండీ" అంటూ లోపలికి దూసుకువె ళ్లింది. అతగాడు, ఇంకేదో గుమ్మంలో నించి, ఆమె వేపు వచ్చాడు. 'మీరు ఎ క్కడికో వెళ్తానన్నారు కదా? ఇక్కడే వు న్నారా' అంది. 'ఇప్పుడే వచ్చాను' అన్నా డు. లోపల ఏదో చప్పుడయింది, లోప ల ఎవరో వున్నట్టు! సావిత్రి అటు పరు గుతీస్తోంటే, 'అటు వెళ్లకు' అన్నాడు. సావిత్రి అనుమానం మరీ గట్టిపడింది. లోపలి గదిలోకి దూసుకుపోతే, అక్కడ జుట్టు విరబోసుకున్న ఒక యువతి ని లబడి కనపడింది. ఇటు చూస్తే, భర్త గారు వచ్చి నిలబడి మౌనంగా చూస్తు న్నాడు. సావిత్రి, ఆ యువతి మీదకి ల ంఘించింది. అతను, ఆ కొత్త ప్రియురాలిని రక్షిం చడానికి అరుస్తూ అడ్డు పడబోతే, అతన్ని కూడా సావిత్రి కొడు తూ అరిచింది. సినిమాల్లో, 'ఫై టింగులు' ఉండాలంటారు. ఇక్కడ కూడా ఫైటింగుని చూపించాలనుకున్నారేమో! సావిత్రి నిజ జీవితంలో, భర్త గారు రహస్యంగా తెచ్చుకున్న యువతి మీద సావిత్రి కలబడి కొట్టడం, ఎప్పుడైనా నిజంగా జరిగిందా? అలా జరిగినట్టు ఎవరైనా సినిమావాళ్లకి ఆ ధారాలతో సహ చెప్పారా? – ఇటు వంటి కల్పనలు సావిత్రి సినిమాలో అనేకం వున్నట్టే అనిపిస్తోంది. భర్తగారి రహస్య చేష్టలు నిజం సావిత్రికి తెలి సిపోయాయి – అనడంలో వింతేమీ వుండదు. కానీ, అప్పుడు సావిత్రి, ఆ కొత్త యువతిని, పెద్ద పోరాటంతో కొ ట్టిందని చూపించడం, సావిత్రి గౌర వాన్ని సర్వ నాశనం చేస్తుంది. తన భ ర్త, ఇంకో స్త్రీతో రహస్య సంబంధంలో వున్నాడని కళ్లారా చూసిన సందర్భం లో సావిత్రి, నిశ్శేష్టురాలై, నిశ్శబ్దంగా వెళ్లిపోవడమే జరగాలి. ఆ భర్తతో తన సంబంధం ఇక ఎలా వుండాలో, అది బైటికి వెళ్లి తెల్చుకోవలిసిన విషయం.

'నీ మీదే నా ప్రేమ, ప్రేమ' అని చె ప్పే తన మొగుడు, తనకు అబద్ధాలు చెపుతూ, ఇతర ఆడవాళ్లతో గడుపుతు న్నాడని గ్రహించినపుడు, సావిత్రి ఏం తెలుసుకోవాలి? తను ఎటువంటి 'తి రుగుబోతు'ని ఎంతో ఉత్తముడని భావించి ఎంచుకుందో, ఆ సంగతి తెలు సుకోవాలి. అది గుర్తు చేసుకుని, సిగ్గుతో చితికిపోవాలి. అలా గాక, ఆ కొత్త యువతి మీద పడి, ఆమెని బాదడంతో తన గౌరవాన్ని ఎలా నిలబెట్టుకుంటుంది? భర్తగారి ప్రతీ కొత్త ప్రియురాలనీ బాదుతూ వుం డడమా ఆమెకి పరిష్కారం? తన పాత తప్పుని ఎలా సర్దుకుంటుంది? – సావి త్రి, ఆ యువతిని బాదినట్టు చూపించే కల్పనతో సావిత్రికి న్యాయం చేసినట్టా, అన్యాయం చేసినట్టా? ఆ పోరాటం తర్వాత తన కారులో వెనక్కి బైల్దేరింది. ఆ భర్త కూడా తన కారులో, 'సావిత్రీ, సావిత్రీ' అంటూ వెంటపడ్డాడు. సావి త్రి తిరస్కారం వల్ల అతను, ఆమె దగ్గి రికి చేరలేకపోయాడు. సావిత్రి, ఆ భర్త ని వదిలేసినట్టే! అయితే, ఈ సావిత్రి వదిలితే అతనికోలెక్కా? అతనూ సిని మాల వాడే. ఏ ఆడదాన్ని ఇంట్లోకి తె చ్చుకున్నా, నోరెత్తకుండా టీలు కూడా అందించే మొదటి భార్య సిద్ధంగానే వుంది! ఆడవాళ్లని తెగ మార్చుగల చతురుడే అతను. 'సినిమా సావిత్రి' మీద గాక, 'నిజం సావిత్రి' మీదే కొన్ని ప్రశ్నలు తప్పనిసరి అవుతాయి. అతని కి, అలివేలూ, పుష్పవల్లీ, అనే ఇద్దరు స్త్రీలతో బహిరంగ సంబంధాలు వు న్నాయనీ, ఆ స్త్రీల పిల్లలు అతనినే తమ తండ్రిగా చెప్పుకుంటారనీ, అన్ని భాషల ప్రపంచానికీ తెలుస్తూ వుంటే, అంత బహిరంగ విషయం, నిజం సావిత్రికి తెలీదా? – తెలుసు. కానీ, సావిత్రి, గణేషన్ గురించి ఎలా అర్థం చేసుకుందని ఊహించవచ్చుంటే, 'ఇక అతను పాత రకం గణేషన్‌గా వుండ డు, అతనికి పాత స్త్రీలు వుంటే వుంటా రు, వాళ్లు పాత వాళ్లే. అతని నిజమైన ప్రేమ వాళ్ల మీద కాదు, నా మీదే. నా తర్వాత ఇంకేమీ జరగదు. అతని ప్రే మ నాకే అంకితమైపోయింది' – ఈ విధంగా సావిత్రి నమ్మి వుంటుందని అనుకోవచ్చు. అంతేగానీ, అతను మళ్లీ మళ్లీ వెనక్కి తిరుగుతాడని సావిత్రి శంకించలేదు. చాలా దాంపత్యాల్లో, దా దాపుగా, రెండో భార్య గానీ, మూడో భార్య గానీ, పన్నెండో భార్య గానీ, ఇ లాగే భావిస్తూ వుంటారు, తమ తర్వా త ఇంకేమీ జరగదని. సినిమా సావిత్రి విషయానికొస్తే, అతను తన పాత స ంబంధాల్ని చెప్పేశాడు కదా? కాకపోతే, అతని ఎత్తుగడ ఏమిటంటే, 'నాకు పాత వాళ్లమీద వున్నది ప్రేమ కాదు, నా ప్రేమ నీ మీదే' అన్నాడు. ఆ మాట ల్లో సావిత్రికి తప్పు కనపడలేదం టే, అ ది సావిత్రి తప్పే! దా న్ని త ప్పు అనడం కన్నా, అ మా యకత్వం అనుకోవాలి. సిని మా సావిత్రి గురించి, మరీ ముఖ్యంగా ప్రశ్నించు కోవ లిసిన, అసలైన విషయాన్ని ఇక్కడ చె ప్పుకోవాలి. ఈ సావిత్రి, తన ఇంటి నిం చి ఒక వాన రాత్రి బైల్దేరి, తన ప్రి యు డి ఇంటికి పోతే, అక్కడేం జరిగిం ది? ఆ ప్రియుడి మొదటి భార్య, (లేదా, ఆ మెని రెండో భార్య అనుకున్నా, పన్నెం డో భార్య అనుకున్నా,) ఈమెని చూడ గానే, ఈమె మీద కలబడిందా? లేక పోతే, తన మొగుడి మీదే కలబడిందా ? ఆమె నిస్సహాయురాలు. ఈమె లా గా ఆమె సినిమా నటి కాదు. గొప్ప ఉ ద్యోగిని కాదు. అయినా, ఎంత నిస్స హాయురాలైనా, తన ముందు నిలబడ్డ రెండో ఆడదాన్ని "ఛీ! ఫోవే" అనకుం డా ఆదరంగా లోపలికి పిల్చి, టీ ఇస్తుం దా? ఆమె ప్రవర్తన సావిత్రికి చాలా ఆశ్చర్యం కలిగించాలి. ఆమె, తనని చీదరించలేదే! 'తోటి ఆడది, ఇతని వలలో పడింది' అనుకుందేమో! 'అందుకే నన్ను దయగా చూసింది' అనుకోదా సావిత్రి?

(తరువాయి భాగం సోమవారం సంచికలో...)

బాలికల పురోగతికి చిత్తశుద్ధి ఏది?




వాసిలి సురేష్

మహిళల పురోభివృద్ధి బాలికలకు సరైన విద్య అందించడం ద్వారా సాధ్యమవుతుంది. బాలికల విద్యా ప్రమాణాలు ఎక్కడైతే పెరుగుతాయో ఆయా సమాజాలలో మహిళల హోదా, గౌరవం మెరుగుపడుతుంది. గర్భంలో ఉండగానే మన దేశంలో బాలికలకు కష్టాలు ప్రారంభమవుతున్నాయి. ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలతో గర్భస్థ దశలోనే బాలికలను చిదిమేస్తున్నారు. చదువుకోవాలన్నా, ఉద్యోగాలు చేయాలన్నా అడుగడుగునా అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి, వరకట్నం పేరుతో గృహహింసలకు గురిచేసి పెండ్లిల అనంతరం కూడా హత్యలకు గురిచేస్తున్నారు. ఈదేశంలో పురాణ, ఇతిహాసాలు, వేదాల నుండే "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అని సామాజిక కట్టుబాట్లు పెట్టి స్త్రీని వంటింటికి, పడకింటికే పరిమితం చేసి ఆడవాళ్ళ ఎదుగుదలకు ఆటంకం సృష్టించారు. భారతీయ సమాజం మూలమూలాల్లో స్థిరపడిన పురుషస్వామ్య సంస్కృతి ఆడపిల్లల అణచివేతకు కారణమవుతోంది. వీటన్నింటికి కారణం విద్యలేకపోవడం. బాలికలకు విద్య, వైద్య, పోషకాహార, న్యాయం, సంరక్షణ వంటి కనీసహక్కులు అందడం లేదు. వాటి గురించి తెలియడంలేదు. బాల్యవివాహాలు, బాలికలపై అమానుషంగా లైంగిక దాడులు దేశ ప్రతిష్టకు మచ్చ తెస్తున్నాయి. ఇప్పటికీ మన దేశంలో పేద కుటుంబాలు, సామాజిక ఆర్థిక వెనుకబాటుతనం, తల్లిదండ్రుల వలసలు, ఇంటిపని కారణంగా బాలిక లు బడి మానేస్తున్నారు. కొడుకుల చదువులపై ఉన్న శ్రద్ధ తల్లిదండ్రులు తమ కూతుళ్ల చదువులపై చూపించడం లేదు. ఇప్పటికీ ఆడపిల్ల చదువులకు పెట్టుబడి పెట్టడం అనవసరమైన ఖర్చు అనే వివక్షాపూరి తమైన ధోరణి ఉండడం కూడా ఆడపిల్లల చదువుకు, వారి ఎదుగుదలకు ఆటంకంగా మారింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆడపిల్ల చదువులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆడపిల్లలు పాఠశాలల్లో నమోదు కావడం మగ పిల్లలతో సమానంగా ఉన్నప్పటికీ ఉన్నత విద్యలో చేరేనాటికి 10 నుంచి 30 శాతం మాత్రమే మిగులుతున్నారు. దీనికి కారణం ఆడ పిల్లలను కుటుంబ అవసరాల కోసం, ఆర్థిక అవసరాల కోసం చదువులకు దూరం చేస్తున్నారు. ఆడపిల్లల చదువులను దూరం చేసే కారణాలు చా లా రకాలుగా ఉన్నాయి. చిన్నతనంలోనే పెండ్లిలు చేయడం, సరైన పోషకాహారం అందక ఎదుగుదల లోపించడం, తల్లిదండ్రులు తమ సంతానంలో ఆడ, మగ వివక్షతలను పాటించడం, కుటుంబ పోషణ కోసం పని చేయాల్సి రావడం బాల కార్మికులుగా మార్చడం, ఇంట్లో చిన్న పిల్లల సంరక్షణ బాధ్యతలు చేపట్టడం, పేదరికం వల్ల చదువుపై ఆసక్తి ఉన్న ఉన్నత విద్య పొందలేకపోవడం, పాఠశాలల్లో సరైన మల, మూత్రశాల వసతులు లేకపోవడం, సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం, ఆడపిల్లలపై అఘాయిత్యాలు, పైశాచిక దాడులు పెరిగిపోవడం మొదలైనవని చెప్పవచ్చు.

ఆడపిల్లలకు రక్షణ కల్పించాలి. ఆత్మవిశ్వాసంతో పెరిగేలా చూడాలి. లింగ వివక్షత లేని సమాజం తీసుకురావాలి అనే లక్ష్యాలతో 2008లో భారత ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్ పేరుతో జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాల్యవివాహాల నియంత్రణ, అక్రమ రవాణా, మొదలైన అంశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. నేడు మనకు కావలసింది బాలికలకంటూ ఒకరోజు ప్రభుత్వం జరపడం కాదు. ప్రభుత్వం ఆడపిల్లల నిజమైన అభివృద్ధి జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఆడపిల్లలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలి. వివక్షత లేని సమాజాన్ని ఏర్పాటు చేయాలి. ఆడవారిపై ఎటువంటి పైశాచిక దాడులు, అఘాయిత్యాలు లేని సమాజాన్ని ఏర్పరచాలి, స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రాధాన్యతనిచ్చి వారి భద్రతకు భరోసా నివ్వాలి. సమాజంలో బాలికలు ఎదుర్కొనే సమస్యల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలి, లింగ వివక్షత, విద్యలో అసమానత, పోషకాహార లోపం, అనారోగ్య సమస్యలు, బాల్యవివాహాలు నివారణ, అక్రమ రవాణా మొదలైన అంశాలమీద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. సమాజంలో మహిళల పట్ల గౌరవం, హోదా పెంచేల కార్యక్రమాలు చేపట్టాలి, అమ్మాయిలు సాధారణ జీవితంలో ఎదుర్కొనే రకరకాలైన వివక్షతను, దోపిడీని తొలగించాలి. బాలికా విద్య పెంపొందించేందుకు మెరుగైన విద్యావకాశాలు కల్పి ంచాలి, బాలికా విద్య పట్ల సానుకూల దృక్పథం కలిగేలా సమాజంలో అవ గాహన పెంచాల్సి ఉంది. బాలికా విద్యకు ఎదురవుతున్న అవరోధాలను తొలగించాలి. లింగ సమానత్వం కోసం భ్రూణహత్యలు, పౌష్టికాహార లో పాలు, బాలికల అక్రమ రవాణా వంటి సమస్యలపై మరింత చిత్తశుద్ధితో పనిచేయాలి. శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక, రాజకీయ, క్రీడారంగాల్లో కీల కపాత్ర పోషించేలా స్త్రీలకు మరిన్ని అవకాశాలు కల్గించాలి. ఆర్థికస్వేచ్ఛ, ఉపాధి కల్పన కోసం బాలికల నైపుణ్యాలను మెరుగుపరచాలి.

సెల్ : 9494615360

విద్యారంగంలో నకిలీల విశ్వరూపం



సి. కనకదుర్గ

కల్తీలు, నకిలీలు జ్ఞానం ప్రసాదించే విద్యకు అంటుకోవడం, అది జ్ఞాన నిధియై ఎంతో మంది గురువులను విశ్వపీఠంపై నిలబెట్టి, ప్రపంచానికి జ్ఞాన భిక్ష పెట్టిన మన దేశానికి పాకడం ఎంతో బాధాకరం. మన దేశంలో ప్రస్తుతం చదువులలో డొల్లతనం,విద్యాప్రమాణాలు దిగజారిపోవడం, విద్యా వ్యవస్థ వైఫల్యానికి దర్పణం. నిత్యావసర వస్తువుల కల్తీయే కాకుండా ఎంతో విలువైన పట్టభద్ర సర్టిఫికెట్లను చిత్తు కాగితాల లెక్కన అమ్మి సొమ్ము చేసుకోవడం, అత్యున్నత విద్యాలయాలలో ఈ దందా నిరాఘాటంగా సాగడం విద్యా వ్యవస్థలోని లొసుగులను చెప్పకనే చెబుతోంది. ఎంతో అమూల్య సమయం వెచ్చించి నిరంతరం కృషి చేస్తే కాని రాని పీహెచ్‌డీ, ఎంటెక్ సర్టిఫికెట్లు ఈ రోజు అంగడిలో డబ్బిచ్చి కొనుక్కున్నే పెన్నో, పెన్సిల్ చందాన మారడం ప్రభుత్వాల వైఫల్యం, మరింత విద్యా వ్యవస్థ పట్ల వారి చిన్నచూపు ఎత్తిచూపిస్తోంది. అదనపు వేతనాల ఆశతో ఉద్యోగాలను నిలుపుకోవడానికి సాక్షాత్తు జ్ఞానం ప్రసాదించే గురువులు అడ్డదారులు తొక్కడం, ఈ సమాజానికి పట్టిన గ్రహణం. ఒక సర్వేలో వివిధ విద్యాలయాలలో 200 మంది అధ్యాపకులు, నలభై మంది ప్రిన్సిపాళ్లు, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారన్న గణంకాలు విద్యాశాఖ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష తార్కాణం. ఈ రోజు డబ్బులు పారేసి ఇంటి నుండే ఏ రాష్ట్రానికి చెందిన విద్యా సంస్థ నుండైనా పట్టాలు పొందుతున్నారంటే నకిలీ విద్యా వ్యవస్థ ఊడలు ఎంతవరకు విస్తరించాయో అర్థం చేసుకోవచ్చు. ఈ దందాలో అక్షరం ముక్క రాని బ్రోకర్లు కోట్ల రూపాయలు దండుకొని పీహెచ్‌డీ సర్టిఫికెట్లు సంపాదించి పెడుతున్నారన్న విషయం జీర్ణించుకోలేనిది. ఇలాంటివి విద్యాలయాలకే కాకుండా వైద్య విద్య, రవాణా శాఖ, సీఎస్ఐఆర్ వంటి పరిశోధనాలయాలకు పాకడం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట. నకిలీ సర్టిఫికెట్లతో డాక్టర్ల అవతారం ఎత్తి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడటం, ప్రొఫెసర్లుగా విద్యార్థులకు జ్ఞానభిక్ష పెట్టడానికి ప్రయత్నించడం ఏ మాత్రం సహించరాని విషయం. నిరుడు దేశవ్యాప్తంగా 279 సాంకేతిక కళాశాలలు, 29 బోగస్ విశ్వవిద్యాలయాలు వున్నట్టు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేసిన తర్వాత కూడా ఇంకా కొనసాగుతుండటం పాలకుల వైఫల్యానికి మచ్చుతునక. దేశంలో ప్రాథమిక విద్యా రంగం పరిస్థితి అధ్వానంగా వుందనుకుంటే ఉన్నత విద్యా రంగం కూడా దొందూ దొందే అన్నట్టు వుండడం భావిభారత విద్యార్థుల పట్ల శాపంగా మారుతోంది. ఉన్నత విద్యారం గానికి పరిపుష్టి కల్పించాల్సిన యూజీసీ, జాతీయ ఉన్నత విద్యా కమిషన్లు ఈ నకిలీ బాగోతానికి సాక్షి భూతంగా నిలవడం దురదృష్టకరం.

సెల్ : 7674887456

రచయితలకు సూచనలు

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. ప్రత్యేక సందర్భానికి సంబంధించిన వ్యాసమైతే దానిని గురించి కవరింగ్ లెటర్ రాయండి. వ్యాసం మొదటి పేజీ మీద పంపిస్తున్న తేదీ వేయండి.

వ్యాస రచయితలు తమ వ్యాసంతోపాటు పూర్తి పోస్టల్ చిరునామా కూడా పంపించాలని కోరుతున్నాం. ఇప్పటికే వ్యాసాలు పంపినవారు కూడా తమ అడ్రెస్‌లు పోస్టల్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపించాలని మనవి.

– ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228

నవచిత్రం


నాగార్జున

ఒకేసారి రెండు సీక్వెల్స్

నాగార్జున 'దేవదాస్' తర్వాత తెలుగులో మరే సినిమాకి సైన్ చేయలేదు. ప్రస్తుతం ఆయన రెండు సీక్వెల్స్ చేసే పనిలో ఉన్నారట. నాగార్జున కెరీర్‌లో నిలిచిపోయే చిత్రాల్లో 'మన్మథుడు' ఒకటి. ఈ సినిమాకి సీక్వెల్ రాబోతుందంటూ గతంలో వార్తలు వినిపించాయి. హీరో నుంచి దర్శకుడిగా మారిన రాహుల్ రవీంద్రన్ 'మన్మథుడు' సీక్వెల్‌పై దృష్టిపెట్టారు. ప్రస్తుతం ఈ స్క్రిప్ట్ ఫైనల్ అయ్యిందట. నాగార్జున కూడా కథని లాక్ చేయడంతో త్వరలోనే ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఆ తర్వాత 'సోగ్గాడే చిన్ని నాయన' వంటి హిట్ చిత్రాన్ని అందించిన కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఈ సినిమాకి సీక్వెల్ చేయబోతున్నారు. 'బంగార్రాజు' పేరుతో రూపొందబోతున్న ఈ చిత్ర స్క్రిప్ట్ కూడా ఫైనల్ అయ్యిందట. 'మన్మథుడు' సీక్వెల్ ప్రారంభమైన తర్వాత ఈ చిత్రం కూడా స్టార్ట్ కానుందని తెలుస్తుంది. ఏకకాలంలో రెండు సీక్వెల్స్‌లోనూ నటించాలని నాగార్జున ప్లాన్ చేస్తున్నారట. అయితే 'బంగార్రాజు'లో నాగార్జున తాత పాత్రలో కనిపించనుండగా, ఆయనకి మనవడిగా నాగచైతన్య నటించనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ రెండు చిత్రాలను అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మించనున్నారు. వీటితోపాటు నాగ్ హిందీలో 'బ్రహ్మాస్త్ర', తమిళంలో ధనుష్ చిత్రంలో నటిస్తున్నారు.

అవే నాకు పెద్ద శత్రువులు..


అఖిల్

'స్పోర్ట్స్ బేస్డ్ సినిమాలు చేయాలని ఉంది. అయితే వాటిని అంత కీన్‌గా తెరకెక్కించే దర్శకులు ఉన్నారా అనేదే ప్రశ్న. ఇక నాకు మొదట్నుంచి భారీ అంచనాలు, ఒత్తిడే పెద్ద శత్రువులు. అవి నన్ను మొదటి సినిమా నుంచి భయపెడుతున్నాయి' అని అంటున్నారు అఖిల్. 'అఖిల్' సినిమాతో హీరోగా పరిచయ మయ్యాడు అఖిల్. ఆ తర్వాత 'హలో' చిత్రంతో ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం వెంకీ అట్లూరి దర్శకత్వంలో 'మిస్టర్ మజ్ను'లో నటించాడు. ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా అఖిల్ బుధవారం మీడియాతో ముచ్చటించారు.

'అఖిల్' కంటే ముందే..

నా మొదటి సినిమా 'అఖిల్'కి కంటే ముందే వెంకీ ఈ కథ చెప్పాడు. కానీ అప్పటికే వినాయక్ సినిమాకి కమిట్ అయ్యా. ఆ తర్వాత మా బ్యానర్‌లో సినిమా చేయాల్సి ఉంది. దీంతో మూడో సినిమాగా దీన్ని చేద్దామని వెంకీకి చెప్పా. అప్పటికీ తను 'తొలి ప్రేమ' స్క్రిప్ట్ రాసుకోలేదు. ఇన్ని రోజులు ఖాళీగా ఉండే బదులు వేరే సినిమా చేస్తానని 'తొలిప్రేమ' చేశాడు. మూడేండ్ల క్రితం ఏ కథ అయితే చెప్పాడో, దాన్ని అదే విధంగా తెరకెక్కించాడు. ఎలాంటి మార్పులు చేయలేదు. వెంకీ చాలా రోజులుగా కామన్ ఫ్రెండ్స్ ద్వారా తెలుసు. కానీ ఈ కథ చెప్పిన తర్వాత తరచూ కలిసేవాళ్ళం. ఈ సినిమా చేయడం వల్ల మంచి ఫ్రెండ్స్ అయ్యాం. తను ప్యాషనేట్ రైటర్. త్రివిక్రమ్ సినిమాలని స్ఫూర్తిగా తీసుకుని రైటర్ అయ్యాడు.

క్యారెక్టర్ ప్రధానంగా సాగే సినిమా..

క్యారెక్టర్ ప్రధానంగా ఈ సినిమా సాగుతుంది. నేను ఈ సినిమా చేయటానికి కూడా అదే కారణం. ఇందులో నేను విక్కీ అనే ప్లేబాయ్‌గా కనిపిస్తాను. ఆ తర్వాత లవర్‌బాయ్‌గా ఎలా మారానన్నదే సినిమా. ప్రారంభంలో దాదాపు 20 నుంచి 30 నిమిషాలు నా పాత్రని రిజిస్టర్ చేయడానికే పడుతుంది. అది ఛాలెంజింగ్ పార్ట్. ఆడియెన్స్ వీడేంటని తెలుసుకోవడానికి అంత టైమ్ పడుతుంది. తర్వాత లవ్ స్టోరీ స్టార్ట్ అవుతుంది. దానికంటే ముందు మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి. 'నిన్నే పెళ్ళాడతా', 'మన్మథుడు', 'మజ్ను' తరహా ప్రేమ కథని దర్శకుడు మోడ్రన్‌గా చెప్పాడు. తాతగారు, నాన్నగారు నటించిన 'మజ్ను' చిత్రాలు విషాదాంతంగా ముగుస్తాయి. కానీ ఇందులో నేటి ట్రెండ్‌కి తగ్గట్టుగా యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా నా పాత్రని చూపించారు. 'ప్రేమనగర్'లోని మిస్టర్ అనే డైలాగ్‌ని ఇందులో పెట్టాం. ఓ రకంగా హిందీలో వచ్చిన 'ఏ జవానీ హై దివానీ'లోని పాత్రని పోలి నా క్యారెక్టర్ ఉంటుంది.

తప్పుని ఒప్పుకోవడానికి దమ్ము కావాలి..

మొన్న చిత్ర ప్రీ రిలీజ్ వేడుకలో తారక్ చెప్పినట్టు ఆత్మవిమర్శ చాలా ముఖ్యం. తప్పుని ఒప్పుకోవడానికి చాలా దమ్ము కావాలి. ఈ సినిమాలో బాడీ లాంగ్వేజ్ పరంగా, హావభావాల పరంగా నన్ను నేను మార్చుకునే ప్రయత్నం చేశా. డైలాగ్ మాడ్యులేషన్, ఎక్స్‌ప్రెషన్స్ పరంగా కొద్దిగా కొత్తగా ట్రై చేశాం. సినిమాలో భాగంగా 8 ప్యాక్‌లో కనిపిస్తాను. 'తొలిప్రేమ'తో పోల్చితే దర్శకుడు వెంకీ ఈ సినిమాతో కాస్త స్కేల్ పెంచాడు. మూడు ఫైట్స్‌తోపాటు మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి. లవ్ స్టోరీకి మ్యూజిక్ ప్రధానం. థమన్ అద్భుతమైన మ్యూజిక్ అందించారు. హీరోయిన్ నిధి అగర్వాల్ చాలా హార్డ్ వర్కర్. 'సవ్యసాచి'లో ఆమె వర్క్ చూసి ఎంపిక చేశాం. బెంగుళూరు అమ్మాయి కావడంతో తెలుగుని బాగా అర్థం చేసుకుంది.

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎంటర్‌టైన్‌మెంట్ అందించే ఏ చిత్రమైనా విజయం సాధిస్తుంది. ఇందులో కావాల్సినంత వినోదం ఉంది.

అంచనాలకు అతీతంగా..

'అఖిల్' పరాజయంతో కొంచెం ఇబ్బంది పడ్డా. దాన్నుంచి తేరుకోవడానికి టైమ్ పట్టింది. ఆ తర్వాత 'హలో' ద్వారా తిరిగి కాన్ఫిడెన్స్ పెంచుకున్నా. ఈ క్రమంలో చాలా అనుభవాన్ని పొందాను. చాలా విషయాలు తెలుసుకున్నా. అయితే ప్రారంభం నుంచి నా సినిమాలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బడ్జెట్ పరంగా భారీ.. భారీ అంటున్నారు. దీంతో ఓ వైపు ఒత్తిడి, మరోవైపు భారీ అంచనాలతో భయపడుతున్నా. అవే నాకిప్పుడు పెద్ద శత్రువులుగా తయారయ్యాయి. అంచనాలకి అతీతంగా నేను ఏం చేయగలనో అదే చేయాలనుకుంటున్నా. 'మిస్టర్ మజ్ను' నాకు బేసిక్స్ లాంటి చిత్రమవుతుంది. ఆడియెన్స్‌కి నాపై నమ్మకం కలగడానికి కాస్త టైమ్ పడుతుంది. నాకు లవ్ స్టోరీస్ అంటే ఇష్టం. నెక్ట్స్ ఏ జోనర్ చేసినా మళ్ళీ లవ్ స్టోరీస్ చేస్తా.

రామ్‌చరణ్ ప్రశంసించడం హ్యాపీ..

నాకు మంచి సపోర్టివ్ పేరెంట్స్ ఉన్నారు. కెరీర్ పరంగా నాన్న ఎక్కువగా గైడెన్స్ ఇస్తారు. స్క్రిప్ట్ డిస్కషన్‌లోనూ పాల్గొంటారు. అమ్మ(అమల) ఎమోషనల్‌గా చాలా స్ట్రాంగ్. ప్రస్తుతం ట్రెండ్‌కి ఆమె కాస్త దూరంగా ఉన్నారు. ఇండస్ట్రీలోనూ చాలా మంది మనల్ని ప్రోత్సహించే వ్యక్తులున్నారు. చాలా మంది సలహా లిస్తుంటారు. వాటిల్లో కొన్ని నెగటివ్స్ కూడా ఉంటాయి. కానీ మనకు ఏది కావాలో అది తీసుకోవాలి. చరణ్ ఈ సినిమాలోని తొలి పాటను చూసి ప్రశంసించారు. అందుకు చాలా ఆనందంగా ఉంది.

అలాంటి దర్శకులు ఉన్నారా ?

నెక్ట్స్ రెండు కథలు దాదాపు ఫైనల్ అయ్యాయి. భిన్నమైన జోనర్స్‌లో ఉంటాయి. వీటి వివరాలు ఫిబ్రవరిలో అధికారికంగా ప్రకటిస్తాం. క్రికెట్ బేస్డ్ నేపథ్యంలో సినిమా చేయాలని ఉంది. కానీ వాటిని అంత కీన్‌గా డైరెక్ట్ చేసే దర్శకులున్నారా? అనేదే ప్రశ్న. మంచి కథ వస్తే స్పోర్ట్స్ నేపథ్యంలో సినిమా చేయాలని ఉంది. త్వరలో కచ్చితంగా చేస్తా. అలాగే ఒకటి రెండు మల్టీస్టారర్ కథలు వచ్చాయి. అవి పెద్దగా నచ్చలేదు. ఆసక్తికరంగా అనిపిస్తే మల్టీస్టారర్ చేయడానికి సిద్ధమే. నాకైతే 'ఎక్స్‌పాండబుల్' తరహాలో ఏడెనిమిది మంది స్టార్స్‌తో కూడిన మల్టీస్టారర్స్ చేయాలనుంది. ఏదేమైనప్పటికీ ఇకపై సినిమాల విషయంలో స్పీడు పెంచుతాను. ఏడాదికి రెండు చిత్రాలైనా చేయాలనుకుంటున్నా.


ఛార్మి, రామ్, పూరీ జగన్నాథ్

ఇస్మార్ట్ శంకర్ షురూ!

రామ్ హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం రూపొందుతున్న విషయం విదితమే. పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరీ కనెక్ట్స్ పతాకాలపై ఛార్మితో కలిసి పూరీ జగన్నాథ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా బుధవారం ఘనంగా ప్రారంభమైంది. హీరో రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఛార్మి క్లాప్ నివ్వగా, నిర్మాత స్రవంతి రవి కిశోర్ కెమెరా స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'ఇందులో రామ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. నేటి(గురువారం) నుంచి రెగ్యులర్ షూటింగ్‌ని ప్రారంభిస్తున్నాం. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకి మణిశర్మ సంగీతం సమకూరుస్తున్నారు. రాజ్‌తోట సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. రామ్, పూరీ తొలిసారి కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలని అందుకునేలా సినిమా ఉంటుంది' అని తెలిపింది. పునీత్ ఇస్సార్, సత్యదేవ్, మిలింద్ గునాజి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను ఇతర పాత్రలు పోషిస్తున్నారు.


కళ్యాణ్‌రామ్

రూరల్ డ్రామా..

'పటాస్' తర్వాత కళ్యాణ్ రామ్‌కి సరైన హిట్ రాలేదు. గతేడాది వచ్చిన 'ఎమ్మెల్యే' కాస్త ఊరట నిచ్చింది. ప్రస్తుతం ఆయన సినిమాటోగ్రాఫర్ కె.వి గుహన్ దర్శకత్వంలో '118'లో నటిస్తు న్నారు. త్వరలో విరించి వర్మ దర్శక త్వంలో ఓ సినిమా చేయబో తున్నట్టు తెలుస్తుంది. 'మజ్ను' చిత్రంతో దర్శకుడు విరించి ఆకట్టుకున్నారు. ఆ తర్వాత ఆయన మరే సినిమా చేయలేదు. తాజాగా కళ్యాణ్‌రామ్‌కి కథ చెప్పాడట. అది బాగా నచ్చడంతో కళ్యాణ్‌రామ్ ఓకే చేసినట్టు సోషల్ మీడియాలో ఓ వార్త చక్కర్లు కొడుతుంది. రూరల్ డ్రామా నేపథ్యంలో లవ్ స్టోరీ, ఫ్యామిలీ సెంటిమెంట్ మేళవింపుగా ఈ చిత్రం ఉండనుందట. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్టు తెలుస్తుంది. త్వరలోనే ఇది సెట్స్‌పైకి వెళ్ళనుందని సమాచారం.

కాజల్



వారినైతే పెళ్ళి చేసుకోను!

'పెళ్ళి చేసుకోవాల్సి వస్తే సినిమాకి సంబంధించి కాకుండా బయటి వ్యక్తుల్నే వివాహం చేసుకుంటా' అని అంటోంది కాజల్. చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి దాదాపు 15ఏండ్లు పూర్తి చేసుకుంది కాజల్. ప్రస్తుతం పలు భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతోంది. ఇటీవల కథానాయికలు వరుసగా పెళ్ళిళ్ళు చేసుకుంటున్న నేపథ్యంలో ఆమెకి పెళ్ళికి సంబందించిన ప్రశ్న ఎదురైంది. దీనిపై కాజల్ స్పందిస్తూ, 'ప్రస్తుతం నా ఫోకస్ అంతా సినిమాలపైనే ఉంది. ఒకవేళ వివాహం చేసుకోవాల్సిన సమయం వచ్చినప్పుడు చిత్ర పరిశ్రమకి చెందిన వారిని మాత్రం చేసుకోను. నాకు పరిశ్రమలో చాలా మంది స్నేహితులున్నారు. కానీ వాళ్ళలో ఎవరినీ జీవిత భాగస్వామిగా ఊహించుకోలేదు. ఒకవేళ ఇండస్ట్రీకి చెందినవారు వచ్చినా నా పనిని గౌరవించి, అర్థం చేసుకునే వ్యక్తి అయితే అప్పుడు ఆలోచిస్తా' అని తెలిపారు. గతంలో కాజల్ ప్రేమలో పడి బ్రేకప్ తీసుకున్న విషయం విదితమే. ప్రస్తుతం ఆమె 'భారతీయుడు 2', 'పారిస్ పారిస్', 'కోమలి' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

అది గుండె పగిలినంత పని


అభిషేక్ బచ్చన్

'భారతీయుడు 2'కి భారీ తారాగణం యాడ్ అవుతోంది. కమల్ హాసన్ హీరోగా, శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఇప్పటికే సిద్ధార్థ్, శింబు, అక్షయ్ కుమార్ ఫైనల్ అయినట్టు తెలుస్తుంది. తాజాగా మరో బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ పేరు సైతం వినిపిస్తోంది. ఓ శక్తివంతమైన పాత్రలో అభిషేక్ బచ్చన్ నటించనున్నారట. స్క్రిప్ట్ నచ్చడంతో సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తుంది. దీంతో సినిమాపై మరింత క్రేజ్ ఏర్పడింది. కాజల్ కథానాయిక గా నటిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరణ్ నిర్మిస్తు న్నారు. ఇదిలా ఉంటే అభిషేక్ ఇటీవల 'మన్‌మర్జియాన్' చిత్రంలో సెకండ్ లీడ్‌గా నటించారు. ఈ సినిమా గురించి కాఫీ విత్ కరణ్ షోలో అభిషేక్ మాట్లాడుతూ, 'ఒకప్పుడు హీరోగా నటించిన తర్వాత సహాయ నటుడిగా నటించడమనేది ఓ నటుడికి గుండె పగిలినంత పని. అది చాలా కష్టం. బాధాకరం. చిత్ర పరిశ్రమ చాలా దారుణమైన ప్రదేశం. ఇక్కడ ఓ వ్యక్తి ఇది నాకు సొంతం, దీనికి నేను అర్హుడినని చెప్పుకోలేదు. రోజులు గడిచే కొద్దీ పరిస్థితులు మారుతుంటాయి. సెకండ్ హీరో నుంచి లీడ్ హీరో స్థాయికి వచ్చేందుకు హార్డ్ వర్క్ చేయాలి' అని అన్నారు.


'యాత్ర'లో మమ్ముట్టి

భావోద్వేగాల సమాహారం


మాజీ సీఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా 'యాత్ర' అనే బయోపిక్ రూపొందుతుంది. మహి వి రాఘవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డిగా మమ్ముట్టి నటిస్తున్నారు. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శశిదేవి రెడ్డి, విజయ్ చిల్లా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'నీళ్ళుంటే కరెంట్ ఉండదు, కరెంట్ ఉంటే నీళ్ళుండవు. రెండూ ఉండి పంట చేతికొస్తే సరైన ధర ఉండదు. అందరూ రైతే రాజంటారు. సరైన కూడు గూడు గుడ్డ లేని ఈ రాచరికం మాకొద్దయ్యా. మమ్మల్ని రాజులుగా కాదు, కనీసం రైతులుగా బ్రతకనివ్వండి చాలు.. అని ప్రతి రైతు గొంతెత్తి అరుస్తున్న సమయం అది. ఎవరైనా ఆదుకుంటే బాగుండూ అని ఎదురుచూస్తున్న సమయంలో నేనున్నాంటూ ఓ గొంతు వినిపించింది. నాయకుడిగా మనకు ఏం కావాలో తెలుసుకున్నాం కానీ జనానికి ఏం కావాలో తెలుసుకోలేకపోయామంటూ అదిష్టానాన్ని సైతం లెక్కచేయక పేద ప్రజల కష్టాల్ని వినడానికి కడప గడప దాటి పాదయాత్రని ప్రారంభించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో జరిగిన వాస్తవిక, భావోద్వేగ సంఘటనలతో సినిమాని తెరకెక్కించాం. సినిమాలో ఆద్యంతం ఎమోషన్స్‌తో కూడిన పాత్రలు, పాత్ర చిత్రణ కనిపిస్తుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. వైఎస్ పాత్రలో మమ్ముట్టి పరకాయ ప్రవేశం చేశారు. మా బ్యానర్‌లో 'భలే మంచి రోజు', 'ఆనందోబ్రహ్మ' తర్వాత వస్తున్న ఈ సినిమాతో హ్యాట్రిక్ హిట్ దక్కుతుందని భావిస్తున్నాం. తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో ఏకకాలంలో ఫిబ్రవరి 8న సినిమాని విడుదల చేయడానికి ప్లాన్ చేశాం. తెలుగుకి సంబంధించిన సెన్సార్ పూర్తయ్యింది. క్లీన్‌యు సర్టిఫికెట్‌ని పొందింది. ప్రతి తెలుగు వారు తప్పక చూడాల్సిన చిత్రమిది' అని తెలిపారు. రావు రమేష్, జగపతిబాబు, సుహాసిని, అనసూయ, పోసాని, సచిన్ కద్కర్, వినోద్ కుమార్, జీవా, పృథ్వీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్: కె, సినిమాటోగ్రఫీ: సత్యన్ సూర్యన్.

న్యూ ఏజ్ లవ్ స్టోరీ

అరవింద్ రెడ్డి, శుభాంగి పంత్, అజిత్ రాధారామ్, దీక్షితా పార్వతి ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'నీ కోసం'. అవినాష్ కోకటి దర్శకత్వంలో తీర్థసాయి ప్రొడక్షన్స్ పతాకంపై అల్లూరమ్మ(భారతి) నిర్మిస్తున్న ఈ చిత్రంలోని 'తొలి తొలిగా.. ' అంటూ సాగే తొలి పాటని దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాట చాలా బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. 'న్యూ ఏజ్ లవ్‌స్టోరీతో రెండు జంటల మధ్య ప్రేమ కథని ఈ తరానికి నచ్చేలా సినిమాని తెరకెక్కిస్తున్నాం. ఎంటర్‌టైన్‌మెంట్ తగ్గకుండానే ప్రేమ కథలో ఓ కొత్త భిన్నమైన కోణాన్ని ఆవిష్కరించే చిత్రమవుతుంది. లవ్ స్టోరీకి ఎమోషన్‌ని మేళవించి అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాం. ఇటీవల విడుదలైన టీజర్‌కి మంచి స్పందన లభించింది. టాకీ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ కార్యక్రమాలని జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ నెలలోనే విడుదల చేయనున్నాం' అని నిర్మాతలు తెలిపారు.


'నీకోసం' చిత్ర బృందంతో తమ్మారెడ్డి భరద్వాజ

మా నాన్న డబ్బు ఇవ్వలేదు


రణ్‌వీర్ సింగ్

'నన్ను హీరోని చేయడానికి మా నాన్న నాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. స్వశక్తితో ఎదిగా' అంటున్నారు రణ్‌వీర్ సింగ్. దీపికా పదుకొనెని పెళ్ళి చేసుకుని టాక్ ఆఫ్ ది ఇండియా అయ్యారు రణ్‌వీర్. తాజాగా ఆయన నటిస్తున్న 'గల్లీ బాయ్' చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో నాపై చాలా గాసిప్స్ వచ్చేవి. వాటిని పెద్దగా పట్టించుకోలేదు. కానీ నేను హీరో కావడానికి మా నాన్న నిర్మాత ఆదిత్య చోప్రాకి రూ.10లక్షలు ఇచ్చారని వార్తలు వచ్చాయి. అవి నన్ను బాధించాయి' అని తెలిపారు. దీంతోపాటు '83'లో నటిస్తున్నారు. కబీర్ ఖాన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కపిల్ దేవ్ పాత్రలో రణ్‌వీర్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి తాజాగా ఓ వీడియోని విడుదల చేశారు. త్వరలో సినిమాలో నటించే నటీనటులని వెల్లడించ నున్నారు. ఏప్రిల్ 10న సినిమాని రిలీజ్ చేయనున్నట్టు తెలిపారు. ఇదిలా ఉంటే రణ్‌వీర్ సింగ్ 'అందాజ్ అప్నా అప్నా' రీమేక్‌గా రూపొందుతున్న నయా చిత్రంలో వరుణ్‌ధావన్‌తో కలిసి నటించనున్నట్టు తెలుస్తుంది.


కరీనా కపూర్

న్యూ ఇయర్ గుడ్ న్యూస్

గతేడాది 'వీరె ది వెడ్డింగ్' చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది కరీనా కపూర్. ఆ తర్వాత ఆచితూచి సినిమాలని ఎంపిక చేసుకుంటోంది. అందులో భాగంగా 'గుడ్‌న్యూస్' చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అక్షయ్ కుమార్, కరీనా కపూర్, డిల్జిత్ దోసాంజ్, కైరా అద్వానీ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా నూతన దర్శకుడు రాజ్ మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్‌జోహార్ నిర్మాత. సరోగసీ ప్రధానంగా సినిమా తెరకెక్కుతుందట. తాజాగా బుధవారం చిత్ర షూటింగ్‌లో కరీనా జాయిన్ అయ్యారు. పాత్ర కోసం ప్రిపేర్ అవుతున్నట్టుగా మేకప్ గదిలో ఉన్న కరీనా ఫొటోని మేకప్ ఆర్టిస్ట్ మిక్కీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పోస్ట్ చేశారు. ఇందులో అక్షయ్‌కి జోడీగా కరీనా నటించనుంది. అక్షయ్, కరీనా పెళ్లైన జంటగా నటించనున్నట్టు తెలుస్తుంది. గతంలో ఈ ఇద్దరు 'ఐత్రాజ్', 'కాంబఖ్త్ ఇష్క్', 'గబ్బర్ ఈజ్ బ్యాక్' చిత్రాల్లో కలిసి నటించారు. వీరికిది నాలుగో చిత్రం.

అలా రిజర్వేషన్లు ప్రతిపాదించలేదు


"ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలని ముగ్గురు సభ్యులతో కూడిన ఎస్.ఆర్.సిన్హో కమిషన్ ప్రతిపాదన చేయలేదు. కేవలం ఆర్థిక వెనుకబాటు ఉందని రిజర్వేషన్లు కల్పించరాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు కూడా ఉంది. కాబట్టి దీనిపై ముందుకు వెళ్లటం లేదు."

- 2015, మార్చి పార్లమెంట్ సమావేశంలో మోడీ సర్కార్ ప్రకటన ఇది.

సార్వత్రిక ఎన్నికలు మూడు నెలలు ముందు సీన్ మొత్తం రివర్స్ అయ్యింది. మోడీ సర్కార్‌కు ఎన్నికల ప్రయోజనాలు గుర్తుకువచ్చాయి. రిజర్వేషన్ తాయిలాలతో ఒక వర్గం ఓట్లయినా గంపగుత్తగా పడకపోతాయా? అన్న ఆలోచన కాదా? అంటూ..జాతీయ మీడియాలో రాజకీయ, న్యాయ విశ్లేషకుల అభిప్రాయం.

న్యూఢిల్లీ : ఎస్.ఆర్.సిన్హో కమిషన్ ప్రతిపాదనల ఆధారంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని మోడీ సర్కార్ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టింది. అయితే ప్రధాని మోడీ చెప్పినట్టుగా 'ఎస్.ఆర్.సిన్హో' కమిషన్ ఈడబ్ల్యూఎస్‌కు రిజర్వేషన్ కల్పించాలని ప్రతిపాదన చేయలేదనీ, కేవలం వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా లబ్దిపొందాలన్న పచ్చి స్వార్థ పూరిత ఆలోచనతో ఈ రిజర్వేషన్ చట్టాన్ని తీసుకొచ్చారని రాజకీయ, న్యాయ విశ్లేషకులు తప్పుబడుతున్నారు. సిన్హో కమిషన్ ప్రతిపాదనలేంటి? మోడీ సర్కార్ చేసిందేమిటి? అన్నది పోల్చుతూ జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు ఈవిధంగా ఉన్నాయి..

సంక్షేమ చర్యలు తీసుకోమన్నది



ముగ్గురు సభ్యులతో కూడిన 'ఈడబ్ల్యూఎస్' కమిషన్‌కు రిటైర్డ్ మేజర్ జనరల్ ఎస్.ఆర్.సిన్హో నేతృత్వం వహించారు. ఈ కమిషన్ యూపీఏ - 1హయాంలో ఏర్పాటైంది. దేశవ్యాప్తంగా పర్యటించిన కమిషన్ సభ్యులు, అధ్యయనం పూర్తిచేసి తుది నివేదికను 2010, జులై 22న అప్పటి యూపీఏ ప్రభుత్వానికి సమర్పించారు.

ఈ నివేదికలో కమిషన్ చేసిన ప్రధానమైన ప్రతిపాదనలు రెండున్నాయి. ఒకటి..కేవలం ఆర్థిక వెనుకబాటును చూసి ఒక వర్గానికి రిజర్వేషన్లు కల్పించరాదు. రెండోది.. ఈడబ్ల్యూఎస్ వర్గాల్ని రాష్ట్రాలే గుర్తించి సంక్షేమ చర్యల్ని మాత్రం అమలుజేయవచ్చు. రాజ్యాంగ, న్యాయపరమైన పరిశీలన, అవగాహనతో సిన్హో కమిషన్ నివేదికలో కొన్ని విషయాల్ని చెప్పింది. ఆర్థిక వెనుబాటు ప్రాతిపదకగా ఈడబ్ల్యూఎస్ వర్గాలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించటం సముచితం కాదు...అన్నది కీలమైన పాయింట్. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ గతంలో జరిగిన అనేక ప్రయత్నాల్ని కమిషన్ ఈ సందర్భంగా ప్రస్తావించింది.

కమిషన్ ప్రతిపాదనకు విరుద్ధంగా...

ఆర్థిక వెనుబాటుతనమేగాక, సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం ఉందా?లేదా? అన్న పరిశీలన చేశాకే 'రిజర్వేషన్ల'పై ఆలోచన చేయాలి. రిజర్వేషన్లు మొత్తం 50శాతం మించరాదన్న సుప్రీంకోర్టు ఆదేశాల్ని దృష్టిలో ఉంచుకోవాలి. దీనిపై సుప్రీంకోర్టు మరో మాట చెప్పాకే ముందుకెళ్లాలి అంటూ తుది నివేదికలో కమిషన్ స్పష్టంగా తెలియజేసింది. సిన్హో కమిషన్ చెప్పినదానికి పూర్తి విరుద్ధంగా మోడీ సర్కార్ ముందుకెళ్లింది. ఈడబ్ల్యూఎస్‌కు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, రాజ్యాంగానికి 124 సవరణ బిల్లును పార్లమెంట్‌లో హఠాత్తుగా బిల్లు ప్రవేశపెట్టింది. కేవలం 48గంటల వ్యవధిలో బిల్లుకు లోక్‌సభ, రాజ్యసభ ఆమోదం దక్కింది. 2015లో ఇదేఅంశంపై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర సహాయ మంత్రి జితేందర్ సింగ్ ఏమని చెప్పారు? ఇప్పుడు మోడీ సర్కార్ చేసినదేమిటి? అని పరిశీలిస్తే ప్రధాని మోడీ మర్మమేమిటో తెలిసిపోతుందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.



రాజ్యసభలో మోడీ సర్కార్ ఏం చెప్పింది?

సిన్హో కమిషన్ దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, వివిధ రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి అధ్యయనం చేసింది. ఈడబ్ల్యూఎస్‌కు రిజర్వేషన్లు కల్పించవచ్చునని కమిషన్ ప్రతిపాదన చేసింది. అందుకు అనుగుణంగానే చట్టాన్ని తీసుకొస్తున్నాం.

ఇంతకీ కమిషన్ ఏం చెప్పింది?

రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పర్యటనలు జరిపాం. వారితో అన్ని విషయాల్నీ పంచుకున్నాం. ఒక్క రాజస్థాన్ తప్ప, మిగిలిన రాష్ట్రాలన్నీ 'ఈడబ్ల్యూఎస్'కు రిజర్వేషన్లు కల్పించటంపై స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. జనరల్ కేటగిరిలోకి వచ్చే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంక్షేమ చర్యలు చేపట్టవచ్చు అన్నదానిపై మాత్రం ఏకాభిప్రాయం వచ్చింది. సంక్షేమ చర్యలు అందే వరకూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు రూ.10వేల కోట్లతో ప్రత్యేక రిలీఫ్ ప్యాకేజ్‌ను ప్రకటించాలని కమిషన్ ప్రతిపాదన చేసింది.

డాక్టర్ సదువుల దౌడ్

(మొదటిపేజీ తరువాయి)

సీట్ల సంఖ్య మాత్రం పెరగకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. దీంతో దేశంలో అభ్యర్థులు ప్రత్యామ్నాయాలవైపు చూస్తున్నారు. విదేశాల్లో వైద్యవిద్య తక్కువ వ్యయంతో పూర్తి చేసే అవకాశం ఉండటం, భారీగా భారతీయ విద్యార్థులు చేరుతున్నందున సహ విద్యార్థులకు నమ్మకం, విశ్వాసం పెరగడం, అక్కడి యూనివర్సిటీలు సైతం మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు భారతీయ ఆహారం లభించేలా ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేయడం, రవాణా సదుపాయాలు కల్పించడం, విదేశాల్లో వారిని రిసీవ్ చేసుకుని గమ్యానికి చేర్చేలా సహచరులను ఏర్పాటు చేయడం వంటి చర్యలతో విదేశాల్లో వైద్యవిద్య పట్ల ఆకర్షితులవుతున్నారు. గతేడాది నీట్‌కు మన రాష్ట్రం నుంచి 46,245 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే, 30,912 మంది క్వాలిఫై అయ్యారు.

విదేశాల్లో చదివినా ఇక్కడ కష్టమే

విదేశీ వైద్యవిద్య అభ్యసించడం కోసం రాష్ట్రం నుంచి ఏటా 3 వేల మందికి పైగా అభ్యర్థులు వెళుతున్నారని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. విదేశీ విద్య నాణ్యమైందని భావిస్తూ ఏండ్ల తరబడి ఐదేండ్లు కష్టపడినా చివరికి మనదేశంలో డాక్టర్లు కాలేకపోతున్నారు. అక్కడ వైద్యవిద్య పూర్తి చేయడం ఒక ఎత్తైతే తిరిగొచ్చాక ఇక్కడ ఎంసీఐ నిర్వహించే నేషనల్ ఎగ్జిట్ టెస్ట్‌లో పాసవ్వడం మరో ఎత్తు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసినవాళ్లు మన దేశంలో వైద్యుడిగా గుర్తింపు పొందాలంటే ఈ పరీక్షలో పాసవ్వాల్సిందే. అప్పుడే వారిని వైద్యులుగా ఎంసీఐ గుర్తిస్తుంది. డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసుకునేందుకు అనుమతి లభిస్తుంది. అయితే, ఈ పరీక్ష నెగ్గుతున్న అభ్యర్థులు 40 శాతానికి మించడంలేదని అధికారులు చెబుతున్నారు. మిగిలిన 60 శాతం మంది గుర్తింపు లేకుండానే మిగిలిపోతున్నారని పేర్కొంటున్నారు. ఆ 40 శాతం మంది కూడా నాలుగైదేండ్లపాటు కష్టపడితేగానీ ఉత్తీర్ణులు కావడంలేదు. విదేశీ వైద్య కళాశాలల్లో నాణ్యతా ప్రమాణాలు లేకపోవడంతో 70 శాతం విద్యార్థులు ఎగ్జిట్ పరీక్షలో ఫెయిల్ అవుతున్నారు. విదేశాల్లో చదివి వచ్చిన తర్వాత, ఈ పరీక్షలో పాసయ్యేందుకు కొంతమంది ఢిల్లీ వెళ్లి మరీ కోచింగ్‌లు తీసుకుంటున్నారు. ఇలా రెండు మూడేండ్లు కోచింగ్‌లు తీసుకుంటున్నవాళ్లు ఉన్నారంటే అతిశయోక్తికాదు. దాంతో, ఒక్క ఎంబీబీఎస్ పూర్తి చేసి, వైద్యుడిగా గుర్తింపు పొందడానికే 8-9 ఏండ్లు పడుతున్నదని అభ్యర్తులు వాపోతున్నారు. కొంతమంది అప్పటికి కూడా ఎగ్జిట్ టెస్ట్ పాస్ కాలేక వదిలేస్తున్నారు. విదేశీ వైద్యవిద్య అంత నాణ్యంగా ఉండకపోవడమే ఈ పరిస్థితికి కారణమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 'మన పిల్లలకు అక్కడి స్థానిక భాష సమస్యగా మారుతున్నది. అక్కడ స్థానిక భాషలో చదువు చెబుతారు. వైద్య కళాశాలకు పెద్దగా గుర్తింపు ఉండదు. వారికక్కడ సీట్లు నిండకే కన్సల్టెన్సీల ద్వారా విదేశీ విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తారు. నాణ్యతా ప్రమాణాలుంటే అక్కడి విద్యార్థులతోనే అవి నిండిపోతాయి కదా! ఇక్కడ నీట్‌లోనే ర్యాంకు సాధించలేని విద్యార్థి ఇక ఎగ్జిట్ ఎగ్జామ్ ఎలా పాసవుతాడు!? ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి. లేకపోతే, ఆర్థికంగా నష్టపోతారు.' అని చెబుతున్నారు. 'విదేశాల్లో చదివేందుకు ఇప్పటికే రూ.40-50 లక్షలు ఖర్చు పెడుతున్నారు. మళ్లీ కోచింగ్‌కు 4-5 లక్షలు ఖర్చు చేస్తున్నారు. అయినా, అభ్యర్థులకు పాస్ అవుతామనే నమ్మకం ఉండటంలేదు' అని ఓ సీనియర్ డాక్టర్ 'నవతెలంగాణ'కు చెప్పడం విశేషం. కాగా, ఏటా జూన్, డిసెంబరు నెలల్లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) రెండుసార్లు ఎగ్జిట్ ఎగ్జామ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

అక్కడ ఇక్కడ చాలా తేడా : వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి

మన దేశంలో వైద్యవిద్యకు విదేశాల్లో ఉన్న దానికి చాలా తేడా ఉంది. ఇక్కడ నాణ్యత ప్రమాణాలు ఎక్కువ. అధ్యాపకులకు కొదవ లేదు. కట్టుదిట్టమైన నిబంధనలు ఉంటాయి. సీటు కోసం అభ్యర్థి ఎంతో కష్టపడాలి. అది సాధించలేకనే విదేశాలకు వెళుతున్నారు. మెరిట్‌తో సంబంధం లేకుండా అక్కడ అభ్యర్థికి సీటు కేటాయిస్తారు. ఇక్కడ ఒక్కో మెడికల్ కాలేజీలో 300 మంది ఫ్యాకల్టీ ఉంటారు.

అక్కడ 100కు మించరు. స్థానిక భాషలోనే వైద్యవిద్య బోధిస్తారు. చదువు సరిగ్గా లేకున్నా ఈజీగా పాసవుతారు. అందుకే మనదేశంలో ఎగ్జిట్ పరీక్షను కఠినంగా నిర్వహిస్తారు. విదేశాలకు వెళ్లే ముందు అక్కడి వైద్య కాలేజీ పరిస్థితి, ఫ్యాకల్టీ, గతంలో అక్కడి నుంచి అభ్యర్థులు ఎగ్జిట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారా? తదితర విషయాలు తెలుసుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించాలి.

రక్షణ రంగ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

- రాష్ట్రవ్యాప్తంగా నేడు, రేపు ర్యాలీలు, మానవహారాలు, సదస్సులు
- కనీస వేతన జీవోలను విడుదల చేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రక్షణ రంగంలోని ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ మద్దతు ప్రకటించింది. గురు, శుక్ర వారాల్లో రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావ ర్యాలీలు, మానవహారాలు, సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. యాజమాన్యాల ప్రయోజనాలే కాకుండా కార్మికుల సంక్షేమం పట్ల దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ..రాష్ట్రంలో డ్రాఫ్టు నోటిఫికేషన్స్ ఇచ్చి ఫైనల్ దశకు నోచుకుని 52 జీవోలను వెంటనే మార్చాలని, కనీస వేతనం రూ.18వేలను అమలుచేయాలని, కరువుభత్యం పెరిగే ప్రతి పాయింటుకు కనీసం రూ.14కు తగ్గకుండా చూడాలని కోరారు. జీఓ నెంబర్ 54 స్థానంలో వచ్చిన జీవో నెంబర్ 4ను అమలు చేయకుండా యాజమాన్యాలు కోర్టుకు వెళ్లాయని, దీనిపై ఇటీవల స్టే ఎత్తివేశారని తెలిపారు. ఈ ఒక్క జీవోవల్లనే రాష్ట్రంలో కార్మికులు 20 వేల కోట్ల రూపాయలను నష్టపోయారన్నారు. తక్షణమే జీఓ నెంబర్ 4ను అమలు చేయాలని, కార్మికులకు పాత ఏరియల్స్‌తో సహా చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన సార్వత్రిక సమ్మెను తెలంగాణలో విజయవంతం చేసిన ఉద్యోగులకు, కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. సుధాభాస్కర్, పి.రాజారావు, ఎస్.రమ, టి.వీరారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశం, పి.జయలక్ష్మి, జె.మల్లికార్జున్, భూపాల్, ఆర్.కోటంరాజు, బి.మధు, ఎం.నర్సింహారావు, ఎం.పద్మశ్రీ, వీఎస్.రావు, ఎ.ముత్యంరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రక్షణ శాఖ..

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్లతో కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐడీఈఎఫ్), ఆలిండియన్ నేషనల్ డిఫెన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్), భారతీయ ప్రతిరక్ష మజ్దూర్ సంఘ్ (బీపీఎంఎస్) ఆధ్వర్యంలో కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా దేశంలోని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సంస్థలు ఒక్కొక్కటిగా ప్రయివేటు పరం అవుతున్నాయి. ఈ క్రమంలోనే దేశ రక్షణ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తూ సైనికులకు ఆయుధాలు సరఫరా చేసే ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను కూడా కార్పొరేట్లకు అప్పగించడానికి మోడీ సర్కారు కుట్రలు పన్నుతున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది తమిళనాడు, యూపీలోని కాన్పూర్‌లలో ఉన్న ఆర్మీ బేస్డ్ కర్మాగారాలను మూసివేయడానికి ప్రయత్నిస్తోంది. దీనిని నిరసిస్తూ కార్మికులు కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నా బీజేపీ సర్కారు పట్టించుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన సమ్మెలో భాగంగా పాల్గొన్న ఏఐడీఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఎస్ ఎన్ పాఠక్ మాట్లాడుతూ.. భారత రక్షణ రంగంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అలాంటి వాటిని ప్రయివేటు పరం చేయడాన్ని మానుకోవాలని హితవు పలికారు.



ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్ జాతీయ అధ్యక్షుడు అరుణ్ దూబే మాట్లాడుతూ.. ఇదే విషయమై మోడీ సర్కారుకు గతంలో పలుమార్లు వినతి పత్రాలు అందించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మోడీ సర్కారు తీరు ఆక్షేపనీయం : ఏఐడీఈఎఫ్ జాయింట్ సెక్రెటరీ జీ.టీ.గోపాల్‌రావు

రక్షణ రంగాన్ని ప్రయివేటుపరం చేసి, విధ్వంసం చేసే చర్యలకు పూనుకున్న మోడీ సర్కారు తీరును నిరసిస్తూ దేశవ్యాప్తంగా మూడు రోజుల సమ్మెలో భాగంగా తెలంగాణలో సమ్మె తొలిరోజు జయప్రదమైందని ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏఐడీఈఎఫ్) జాయింట్ సెక్రెటరీ జీటీ గోపాల్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్షణ రంగంలోని ఏఐడీఇఎఫ్, బీపీఎంఎస్, ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్ సంఘాల ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొన్నారని పేర్కొన్నారు. రక్షణ రంగంలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడాన్ని నిరసిస్తూ తెలంగాణలోని రక్షణ శాఖ పరిధిలోని డీఆర్‌డీఏ, డీఆర్‌డీఎల్, డీఎమ్‌ఆర్‌ఎల్, డీఎల్‌ఆర్‌ఎల్, ఆర్‌సీఐ, ఎమ్‌ఈఎస్, సంగారెడ్డిలోని ఆర్డినెన్స్ కంపెనీలో సమ్మె100 శాతం విజయవంతమైందని తెలిపారు.

మొత్తంగా రక్షణ రంగంలో పలు విభాగాల్లో పనిచేస్తున్న 2 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు, నాలుగు వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు.

యాసంగి లక్ష్యం నెరవేరేనా..?

(మొదటిపేజీ తరువాయి)

నిల్వ ఉన్న నీటిని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు తాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలని కృష్ణా బోర్డు సూచించింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.45 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 183.56 టీఎంసీలుగా ఉన్నది. ఈ నీటిలో భవిష్యత్ అవసరాల కోసం కేటాయించిన 100 టీఎంసీల క్యారీ ఓవర్ స్టోరేజీ మినహాయిస్తే మిగిలిన 83 టీఎంసీల నీటిని రెండు రాష్ట్రాలు వినియోగించుకోవాల్సి ఉన్నది. నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని 4 లక్షల ఎకరాలకు సాగర్ ద్వారా సాగునీరందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

కృష్ణా బేసిన్‌లోని జూరాల, గోదావరి బేసిన్‌లోని సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టుల కింద రాష్ట్ర ప్రభుత్వం క్రాప్‌హాలిడేను ప్రకటించింది. శ్రీరామ్‌సాగర్ కింద 9 లక్షల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా ప్రస్తుత నీటి నిల్వను దృష్టిలో పెట్టుకుని 5.4 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరందించాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. ఎస్సారెస్పీ లో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 90.31 టీఎంసీలు కాగా ప్రస్తుతం 31 టీఎంసీలకు నీటి నిల్వ పడిపోయింది. ఈ ప్రాజెక్టులో గత సంవత్సరం ఇదే రోజున 36.95 టీఎంసీల నీరు నిల్వ ఉండటం విశేషం. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 17.80 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 0.91 టీఎంసీలుగా మాత్రమే ఉన్నది. సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ కేవలం 1.87 టీఎంసీలుగా ఉన్నది. రాష్ట్రంలో యాసంగి పంటలకు పూర్తి స్థాయిలో ప్రాజెక్టుల నీరు అందక పోతే ఆ ప్రభావం భూగర్భ జలాలపై పడే అవకాశం ఉన్నదని అధికారులంటున్నారు. రాష్ట్రంలో భూగర్భ జలాలు గత సంవత్సరం కన్నా సగటున రెండు మీటర్లు తగ్గిపోయాయి.

పంటల లక్ష్యం...

రాష్ట్రంలో ప్రస్తుత యాసంగిలో 13,37,996 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు పండిస్తారని వ్యవసాయ శాఖ భావిస్తున్నది. దీనిలో ఇప్పటి వరకూ 7,06,530 హెక్టార్లలో ఇప్పటికే పంటలు వేశారు. రాష్ట్రంలో ప్రధాన ఆహార పంటగా ఉన్న వరిని ప్రస్తుత యాసంగిలో 7,05,091 హెక్టార్లలో పండిస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేయగా ఇప్పటి వరకూ 3,02,385 (43 శాతం) హెక్టార్లలో వరి పంట వేసినట్టు ఆ శాఖకు అందిన వివరాలు వెల్లడిస్తున్నాయి. పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు కలిపి మొత్తం ఆహార పంటల లక్ష్యం 10,44,794 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటికి 5,42,540 (52 శాతం) హెక్టార్లలో పంటలు వేసినట్టు తెలుస్తున్నది.

ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వ పరిస్థితి (టీఎంసీల్లో)..

రిజర్వాయర్	నీటి నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నీటి నీటి నిల్వ	గత సంవత్సరం ఇదే రోజు పరిస్థితి
జూరాల	9.65	3.65	6.1
శ్రీశైలం	215.80	55.67	120.08
నాగార్జునసాగర్	312.04	183.56	171.48
శ్రీరామ్‌సాగర్	90.31	31.00	36.95
నిజాంసాగర్	17.80	0.91	12.42
సింగూరు	29.91	1.87	13.61

రాష్ట్రంలో యాసంగిలో ప్రధాన పంటల పరిస్థితి (హెక్టార్లలో)

పంట	లక్ష్యం	ఇప్పటి వరకూ వేసినది
వరి	7,05,091	3,02,385
మక్క	1,65,956	96,841
జొన్న	33,426	15,297
పప్పులు	1,24,594	1,24,594
నూనెగింజలు	1,78,795	1,11,647

ఒకరి ప్రాణాలకు మరొకరు..

(మొదటిపేజీ తరువాయి)

డ్రైవర్‌కు అదే బస్సులో ఉన్న సింగరేణి డాక్టర్ డ్రైవర్‌కు ప్రథమ చికిత్స చేశారు. తర్వాత ప్రయాణికులంతా కలిసి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ ఇటుక బట్టీల వద్ద బుధవారం జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం..

గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌కు వెళ్తోంది. బస్సులో 52 మంది ప్రయాణికులున్నారు. కమాన్‌పూర్‌కు చేరుకోగానే బస్సు డ్రైవర్ మహేందర్‌కు గుండెలో నొప్పి వచ్చింది. దాంతో బస్సును మెల్లగా రోడ్డు పక్కకు ఆపాడు. ఆ సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న సింగరేణి ఆస్పత్రి డాక్టర్ చంద్రశేఖర్‌రావు, మరో డ్రైవర్ తిరుపతి వెంటనే చొరవ తీసుకున్నారు. డ్రైవర్‌కు బస్సులో డాక్టర్ ప్రథమ చికిత్స అందజేస్తూ పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ బదులుగా నెబులైజర్ పెట్టారు. ఈసీజీ తీయమంటే టెక్నీషియన్ లేడని చెప్పారు. దాంతో వైద్యుల నిర్లక్ష్యంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డ్రైవర్‌ను అంబులెన్స్‌లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. బస్సులో సింగరేణి డాక్టర్ లేకుంటే డ్రైవర్ బతికేవాడు కాదని ప్రయాణికులు అన్నారు. అతనూ నొప్పిని బిగబట్టి కూడా బస్సును పక్కకు ఆపడం వల్లే పెద్ద ప్రమాదం తప్పిందనీ సంతోషం వ్యక్తం చేశారు.

ఆగని పెట్రో కుమ్ముడు

(మొదటిపేజీ తరువాయి)

బాటలో పయనించాయి. గతేడాది ముగిసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ ఇంధన ధరలను తగ్గించిన మోడీ సర్కారు.. ఆ ఎన్నికలలో దారుణ ఓటమి పాలైన తరువాత నుంచి వాటి ధరలను మళ్లీ పెంచుతోంది. బుధవారం పెరిగిన ధరలతో కలిపి దేశవ్యాప్తంగా ఇప్పటికే లీటరు పెట్రోల్ రూ.2.79, డీజిల్ రూ.3.53 పెరగడం ప్రస్తావనార్హం. డీజిల్‌పై ఇరవై రోజుల వ్యవధిలోనే మూడున్నర రూపాయల వరకు పెరగడం ఆందోళనకు గురిచేస్తోంది. డీజిల్ పెరుగుదల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు కొండెక్కుతున్నాయి. ఇప్పటికే పెట్రో ఉత్పత్తుల ధరల పెంపుతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే నిత్యావసర సరుకుల ధరలు కూడా పెరగడం వారిని మరింత కలవరానికి గురిచేస్తోంది. అయినా మోడీ సర్కారు మాత్రం దీనిని పరిగణనలోకి తీసుకోకుండా జనంపై పెట్రో భారం మోపుతూనే ఉన్నది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలను సాకుగా చూపుతూ జనం వద్ద కోట్లు దండుకుంటూ కార్పొరేట్లకు దోచిపెడుతున్నది. కాగా, బుధవారం లీటరు పెట్రోల్‌పై రూ. 0.13, డీజిల్‌పై రూ. 0.20లు పెరిగింది. సవరించిన ధరలతో దేశ రాజధానిలో లీటరు పెట్రోల్ ధర రూ. 71.27 కాగా డీజిల్ రూ. 65.90 లకు చేరుకున్నది. ఇవే ధరలు హైదరాబాద్‌లో రూ. 75.61, రూ. 71.64గా నమోదయ్యాయి.

రాజకీయాల్లోకి ప్రియాంక

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి ప్రియాంక గాంధీ వాద్రా రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధమయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ)లో ఆమెను ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్టు పార్టీ ప్రకటించింది. దీంతోపాటు ఆమెకు ఉత్తరప్రదేశ్(తూర్పు)కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఫిబ్రవరి మొదటివారంలో ఆమె ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు తన తల్లి సోనియాగాంధీ, సోదరుడు రాహుల్‌ల నియోజకవర్గాలైన రాయ్‌బరేలీ, అమేథీలో వారి తరఫున ప్రచారాలలో పాల్గొన్న ప్రియాంక ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. కాగా, ప్రియాంక గాంధీని రంగంలోకి దింపుతున్నట్టు కాంగ్రెస్ ప్రకటించడంతో ఈ ఎన్నిక మరింత ప్రాధాన్యం సంతరించుకోనున్నది.

యూపీ అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలు కలిగి ఉండటంతో పాటు కేంద్రంలో అధికారం చేపట్టడంలో ఈ రాష్ట్రం కీలకంగా ఉన్నది. ప్రియాంకకు తూర్పు యూపీ విభాగానికి ఇన్‌చార్జిగా నియమించడంతో కాంగ్రెస్ విజయాన్ని సాధించేందుకు సన్నద్ధమౌతున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. అలాగే వచ్చే ఎన్నికలలో ప్రధాని మోడీతో పాటు పాలక బీజేపీని తీవ్రంగా దెబ్బతీసేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. యూపీ పశ్చిమ విభాగానికి జ్యోతిరాజ్ సింధియా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కెసి.వేణుగోపాల్‌ను, హర్యానా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా గులాం నబీ ఆజాద్‌ను నియమిస్తున్నట్టు అధిష్టానం ప్రకటించింది.

విద్యాశాఖ ఫలితాల తీరుపై విస్మయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వానికి సూచన చేసింది. ఎం.వి.ఫౌండేషన్ ప్రతినిధి ఆర్.వెంకటరెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ధర్మాసనం మంగళవారం విచారించింది. సర్కారీ స్కూళ్లతోపాటు ప్రభుత్వ సాయంతో నడిచే ఎయిడెడ్ బడుల్లో విద్యార్థుల కు ఉత్తమ విద్యాబోధన, మంచి ఫలితాల సాధన కోసం పర్యవేక్షణ, సలహాలు, సూచనలు చేసేందుకు శాశ్వత ప్రాతిపదికపై కమిటీని ఏర్పాటు చేయాలని ధర్మా సనాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది ఎన్.ఎస్.అర్జున్‌కుమార్ కోరారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యా ప్రమాణాల క్షీణతకు, ప్రయివేట్ విద్యాసంస్థలకు ఏమైనా సంబంధం ఉందా అనే అనుమానాన్ని ప్రధాన న్యాయమూర్తి వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టంకింద ప్రయివేటు విద్యాసంస్థలకు కూడా ఫీజారీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయడం సరైనదో, కాదో అనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఈకేసును ప్రతికూల కోణంలో చూడబోమని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా భావించరాదని, ప్రభుత్వ పాఠశాల్లో విద్యా ప్రమాణాలు, సత్ఫలితాల సాధన కోసం ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన ప్రతిపాదనలతో ప్రభుత్వం ముందుకు రావాలని ధర్మాసనం కోరింది. గత విద్యాసంవత్సరం వార్షిక నివేదిక (ఏఎస్ఈఆర్ 2018) ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు మరింత క్షీణించినట్టుగా వెల్లడైందని న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం నుంచి, ప్రయివేటు ఏజెన్సీలు చాలా ప్రయత్నాలు చేస్తున్నట్టుగా చర్యలు ఉన్నాయని, అయితే ఫలితాల దగ్గరకు వచ్చేసరికి ప్రమాణాలు మాత్రం ఆశించిన స్థాయిలో పెరగకపోగా తగ్గుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 16వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, విద్యావంతులతో కమిటీని ఏర్పాటు చేసి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నించాలని కోరారు. విచారణ 25కి వాయిదా పడింది.

ఐదుగురు సబ్ రిజిస్ట్రార్ల సస్పెన్షన్

- ఆదిలాబాద్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఐజీ, డీఐజీ తనిఖీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న 5గురు సబ్‌రిజిస్ట్రార్‌లను ఉన్నతాధికారులు బుధవారం సస్పెండ్ చేశారు. 2014 నుంచి 2018 వరకు రిజిస్ట్రార్ కార్యాలయంలోని స్టాంపుల కౌంటర్‌లో చోటుచేసుకున్న అవకతవకలపై ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లుగా వ్యవహరించిన చంద్రశేఖర్, అరుణ్‌కుమార్, ఇమ్రాన్‌ఖాన్, సాయినాథ్, మనోహర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. పర్యవేక్షణ లోపం ఉందంటూ జిల్లా రిజిస్ట్రార్ జైవంత్‌రావును ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ఐజీ వెంకట్ రాజేశ్, డీఐజీ ట్వింకిల్‌జాన్ బృందం గోప్యంగా తనిఖీలు నిర్వహించడంతో కార్యాలయంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విచారణ కొనసాగడంతో ఏం జరుగుతుందో తెలియక సిబ్బంది హైరానా పడ్డారు. నాలుగేండ్లలో రూ.80లక్షల అవినీతి జరిగినట్టు కేసులు నమోదు కావడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్ జైవంత్‌రావు స్థానంలో హైదరాబాద్‌కు చెందిన రవీందర్‌రావును ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డీఆర్‌ఓగా నియమించారు.


సింగరేణి సేవా సమితి స్టాల్‌ను సందర్శించిన రజత్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైద్రాబాద్ ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్‌లో సింగరేణి సేవా సమితి ఏర్పాటు చేసిన స్టాల్ రాష్ట్ర ఎన్నికల అధికారి రజత్‌కుమార్ బుధవారం సందర్శించారు. యువతకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణి సంస్థను ఆయన అభినందించారు. ఇటువంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. స్టాల్లో అమ్మకానికి ఉంచిన వస్తువులను స్వయంగా పరిశీలించి వాటిని తయారు చేసిన మహిళలను అభినందించారు. నిరుద్యోగ యువతకు సింగరేణి తరహాలో ఇతర ప్రభుత్వ సంస్థలు కూడా చేయూతనిస్తే ఎంతో బాగుంటుందని అభిప్రాయపడ్డారు. స్టాల్ కో-ఆర్డినేటర్ శివకుమార్ సింగరేణి సేవా సమితి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిపై ఇస్తున్న శిక్షణ గురించి వివరించారు. ఇదే విధంగా పోలీస్, ఆర్మీ ఉద్యోగాల నియామకాలు జరిగే సందర్భంలో వారికి తగిన శిక్షణను ఇప్పించడం, ఆర్.టి.సి. వారి శిక్షణా సంస్థలో హెవీ డ్రైవింగ్ నేర్పించడం వంటి ఉపాధి కల్పనా కార్యక్రమాలు చేపడుతున్నట్టు రజత్‌కుమార్‌కు చెప్పారు.

సెన్సెక్స్ ▼336	నిఫ్టీ ▼91	డాలరుకు రూపాయి విలువ	బంగారం (10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు (వందకి)			
36,108	10,831	71.44	రూ. 32,087	రూ.38,969	హైదరాబాద్	418	విజయవాడ	423
					ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
					వరంగల్	420	ముంబయి	473






ఆర్థిక శాఖ బాధ్యతలు పీయూష్‌కు



న్యూఢిల్లీ: ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ బాధ్యతలను రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌కు మోడీ సర్కారు అప్పగించింది. అనారోగ్యంతో అమెరికాలో చికిత్స పొందుతున్న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 1న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సంగతి తెలిసిందే. లోక్‌సభలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కేవలం పది రోజుల సమయమే ఉంది. 'అరుణ్ జైట్లీ రాలేని పరిస్థితుల్లో ఉండటంతో ప్రధానమంత్రి సూచనల మేరకు ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల బాధ్యతలను రాష్ట్రపతి తాత్కాలికంగా పీయూష్ గోయెల్‌కు అప్పగించారు' అని రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం వైద్య పరీక్షల కోసం అరుణ్ జైట్లీ అమెరికా వెళ్లారు. అక్కడనుంచి ఆయన బడ్జెట్ ప్రవేశపెడతారని భావించారు.

మార్కెట్లోకి సరికొత్త వ్యాగన్ ఆర్



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ బుధవారం దేశీయ మార్కెట్లోకి మూడో తరం వేగనార్‌ను విడుదల చేసింది. 2019 ఎడిషన్‌గా ముందుకు వచ్చిన ఈ వాహన ధరను కంపెనీ రూ.4.19-5.19 లక్షలుగా (ఢిల్లీ ఎక్స్ షోరూం) నిర్ణయించింది. ఆరు రంగుల్లో ఈ కారు లభ్యమవుతుంది. ఇది వరకు 1.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో విక్రయించగా.. ప్రస్తుతం దీనిని అప్‌గ్రేడ్ చేస్తూ 1.2 లీటర్ ఇంజిన్‌తో మార్కెట్లోకి తీసుకు వచ్చారు. కొత్త వేగనార్ లీటర్ ఇంధనానికి 21.5 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని ఆ కంపెనీ పేర్కొంది. కొన్ని వేరియంట్లకు ఏజీఎస్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ కూడా అమర్చినట్టుగా కంపెనీ తెలిపింది. అలాగే డ్రైవర్ వైపు ఎయిర్‌బ్యాగ్, ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్(ఈబీడీ) తోపాటు యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్, సీటు బెల్టు గుర్తుచేసే విధానం, వేగాన్ని హెచ్చరించే విధానం, ప్రత్యేకమైన పార్కింగ్ సెన్సార్లు కొత్త వేగనార్‌లో ఉన్నాయి. ఏడాది కాలంలో వేగనార్‌లో 22 లక్షల యూనిట్లను విక్రయించామని ఎంఎస్ఐఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో), ఎండీ కెనిచి ఆయుకవ పేర్కొన్నారు.ఈ కొత్త కారు కోసం తాము, తమ భాగస్వాములు కలిసి రూ.670 కోట్ల పెట్టుబడి పెట్టామన్నారు.

హారియర్ ను ఆవిష్కరించిన టాటా



ముంబయి: టాటామోటార్స్ హారియర్ పేరుతో మార్కెట్లోకి సరికొత్త స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాన్ని (ఎస్‌యూవీని) మార్కెట్లోకి తీసుకువచ్చింది. సంస్థ ప్రతిష్టాత్మకమైన ల్యాండ్‌రోవర్ ఒమెగా ఆర్క్ ప్లాట్‌ఫామ్‌పై నిర్మించిన ఈ కారును టాటా మోటార్స్ ఎండి గుంటెర్ బుట్చెక్, టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్‌లు బుధవారం మార్కెట్లోకి ఆవిష్కరించారు. ప్రస్తుత (2018-19) ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మార్కెట్లోకి విడుదల చేసిన నాలుగో కారు హారియర్ కావడం విశేషం. నాలుగు సిలిండర్ల 2.0 లీటర్ టర్బో ఛార్జ్‌డ్ డీజిల్ ఇంజిన్‌తో దీన్ని సంస్థ అందుబాటులోకి తెచ్చింది.. ఈ ఇంజిన్ 350 ఎన్ఎం టార్క్‌ను 138 బీహెచ్‌పీ శక్తిని విడుదల చేస్తుంది. ఇందులో 6 స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌ను టాటా అమర్చింది. ఇందులో మొత్తం ఈకో, సిటీ, స్పోర్ట్స్ అనే డ్రైవింగ్ మోడ్‌లను అమర్చారు. ఇది ఎక్స్ఇ, ఎక్స్ఎం, ఎక్స్‌టి, ఎక్స్‌జెడ్ అనే నాలుగు వేరియంట్లలో లభిస్తుందని కంపెనీ తెలిపింది. ముంబయి ఎక్స్‌షోరూం వద్ద ఈ కొత్త ఎస్‌యూవీ ధరను కంపెనీ రూ.12.69 లక్షల నుంచి రూ.16.25లక్షలుగా నిర్ణయించింది. ఇప్పటికే ఎస్‌యూవీ మార్కెట్లో దూసుకుపోతున్న మహీంద్రా, టయోటాలకు గట్టి పోటీని ఇచ్చేందుకు టాటా దీనిని మార్కెట్లోకి దించింది.

ఇంటి వంటల విక్రయానికి ప్రత్యేక యాప్

నవతెలంగాణ-వాణిజ్య విభాగం: ఇంట్లో తయారు చేసిన కమ్మని రుచికరమైన వంటలను వ్యాపార విపణిలోకి అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన వేదికను కల్పిస్తూ ఫుడీబడ్డీ యాప్ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్ ద్వారా సంప్రదాయ, సౌకర్యవంతమైన, విశ్వసనీయమైన కమ్మని ఇంటి వంటలను అందించే తమ యాప్ ఒక వేదికగా అందుబాటులో ఉండనుందని ఫుడీబడ్డీ సంస్థ సంస్థ సహ వ్యవస్థాపకుడు అఖిల్ సెంథూరామన్ తెలిపారు. ఫుడీబడ్డీ కమ్మని భోజనాన్ని తయారు చేసే తపన కలిగిన హోం చెఫ్‌లను వారి సమీప ప్రాంతంలో నివసించే వారిని తమ ప్లాట్‌ఫాం కంపెనీ యాప్ ద్వారా ఒక్కతాటిపైకి తీసుకు వస్తుందని అన్నారు.

వ్యక్తిగత సహాయతకు 'విజ్జీ' యాప్



హైదరాబాద్: నిత్యం పని ఒత్తిడితో వివిధ రోజువారీ వ్యక్తిగత కార్యకలాపాలను నిర్వహించ లేకపోతున్న వారికి సహాయ పడేందుకు గాను మార్కెట్లోకి 'విజ్జీ' పేరుతో సరి కొత్త యాప్ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక టెక్నాలజీ వేదికగా గృహ, చిన్న వ్యాపారులు, వినియోగదారులకు అవసరమైన వస్తువులు, సేవల డెలివరీ అందిస్తూ వ్యక్తిగత సహాయకుడిగా ఉపయోగపడేలా ఈ యాప్‌ను విజ్జీ లాజిస్టిక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా ఇంటివద్ద మరచి వచ్చిన చిన్నచిన్న వస్తువులను, ఔషధాలను, పచారి సామగ్రి, కూరగాయలను ఇంటికి డెలివరీ చేయనున్నారు. దీనికి తోడు ఏదైన ఒక వస్తువులను పికప్ చేసుకొని, డ్రాప్ చేయడం, వివిధ వస్తువులను కొనుగోలు చేసి ఇంటికి చేర్చడం వంటి సేవలను అందించనున్నట్టుగా సంస్థ ప్రమోటర్ రవి గొల్లపూడి తెలిపారు.

పడిపోనున్న పారిశ్రామికోత్పత్తి!

- త్వరలో డిమాండ్‌లోనూ తీవ్ర స్తబ్దత
- వచ్చేది జనరంజక బడ్జెటే కావొచ్చు: డీ అండ్ బీ తాజా అంచనా



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక అంశాలలో బలహీనత, లోకసభకు సాధారణ ఎన్నికలు, వ్యాపారాల్లో అనిశ్చితి, తదితర అంశాల కారణంగా పారిశ్రామికోత్పత్తి తీవ్రంగా ప్రభావితం కానుందని ప్రముఖ ఆర్థిక అంశాల విశ్లేషణ సంస్థ డూన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ (డీఅండ్‌బీ) తాజాగా ఒక నివేదికలో విశ్లేషించింది. నిర్దేశించుకున్న లక్ష్యానికి కంటే పన్ను వసూళ్లలో తగ్గుదల చోటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ పెట్టుబడులు పడిపోనున్నాయని, దీంతో పారిశ్రామిక ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడనుందని డీఅండ్‌బీ తెలిపింది. ఫలితంగా దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి కార్యకలాపాలు మళ్లీ స్తబ్దతలోకి నెట్టబడుతున్నాయని రిపోర్టులో వెల్లడించింది. అతి స్వల్ప కాలంలోనే దేశీయ డిమాండ్ కూడా తీవ్ర స్తబ్దతలో పడనుందని విశ్లేషించింది. 2018 డిసెంబర్ మాసానికి సంబంధించి పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి 1.5-2 శాతానికి పడిపోనుందని అంచనా వేసింది. ఇంతక్రితం నవంబర్‌లో ఐఐపీ 0.5 శాతానికి పరిమితమై 17 మాసాల కనిష్ట స్థాయికి పతనమైనట్లు గత వారం కేంద్ర గణంకాల శాఖ వెల్లడించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా తయారీ రంగంలోని కన్స్యూమర్, కాపిటల్ గూడ్స్ రంగాలు డిమాండ్ లేక తీవ్ర ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. 2017 నవంబర్‌లో ఐఐపీ ఏకంగా 8.5శాతం వృద్ధిని కనబర్చింది. అనుకోని సంఘటనలు, అననుకూల అంశాల వల్ల 2018-19లో ఆర్థిక వృద్ధి పడిపోనుందని డీఅండ్ బీ లీడ్ ఎకనామిస్టు అరుణ్ సింగ్ విశ్లేషించారు. త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థకు కీలకం కానుందని పేర్కొన్నారు. ఎన్నికల ఏడాది కావడంతో జనరంజమైన బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. గ్రామీణ, ఎంఎస్ఎంఇ రంగాలు, ఉపాధి కల్పనపై దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. కార్మికులు, భూ చట్టాలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా వ్యవస్థకు మద్దతు లభించే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం, చమురు ధరలు పెరగడం వల్ల వాణిజ్య లోటు పెరుగుతుందని డిఅండ్‌బి ఆందోళన వ్యక్తం చేసింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్వల్ప కాలంలో దేశీయ కరెన్సీ ఒత్తిడికి గురి కావచ్చని పేర్కొంది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లను యథాతథంగా కొన సాగిస్తే.. రూపాయికి మద్దతు లభించవచ్చని తెలిపింది. ప్రస్తుత ఏడాది జనవరిలో అమెరికా డాలర్‌తో రూపాయి విలువ 70.6-70.8 మధ్య కొనసాగే అవకాశం ఉందని అంచనా వేసింది.

లక్ష కోట్లు ఆవిరి



ముంబయి: అంతర్జాతీయ ప్రతికూలతకు తోడు దేశీయంగా కొన్ని బ్లూచిప్ కంపెనీల ఫలితాలు నిరుత్సాహంగా నమోదు కావడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజైన బుధవారం కూడా నష్టాల్లోనే నిలిచాయి. క్రితం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఐటిసి లిమిటెడ్ ఫలితాలు మదుపర్లను నిరుత్సాహపర్చాయి. దీనికి తోడు అంతర్జాతీయ ఆర్థికంపై వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో వెలువడుతున్న అంచనాలు కూడా మదుపరులను ఆందోళనకు గురి చేశాయిన దీంతో అమ్మకాల ఒత్తిడితో బుధవారం సెన్సెక్స్, నిఫ్టీలు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయంగా చైనాపై అమెరికా కుట్రపూరితంగా చేస్తున్న వాణిజ్య కట్టడి అంశాలు.. ప్రపంచ వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయనే విశ్లేషణలు అంతర్జాతీయ మార్కెట్లను ఒత్తిగికి గురి చేశాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఈ సెన్సెక్స్ 336 పాయింట్లు (0.92 శాతం) పతనమై 36,108కి దిగజారింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 91 పాయింట్లు (0.84 శాతం) కోల్పోయి 10,832 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.28 శాతం, 0.16 శాతం చొప్పున నష్టపోయాయి. వరుసగా రెండు రోజుల నష్టాల కారణంగా బీఎస్ఈలో మదుపరుల సంపద విలువ రూ.1.10 లక్షలు హరించుకుపోయింది. సోమ వారం బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల విలువ రూ.1,43,15,583.11 కోట్లుగా ఉండగా.. బుధవారం ముగింపు సమయానికి ఇది 1,42,04,842.87 కోట్లకు దిగజారింది. బుధవారం ఒక్క రోజే మదుపర్లు రూ.74,199 కోట్లు నష్టపోయారు. ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ ఐటీసీ లిమిటెడ్ 4.16 శాతం క్షీణించి 277.70 వద్ద ముగిసింది. దీంతో మార్కెట్లపై మరింత ఒత్తిడి చోటు చేసుకుంది.

పాఠశాల వెనుక బ్యాలెట్ పేపర్లు

- ఎన్నికల ఆఫీసర్‌పై కేసు
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల ఆందోళన



నవతెలంగాణ- చివ్వెంల

గ్రామ పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లు మాయమై పాఠశాల వెనుక లభ్యమయ్యాయి. దీంతో ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారిపై కేసు నమోదైంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో బుధవారం జరిగింది. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 21న చివ్వెంల మండలంలోని గుంజలూరులో ఎన్నికలు నిర్వహించారు. ఇక్కడ మొత్తం 1252 ఓట్లు పోలయ్యాయి. కానీ కౌంటింగ్‌లో 1013 ఓట్లు మాత్రమే తేలాయి. మిగిలిన బ్యాలెట్ పత్రాల జాడలేదు. వాటి సంగతి తేల్చకుండానే ఎన్నికల స్టేజ్ 2 ఆఫీసర్ వై.బుచ్చిరెడ్డి టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి విజయం సాధించినట్టు ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని చివ్వెంల జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో సంబంధిత అధికారులకు అప్పజెప్పారు. అయితే, ఒక బ్యాగు ఎక్కడో పోయిం దని చెప్పారు. దీంతో బుధవారం ఎంపీడీఓ శైలజ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో స్టేజ్ 2 ఆఫీసర్ బుచ్చిరెడ్డిపై ఫిర్యాదు చేశారు. పోలీస్ సిబ్బంది చివ్వెంల పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. స్కూల్ వెనకాల సర్పంచ్ అభ్యర్థి బ్యాలెట్ పేపర్లు చిందరవందరగా పడి ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులు సంబంధిత అధికారికి తెలిపారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజాకూటమి బలపర్చిన సర్పంచి అభ్యర్థి దారోజు శారద భర్త జానకి రాములు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కావాలనే అధికార పార్టీకి సంబంధించిన అభ్యర్థికి అధికారులు కొమ్ముకాశారని ఆరోపించారు.ఎన్నికల ఏజెంట్‌గా వ్యవహరించిన ఓ వ్యక్తి పోలింగ్‌కు ముందు రోజు అధికారులను ప్రలోభానికి గురిచేయడంతో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కోర్టుకెళ్లి రీకౌంటింగ్ చేయించుకుంటామనే ఉద్దేశంతో.. తెలివిగా ఆ బ్యాలెట్ పేపర్లు పోయాయని నాటకమాడారన్నారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు పెద్దమొత్తంలో స్టేషన్‌కు తరలివచ్చారు. అధికారిపై చర్య తీసుకో వాలని డిమాండ్ చేశారు. గుంజలూరు ఘటనలో ఎన్నికలకు స్టేజ్-2 ఆఫీసర్‌గా వ్యవహరించిన బుచ్చిరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు సీఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి విచారణ జరిపిస్తా మన్నారు.

28న ఇంటర్ నైతికత, మానవ విలువల పరీక్ష

- 31న పర్యావరణ విద్య పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 28న నైతికత, మానవ విలువలు రాతపరీక్షల జరగనుంది. ఈనెల 31 ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు హాజరుకావడం, ఉత్తీర్ణత పొందడం తప్పనిసరి అని తెలిపారు. ఒకవేళ ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాలేకపోతే ఇంటర్ మార్కుల మెమో జారీ కాబోదని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాన్ని పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు ఆన్‌లైన్‌లో పంపిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాన్ని కాలేజీ యాజమాన్యాలు డౌన్‌లోడ్ చేసుకొని ఈ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల హాల్‌టికెట్లను కాలేజీ లాగిన్, ఇంటర్ బోర్డు www.bie.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులు కాని విద్యార్థులు పాత హాల్‌టికెట్‌తో ఈ పరీక్షకు హాజరుకావొచ్చని సూచించారు.

హెచ్ఎండీఏలో సిబ్బంది కొరత

పెరిగిన పథకాలు.. తగ్గిన సిబ్బంది

- మూడు రెట్లు పెరిగిన అథారిటీ విస్తీర్ణం
- విశ్వనగర అభివృద్ధిలో కీలక పాత్ర
- వందల కోట్ల ప్రాజెక్టుల ప్రతిపాదనలు
- సీఎం చైర్మెన్‌గా ఉన్నా మారని పరిస్థితి

హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నగరానికి గుండెకాయలాంటిది. అలాంటి హెచ్ఎండీఏ నిర్లక్ష్యానికి గురవుతోంది. అమలు చేయాల్సిన పథకాలు పెరుగుతున్నాయి కానీ సిబ్బంది ఖాళీల భర్తీ జరగడం లేదు. సిబ్బంది కొరతతో ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. హెచ్ఎండీఏకు స్వయంగా సీఎం కేసీఆర్ చైర్మెన్‌గా వ్యవహరిస్తున్నా పరిస్థితి మారడం లేదు.



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) 2008లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ)గా అవతరించింది. హుడాగా ఉన్నప్పుడు విస్తీర్ణం సుమారు1400 చ.కి.మీలుగా ఉంది. హెచ్ఎండీఏగా మారిన తర్వాత 7,257 చ.కి.మీలకు విస్తరించింది. దీంతో అథారిటీ పరిధిలోకి మొత్తం ఏడు జిల్లాలు, 70 మండలాలు, 1032 గ్రామాలు, 12 మున్సిపాలిటీలు చేరాయి. ఇందులోనే 158 కి.మీ ఔటర్ రింగు రోడ్డు ఉంది. దాని చుట్టూ అనేక పథకాలు కార్యరూపంలోకి వస్తున్నాయి. మరిన్ని భారీ ప్రాజెక్టులకు కసరత్తు జరుగుతోంది. కానీ 2003లో అంటే హుడాగా ఉన్నప్పుడు ప్రభుత్వం జీవో 496 విడుదల చేస్తూ 600 పోస్టులు మంజూరు చేసింది. ప్రస్తుతం 200 శాశ్వత ఉద్యోగులు పని చేస్తున్నారు. అంటే 15 ఏండ్ల నుంచి ఉద్యోగ విరమణలు తప్ప.. రిక్రూట్‌మెంట్స్ లేవు. మరోవైపు అనేక పథకాలు ప్రతిపాదనలు చేయడం, వాటికి అనుమతులు తీసుకోవడం జరుగుతోంది. సిబ్బంది భర్తీపై మాత్రం ప్రభుత్వం నుంచి అనుమతులు పొందడంలో హెచ్ఎండీఏ విఫలమవుతోంది. అయితే సంస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అటు హెచ్ఎండీఏగానీ ఇటు ప్రభుత్వంగానీ ఆలోచించడం లేదు.

ప్రతిపాదనలో భారీ ప్రాజెక్టులు

ఒకే నగరం.. ఒకే ప్రణాళిక పేరుతో సమీకృత మాస్టర్ ప్లాన్-2041ను రూపొందించి రెండు నెలల్లో అందుబాటులోకి తేవాలని సంస్థ నిర్ణయించింది. ఔటర్ రింగు రోడ్డు చుట్టూ పచ్చదనం, సాగర్ ప్రక్షాళన, పార్కుల నిర్వహణ, చెరువులు, కుంటల సుందరీకరణ, సంరక్షణ, అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలను అరికట్టడం, లాజిస్టిక్ పార్కులు, ట్రక్,బస్సు టర్మినల్స్, నైట్ సఫారీ, గండిపేట్ డెవలప్‌మెంట్ అథారిటీ, బాలనగర్ ఫ్లైఓవర్ నిర్మాణం, ప్యారడైజ్ వద్ద భారీ ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాల్సిన ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే, పశ్చిమాన హైటెక్ సిటీ మాదిరిగా.. తూర్పు వైపున ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఉప్పల్ భగాయత్ పేరుతో ఇప్పటికే లేఅవుట్ అభివృద్ధి చేసి సక్సెస్ అయింది. ఆర్థికంగా కూడా లాభపడింది. ఇదే తరహాలో ప్రతాపసింగారంలో సుమారు 200 ఎకరాల్లో భారీ లేఅవుట్, మేడిపల్లి, బోడుప్పల్, దుండిగల్‌లోనూ భారీ లేఅవుట్లకు ప్రణాళికలు రచిస్తోంది.

ఇన్ని పథకాలు చేపట్టాలంటే సిబ్బంది అవసరం. కానీ ఖాళీలు భర్తీ చేయనిపక్షంలో ప్రతిపాదిత పథకాలు పట్టాలెక్కడం కష్టమేనని పలువురు పేర్కొంటున్నారు. హెచ్ఎండీఏకు సీఎం కేసీఆర్ చైర్మెన్‌గా వ్యవహరిస్తున్నారు. అయినా సిబ్బంది కొరతను పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి విభాగం కీలకమే..

హెచ్ఎండీఏలో ప్లానింగ్, ఇంజినీరింగ్‌తో పాటు అన్ని విభాగాలూ కీలకమే. దీనికితోడు హైదరాబాద్ విశ్వనగర అభివృద్ధిలో అథారిటీది ముఖ్య పాత్ర. అలాంటి సంస్థలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. అథారిటీకి గుండెకాయ లాంటి ప్లానింగ్ విభాగంలో 110 మంది ఉద్యోగులు పని చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 45 మంది మాత్రమే ఉన్నారు. ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్, కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగులను నియమించినా కీలక స్థానాలు భర్తీ చేయడం లేదు. ఇంజినీరింగ్ శాఖలో 110 పోస్టులకుగాను 54 ఖాళీగా ఉన్నాయి. అర్బన్ ఫారెస్ట్రీ విభాగంలో 37 మందికిగాను ప్రస్తుతం 20 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో తొమ్మిది పోస్టులకుగాను ఆరు ఖాళీ ఉన్నాయి. పరిపాలనా విభాగంలో 334 పోస్టులకుగాను 156 ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి విభాగాంలోనూ సగానికిపైగా పోస్టులు ఖాళీగా ఉన్న పరిస్థితి ఉంది.

మహిళలపై హిందూత్వ శక్తుల అరాచకం

- ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళలు రాజ్యాంగ హక్కులు వినియోగించుకోకుండా వారిని కుటుంబానికే పరిమితం చేసే విధంగా హిందూత్వ శక్తులు వ్యవహరిస్తున్నాయని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి విమర్శించారు. ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం 'స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా కలిసి గళమెత్తుదాం' అనే అంశంపై సదస్సు జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెఎన్.ఆశాలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మహిళను మార్కెట్లో సరుకుగానే చూస్తున్నారని, కేవలం కుటుంబ అవసరాల కోసం వాడుకుంటూ ఆమె శ్రమకు విలువనివ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన హక్కుల చట్టాన్ని కేరళ అమలు చేస్తున్నా హిందూత్వ శక్తులు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. నేషనల్ క్రైం రిపోర్టు ప్రకారం దేశంలో ప్రతి 20 నిమిషాలకు మహిళపై అత్యాచారం జరుగుతున్నదని వాపోయారు. ప్రతి 93 నిమిషాలకు ఒక గృహహత్య జరుగుతున్నదన్నారు. ఇలాంటి ఎన్నో సమస్యలపై మహిళలకు ప్రభుత్వ రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ మాట్లాడుతూ స్త్రీలు పరుషుల కంటే తక్కువేం కాదన్నారు. వివక్షతకు గురైనా మహిళలే నేడు కుటుంబాలను ఉన్నతంగా పోషిస్తున్నారని చెప్పారు. పని ప్రదేశాల్లో రోజురోజుకు వేధింపులు పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. మహిళలు పోషకాహార లోపానికి గురవుతూ అనేక సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి రాజ్యాంగం ఎన్నో చట్టాలను కల్పించినప్పటికీ అవి నీరుగారిపోతున్నాయన్నారు. జనవరి 27న అంబేద్కర్ కాలేజీలో నిర్వహించే శతకోటి ప్రజాగళం కార్యక్రమానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. సదస్సు అనంతరం మహిళలతో 'పౌరులందరి పౌర స్వేచ్ఛ రక్షణ.. రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలని.. రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలను రక్షించాలని.. మహిళల హక్కుల డిమాండ్లను బలపర్చడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని.. అన్యాయాలకు, అత్యాచారాలకు గురైన బాధితులు, వారి కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా వారి డిమాండ్లను బలపర్చుతామని.. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతి, పర్యావరణ తదితర రంగాల్లో స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లు, దళితులు, ఇతర అణగారిన వర్గాలు హింస, అణచివేత, వివక్ష, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనల నుంచి స్వేచ్ఛ కల్పించడానికి వారితో నిలబడతామని.. ఐక్యత, సమైక్యత, ప్రేమ, అహింస, శాంతి, భిన్నత్వాన్ని విస్తరించడంలో మహిళలు తమ పాత్రను బలంగా పోషించాలని..ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరక్కుండా మనం నిలబడాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు హైమావతి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్యుని జ్యోతి, వినోద, శశికళ, నాగలక్ష్మి, స్వర్ణలత, ఎంవీ ఫౌండేషన్ అవివేలు, అంకురం సంస్థ నుంచి సుమిత్ర ఉదితరులు పాల్గొన్నారు.

1000 మంది మహిళలతో భారీ ప్రదర్శన

దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 27 భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ తెలిపారు. 1000 మందికిపైగా పాల్గొనే ఈ ప్రదర్శన మధ్యాహ్నం 2 గంటలకు అంబేద్కర్ కాలేజీ నుంచి సుందరయ్య పార్కు వరకు జరుగుతుందని చెప్పారు. మేధావులు, అభ్యుదయవాదులు, మహిళలు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు భారీ సంఖ్యలు పాల్గొంటారని వివరించారు.

కిసాన్
నవతెలంగాణ



మానవుడు పండించిన మొదటి పంటల్లో చిరుధాన్యాలు ప్రధానమైనవి. వీటిని తక్కువ నీటితో రసాయన ఎరువులు, పురుగు మందుల అవసరం లేకుండా సహజంగా పండించవచ్చు. వరి, గోధుమలాగనే చిరుధాన్యాలు గడ్డిజాతికి చెందిన గింజలు. ఇవి ఆకారలంలో వరి, గోధుమ గింజలకంటే చిన్నగా, గుండ్రంగా ఉంటాయి.

చిరుధాన్యాల సాగు - సహజ పద్ధతులు

భారతదేశంలో 141.0 మిలియన్ హెక్టార్ల సాగు విస్తీర్ణంలో 177జిల్లాలకు పైగా విస్తరించిన 85.0 మిలియన్ హెక్టార్లు వర్షాధారమే. ఇది దేశంలోనే మొత్తం సాగు విస్తీర్ణంలో సుమారు 60 శాతం ఆక్రమించింది. దేశంలోని మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తిలో 44శాతం వర్షాధార వ్యవసాయం నుండే లభిస్తుంది. 75శాతం అపరాలు, 90శాతం పైగా జొన్న, చిరుధాన్యాలు, వేరుశనగ వర్షం లేని, సగం వర్షమున్న ప్రాంతాల నుండే ఉత్పత్తి అవుతున్నాయి. అనేక సంవత్సరాల నుండి చిరుధాన్య క్షేత్రాలు జొన్న, సజ్జ, కొర్ర, సామలు, అరికెలు, ఉదలుతోపాటు అపరాలు (కంది, అలసంద,చిక్కుడు, పెసర, మినుము) నూనెగింజలు,(నువ్వులు, కుసుమ, ఆవాలు,నైజర్) ఉత్పత్తి చేస్తున్నాయి.



చిరుధాన్యాల ఉత్పత్తికి అతికొద్ది నీరు అవసరం. ప్రస్తుతం పాలసీ ప్రోత్సాహకాలున్న సాగు నీటిలో పండించే వాణిజ్య సరుకుల పంటలతో పోలిస్తే చిరుధాన్య పంటలకు సాగు నీటి పారుదల అవసరం లేదు. చెరకు, అరటి, వంటి పంటల సాగుకు అవసరమయ్యే వర్షపాతంలో 25శాతం ఈ పంటల సాగుకు అవసరం. చిరుధాన్యాల పంటలను వివధ పర్యావరణ పరిస్థితులలో 15సెం.మీ లోతుకు తక్కువగా ఉన్న భూముల్లో వీటిని సంవత్సరం పొడవునా సాగు చేయవచ్చు.

పురాతన కాలపు పంటలు

అల్పవర్షపాత ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో సాగు చేస్తారు. వివిధ పరిస్థితుల్లో పండించడానికి అనుకూలం. నమ్మకమైన దిగుబడులను ఇస్తాయి. ప్రాంతీయ ఆహార, పోషక భద్రతనిచ్చే పంటలు. వాతావరణ మార్పులను తట్టుకుంటాయి. కంటింజెన్సీ ప్రణాళికకు అనువైన పంటలు. అధిక పోషకాలు గల గింజలు. పంటల వైవిధ్యం ఏర్పడుతుంది. పశువులకు నాణ్యమైన పశుగ్రాసం లభిస్తుంది. రైతులకు అధిక ఆదాయం, మెరుగైన జీవనం లభిస్తుంది.

కలుపు నివారణ- అంతర కృషి

విత్తిన 30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేస్తే పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి. విత్తిన రెండు వారాల్లోపు ఒత్తు మొక్కలను తీసేయాలి.

సస్యరక్షణ

పొలం చుట్టూ 3 వరుసల మొక్కజొన్న పంటను వేయాలి. ఎకరానికి 15 న ఉంచి 20 జిగురు పూసిన తెలుపు డబ్బాలను అమర్చాలి. బంతి, ఆముదం మొక్కలను ఎర పంటలుగా అక్కడక్కడ వేయాలి.

చిరుధాన్యాలను ఏ భూముల్లో పండించవచ్చు

అనేక చిరుధాన్యాలను అతితక్కువ సారవంతమైన భూముల్లో పండించవచ్చు. కొన్నింటిని అమ్లభూముల్లోనూ కొన్నింటిని చౌడు భూముల్లోనూ సాగు చేయవచ్చు. సజ్జ పంటను ఇసుక నేలల్లో కూడా సాగు చేసుకోవచ్చు. దీనికి తోగు రాగి పంటను కూడా సాగు చేసుకోవచ్చు. వరి పండని సమస్యాత్మక భూముల్లో కూడా ఊదలు పండుతాయి. ఈ భూములను సరిచేయడానికి కూడా చిరుధాన్యాల పంటను పండిస్తారు. మెట్ట ప్రాంతాల్లోని రైతుల భూముల ఎక్కువగా సారం లేని భూములే. మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయాన్ని సుస్థిర పరిచే పంటలు చిరుధాన్యాలే. పశ్చిమ ఆఫ్రికాలోని నిస్సార భూముల్లో కూడా పెరిగి దిగుబడులనిచ్చే సామర్థ్యం చిరుధాన్య పంటలకే ఉంది. సగటు వర్షపాతం 500మి.మీ కన్నా తక్కువ ఉన్న ప్రాంతాల్లో ఇసుక, ఆమ్ల నేలల్లో వర్షాభావ పరిస్థితులను తట్టుకుని దిగుబడులను ఇవ్వగల సమర్థవంతమైన పంటలు.

ఎలాంటి ఎరువులు వేయాలి?

మెట్ట భూముల్లో రసాయన ఎరువులు వాడకుండానే చిరుధాన్య పంటలు బాగా పెరుగుతాయి. అందువల్ల చిరుధాన్యాలను పండించే రైతులు పర్యావరణహిత పరిస్థితులో పశువుల ఎరువును ఉపయోగించి ఈ పంటలను పండిస్తారు. ఇటీవలి కాలంలో రైతులు తమ పెరటిలో స్వయంగా తయారు చేసుకున్న వర్మికంపోస్టును ఉపయోగించవచ్చు.

స్థానిక రకాల సాగు

పర్యావరణ పరిస్థితులలో స్థానిక రకాలను సాగు చేస్తే కొర్ర వంటి చిరుధాన్య పంటలకు పురుగులాశించవు. అందువల్ల పురుగు మందుల అవసరం ఉండదు. నిల్వ పరిస్థితులలో కూడా కొర్రవంటి పంటలకు నిల్వసమయంలో ప్యూమిగెంట్లను ఉపయోగించవలసిన అవసరం లేదు. పైగా వీటిని పెసర గింజల నిల్వలో ఉపురుగులాశించకుండా ఉపయోగించవచ్చు.

చిరుధాన్యాల పంట సరళి

సంప్రదాయ పద్ధతుల్లో పండించే చిరుధాన్య పంటలు కేవలం పంటలేకాక, ఈ చిరుధాన్య క్షేత్రాలలో జీవవైవిధ్య ముంటుంది. ఒకే పొలంలో ఒకేసారి 6 నుంచి 12 పంటలను సాగు చేస్తారు. దక్షిణ భారతదేశంలో పన్నెండు పద్ధతిలో చిరుధాన్య పంటలను అపరాలు, నూనెగింజల పంటలతో కలిపి సాగు చేస్తారు.

ఆహార భద్రత

వరి, గోధుమ వంటి పంటలు భారతదేశానికి ఆహార భద్రత అందిస్తే, చిరుధాన్యాలు ఆహారం, పోషకాలు, పశుగ్రాసాలు, పీచు, ఆరోగ్యం, జీవనాధారం, పర్యావరణం వంటి అనేక భద్రతలనిస్తాయి. అనేక చిరుధాన్యాల పంటల కాండలను పశువులు ఇష్టంగా తింటాయి. అనేకసార్లు జొన్న, సజ్జ వంటి పంటలను పశుగ్రాసాలుగానే సాగు చేస్తారు. చిరుధాన్యాలతో సహచర పంటలుగా పండించే కంది వంట చెరకుగాను, తోటకూర నార ఉత్పత్తికి ఉపయోగపతుంది. సహచర పంటలుగా పండించే లెగ్యూమ్ జాతి పంటలు ఆకులనురాల్చి సహజ ఎరువుగా భూసారాన్ని వృద్ధి చేస్తాయి. ఆ విధంగా చిరుధాన్య పంటలు భూసారాన్ని ఉపయోగించుకోవడమే కాకుండా భూమికి తిరిగి అందిస్తాయి.

మంచి ఆహారపు అలవాట్లే మనిషి ఆరోగ్యానికి చిరునామా. తీసుకునే ఆహారాన్ని బట్టి ఆరోగ్యాన్ని అంచనా వేయొచ్చు. ఎన్నో పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను ప్రజలు మర్చిపోయారు. దాని పర్యవసానంగా ఎన్నో ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. బీపీ, షుగర్ వ్యాధులు సాధారణమైనాయి. ఆహారంగా తీసుకునే అన్ని వస్తువుల్లోనూ కల్తీ నెలకొంటుంది. ఎక్కువ కాలం బతకడం కన్నా ఎక్కువ ఆరోగ్యంతో బతకడమనేది ఇప్పుడిప్పుడే అందరికీ అవగాహన కలుగుతున్నది. మంచి ఆహారం,అంతకు మించి ఆరోగ్యకరమైన ఆహారం దొరకడం చాలా కష్టమైపోతున్నది. సమాజానికి ఆరోగ్యభద్రతతోపాటు రైతుకు ఆర్థిక భద్రతనందించడంలో చిరుధాన్యాల పాత్ర గణనీయమైనది. జనానికి ఆరోగ్య స్పృహ పెరిగిన కారణంగా అందరి దృష్టి ఇప్పుడు చిరుధాన్యాల వైపు మళ్లింది. ప్రభుత్వ విధానాలు కూడా ఈ దిశలో అమలైతే రైతాంగం 60 ఏండ్ల నాటి వ్యవసాయ పద్ధతులను తిరిగి ఆచరిస్తారు. అలాగే ప్రజలకు విషాహారం తినవలిసిన అగత్యం తప్పుతుంది.



కె. రాములు
మార్క్‌ఫెడ్
జనరల్ మేనేజర్ (జీఎం)

ఆరోగ్య ప్రయోజనాలు

అందుబాటులో ఉన్న ధాన్యాల్లో చిరుధాన్యాలు అతి తక్కువ అలర్జి కలిగించి జీర్ణశక్తిని పెంచుతాయి. నీటిలో కరగని పీచు పదార్థం ట్రైగ్లిసరైడ్‌లను తగ్గిస్తుంది. నరాల వ్యవస్థకు మంచి కలిగించే లెసితిన్ అధిక పరిమాణాలలో ఉంటుంది. చిరుధాన్యాల్లో ఉండే మెగ్నీషియం మైగ్రేన్ అధిక రక్తపోటును, గుండెపోటును తగ్గిస్తుంది. టైప్ 2 డయబెటిస్‌ను తగ్గిస్తుంది. జన్యుకోడ్ నిర్మాణానికి ముఖ్యమైన న్యూక్లిక్ యాసిడ్‌లలో ఉండే భాస్వరం, ఎక్కువగా ఉంటుంది. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే స్త్రీలకు మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడడం, పిల్లలో అస్తమా సమస్యలు తగ్గుతాయి. మెనోపాజ్ తర్వాత స్త్రీలలో గుండె సమస్యలు, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి చిరుధాన్యాలు లాభం చేకూరుస్తాయి. అంతేకాకుండా బహుళ పోషకాలు కలిగిన లిగ్నాన్లు రొమ్ము క్యాన్సర్‌తో పోరాడి గుండె జబ్బులు రాకుండా కాపాడుతాయి.



పూలు పూయిద్దాం...



పాలీహౌసుల్లో సాగు చేస్తున్న పంటలను వేసవి వాతావరణ పరిస్థితుల నుంచి సంరక్షించేందుకు వీలుగా పలు మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగడం మొదలు కాగానే మెత్తటి సున్నాన్ని పల్చటి నీటిలో కలిపి పాలీహౌస్ పైభాగం మొత్తం తడిసేలా మధ్యాహ్నం పిచికారి చేయాలి. దీని వల్ల వెలుతురు ఎక్కువగా పరావర్తం చెండడం వల్ల పాలీహౌజ్ లోపల వేడిని తగ్గించవచ్చు. తొలకరిలో కురిసే వర్షాలకు సున్నం కరిగిపోతుంది. అంతేకాకుండా తేమ అధికంగా ఉండే ప్రాంతాల్లో పాలీహౌజ్ పై భాగంలో పచ్చటి నాచు పెరగడం, సంవత్సరంలో 2-3సార్లు వర్షాలు ఆగిన వెంటనే సున్నం పిచికారి చేసి పై భాగంలో పెరిగే నాచును పూర్తిగా నివారించవచ్చు. దీనివల్ల ఇతర కాలాల్లో సూర్యరశ్మి లోపలికి బాగా ప్రవేశిస్తుంది.

ఉష్ణోగ్రతల పెరుగుదలను అనుసరించి పాలీహౌజ్ పై భాగంలో ఏర్పర్చుకున్న షేడ్‌నెట్‌ను ఉదయం 10 గంటల నుండి 4 గంటల వరకు పూర్తిగా మూసివేయాలి. దీనివల్ల లోపలకు వెలుతురు ప్రసరణ 50శాతం వరకు తగ్గుతుంది. గత సంవత్సరం తెలుపు కాకుండా నలుపు రంగు షేడ్‌నెట్ ఉపయోగించిన పాలీహౌజ్‌ల్లో 2నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రత, తెలుపు షేడ్‌నెట్ కన్నా తక్కువగా ఉంది. పాలీహౌజ్ పైభాగంలో ఏర్పర్చిన షేడ్‌నెట్‌లను రాత్రిపూట పూర్తిగా తెరిచి ఉంచాలి. దీని వల్ల రాత్రి వీచే చల్లటి గాలితో పాలీహౌజ్‌లోపల వాతావరణం చల్లని గాలితో చల్లబడుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రిపూట పాలీహౌజ్‌లను మూసివేయరాదు. పాలీహౌజ్‌ల్లో నాలుగు వైపుల 35శాతం షేడ్‌నెట్ ఏర్పర్చి ఉంటుంది. వేసవి ఉష్ణోగ్రతలు పెరిగినపుడు దక్షిణ పడమరలో ఉన్న షేడ్‌నెట్‌ను పూర్తిగా పగలు, రాత్రి మూసి ఉంచాలి. దీనివల్ల మధ్యాహ్నం తర్వాత ఉండే ఎండ తీవ్రతను చాలా వరకు తగ్గించవచ్చు. కాలిబాటలో లావు ఇసుకను నాలుగు అంగుళాల మందంలో పోసుకుని, ఇసుకను ఎప్పుడూ తడిగా ఉండడం ద్వారా రెండు డిగ్రీల ఉష్ణోగ్రతను తగ్గించవచ్చు. వేసవి ఆరంభం నుంచి జర్బరా, కార్నేషన్ సాగు లాభసాటిగా ఉంటుంది. కానీ వాటి పూల కాడలను బాగా ఎత్తుగా పెరగడం లేక పొట్టిగా ఉండడం గమనించాలి. మొక్కల వేరు వ్యవస్థ ఉన్న మట్టి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెంటిగ్రేడ్ కన్నా తక్కువగా ఉండాలి. అందువల్ల కాలువలో ఉన్న ఇసుకను తడి పేటప్పుడు బెడ్ సైడులు కూడా తడిపి వేరు వ్యవస్థను చల్లబడేలా చూడాలి. ఫలితంగా ఇచ్చిన పోషకాలను సంగ్రహించుట వల్ల నాణ్యమైన పూలకాడలను పొందవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోను నీటితో తడపకూడదు.

వేసవిలో నీటి లవణాలు అధికమవడం వల్ల ఆకులు, పూలు మాడిపోయే అవకాశాలు ఎక్కువ. వేసవిలో పాలీహౌజ్‌లలో నీటి వినియోగం అధికంగా ఉంటుంది. అందువల్ల రోజు ఇచ్చే నీటిని రెండు దఫాలుగా ఉదయం, సాయంత్రం ఇవ్వాలి. ఒకేసారి ఇస్తే నీరు బెడ్స్ నుంచి కాలవలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి టిడిఎస్ విద్యుత్ ఛాలకత పీహెచ్/ఎస్ఏఆర్ వారానికి ఒకసారి పరీక్షించాలి. లేని పక్షంలో సూక్ష్మపోషకాల లోపం ఎక్కువగా కనిపిస్తుంది. తర్వాత నియంత్రణ కూడా కష్టమవుతుంది.

వేసవిలో బెడ్స్‌లోపల తడి ఎక్కువగా ఉన్నా, బెడ్ పైభాగం వేడి గాలుల వల్ల ఎండిపోతాయి. మొక్కల వేర్లు బెడ్ పై భాగంలో ఉండడం వల్ల ఇవి నీటిని సంగ్రహించే శక్తిని కోల్పోయి మొక్కలు ఎక్కువగా చనిపోతాయి. వేసవి ఆరంభంలో బెడ్‌పైన ముందుగా ఒక ఎకరానికి 6 టన్నుల వానపాముల ఎరువు, దానిపై కోకోపేట్ పర్చుకున్నా మంచి ఫలితం ఉంటుంది. బెడ్‌పై భాగం తేమను గ్రహించి వేర్లు, నీటిని ఎరువులను బాగా సంగ్రహించడం వల్ల మంచి పెరుగుదల ఉంటుంది. వేసవిలోకానీ ఇతర కాలాల్లోగానీ ఎరువులు ఇచ్చేటప్పుడు బెడ్‌లో నీటి విద్యుత్ చాలకత 3.0 ఉండేటట్టు చూడాలి. దానికనుగుణంగా ఎరువులు ఇచ్చిన తర్వాత ఎక్కువ నీరు ఇవ్వకూడదు. ఎక్కువగా ఇస్తే విద్యుత్ చాలకత తగ్గి ఎరువుల వినియోగం ఉండదు. పాలీహౌజ్‌లో పెంచే ఏ రకం పూల మొక్క నుంచి అయినా ఎండిపోయిన ఆకులు తప్ప మంచి ఆకులు ఏరివేయకూడదు. వేసవిలో కొత్త ఆకులు రావడం బాగా తక్కువ. జర్బరాలో ఎండిన ఆకులను మొక్క మొదలు నుంచి పూర్తిగా తీయాలి తప్ప ఆకు పైభాగం తీయకూడదు.

కార్నేషన్ మొక్కలలో ప్యుజేరియం అనే శిలీంద్రం వల్ల మొక్క మొదలు ఆకులు ఎండిపోయి కుళ్లిపోతుంది. ఈ తెగులు సాగు నీరు ఒక పద్ధతిగా లేనప్పుడు ఎక్కువగా వ్యాపిస్తుంది. దీని నివారణకు బెనోమిల్ 2.0 గ్రా. లేక అలైట్ 1.0గ్రా. లీటరు నీటిలో కలిపి మొక్క మొదలుకు పిచికారి చేసి నివారించుకోవచ్చు. కార్నేషన్ పూల సాగులో ఏ సమయంలోనైనా మొక్కకు ఒక కొమ్మ లేక రెండు చిగుర్లు వచ్చి ఉండాలి. చిగుర్లు లేకుండా ప్రతి కొమ్మను కత్తిరించేటప్పుడు 100 శాతం మొక్కలు చనిపోతాయి. అందువల పూల కోతలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

వేసవిలో ఎర్రనల్లి తామర పురుగుల బెడద ఎక్కువగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రత పరిస్థితులలో రసం పీల్చు పురుగుల జీవిత చక్రం కాలం బాగా తగ్గడం వల్ల తల్లి పురుగులు మందుల వల్ల నశించినా పిల్ల పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. అదువల్ల ఈ పురుగుల నివారణకు ఉదయం షాంపూ నీటితో మొక్కలపై పిచికారి చేసి, సాయంత్రం వాతావరణం చల్లబడినప్పుడు పురుగు మందులతోపాటు లీటరుకు 1 గ్రా పంచదారను కలిపి పిచికారి చేసినట్టయితే తీపిదనానికి పురుగులు ఆకర్షించబడి ఎక్కువ మొత్తంలో నివారణ సాధ్యమవుతుంది. పూలు కూరగాయలను పండించే పాలీహౌజ్‌లలో ఎట్టి పరిస్థితుల్లోనూ బెడ్స్‌పై మట్టిని కదిలించవచ్చు. వేర్లు కదిలితే మొక్కల పెరుగుదల కనిపించదు.

వేసవిలో సుడిగాలులు అకస్మాత్తుగా వచ్చే అవకాశాలుంటాయి. అందువల్ల పాలీహౌజ్ రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. సుడిగాలులు వచ్చే సూచనలున్నప్పుడు ప్లాస్టిక్ రోలర్ ఫిల్మ్ నలువైపులా అడుగు ఎత్తు తెరచి ఉంచడం ద్వారా గాలి సులభంగా లోపలి నుంచి బయటకు వెళ్లే ందుకు వీలుంటుంది. వేసవిలో కొత్త మొక్కలు నాటుకోవద్దు. నాటినా అధిక ఉష్ణోగ్రత వల్ల ఏపుగా పెరగవు. అంతేకాకుండా నాణ్యమైన పూల దిగుబడి రాదు. రైతులు పై విషయాలపై దృష్టిసారించి సమయానుకూలంగానూ వాతావరణ పరిస్థితులను బేరీజు వేసుకుని తగు విధంగా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పాలీహౌజ్‌లలో సాగు చేసే పంటనుండి నాణ్యమైన దిగుబడి పొందవచ్చు.



కె. భవ్యశ్రీ
అసిస్టెంట్ ప్రొఫెసర్ అగ్రికల్చర్ కాలేజీ, సిరిసిల్ల

పంటలు- తీసుకోవల్సిన జాగ్రత్తలు

వ్యవసాయం - వాతావరణం

గడిచిన మూడు రోజులలో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 28 నుంచి 34 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 09 నుంచి 20 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతారణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 26 నుంచి 34 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 13 నుంచి 21 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.

వరి: తెలంగాణలో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదైనట్టయితే వరి నారుమడిలో చలి ప్రభావం తగ్గించి నారు ఎదుగుదలకు పాలిథీన్ షీట్లతో నారుమడిని రాత్రిపూట కప్పి ఉదయం వేళల్లో తీసేయాలి. ప్రతి రోజు సాయంత్రం నారుమడికి నీరు పెట్టాలి. ఉదయం నీటిని తీసేయాలి. ఎకరం పొలానికి సరిపడే నారుమడికి 2 కిలోల యూరియా పైపాటుగా నారు విత్తిన 10 నుంచి 15 రోజుల్లో చల్లాలి. వరిలో నారుమడులలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను 200 చ.మీ నారు మడికి (5సెంట్లకు) ఒక కిలో చొప్పున నారు పీకడానికి వారం రోజుల ముందు చల్లుకోవాలి.

కంది: కందిలో మారుక మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు గమనించడమైంది. నివారణకు మారుక మచ్చల పురుగు 2.5 మి.లీ క్లోరి పైరిఫాస్ లేదా 0.75 మి.లీ. నోవాల్యూరాన్‌తో పాటు 1.0 మి.లీ డైక్లోరోవాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. శనగపచ్చ పురుగు నివారణకు ఈ కింది యాజమాన్య పద్ధతులను పాటించాలి.

1. శనగపచ్చ పురుగు లార్వాలను తినేందుకు వీలుగా ఎకరానికి 10 నుంచి 15 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.

2. పురుగుల ఉనికిని గమనించేందుకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చాలి.

3. పురుగు, గుడ్లు, తొలిదశ లార్వాల నివారణకు 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి.

మొక్కజొన్న: రబీ మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించినట్టు గమనించడమైంది. నివారణకు విషపు ఎర తయారు చేసుకోవడానికి గాను 10 కిలోల వరి తవుడులో 2 కిలోల బెల్లంను కలిపి 2నుంచి 3 లీ. నీటిని చేర్చి సుమారు 12 గంటల పాటు పులియనిచ్చి మరుసటి రోజు 100గ్రా. థైడికార్బ్‌ను కలుపుకొని ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలుగా చేసి మొక్క సుడులలో వేసుకోవాలి. ఎమమేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా థైమేమిథాక్సాన్ 9.5 శాతం, లాను సైహలోత్రిన్ 12 శాతం 0.5 మి.లీ లేదా క్లోరాన్‌ట్రినిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పైరు మొలిచిన 10 నుండి 15 రోజుల మధ్య మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైరు 25 నుంచి30 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి 3నుంచి 4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి.

ద్రాక్ష: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో పక్షికన్ను తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 3 గ్రా. ప్రొఫినెట్ మందును లీటరు నీటిలోకలిపి కత్తిరింపుల తరువాత 20 రోజులలోపు పిచికారి చేయాలి. ద్రాక్షలో పెంకు పురుగు గమనించడమైంది. నివారణకు 2.5 మి.లీ క్లోరిపైరాపాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో తామర పురుగులు ఆశించుటకు అనుకూలం. ఉధృతి గమనించి 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.



మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తేనె మంచు పురుగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1 మి.లీ డైక్లోరోవాస్, 2.5 మి.లీ వేపనూనె మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

నిమ్మ జాతి పంటలు: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నిమ్మజాతి పంటలో నల్లి ఆశించుటకు అనుకూలం. నివారణకు 3.0మి.లీ ప్రోపర్‌జైట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

జామ: జామ పండులో ఈగ ఉధృతి గమనించడమైంది. నివారణకు ఎకరానికి 4నుంచి 5 లింగాకర్షక బుట్టలను తోటలో అమర్చాలి.

మిరప: మిరపలో తామర పురుగు, నల్లి ఉధృతి గమనించినట్టయితే నివారణకు 1.5 గ్రా. డిఫెన్‌థయూరాన్ లేదా 2 మి.లీ క్లోర్‌ఫినాపిర్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మిరపలో గుండు ఈగ ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.5 మి.లీ ట్రైజోఫోస్ లేదా 2.5 మి.లీ క్లోరి పైరిఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్యుజేరియం ఎండు తెగులు సోకే సూచనలున్నాయి. నివారణకు 3 గ్రా. కాపర్‌ఆక్సిక్లోరైడ్ లేదా 1 గ్రా. కర్బెండజిమ్ మందును లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల దగ్గర నేల తడిచే విధంగా పిచికారి చేయాలి. మిరపలో వైరస్ తెగులు ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఈ వైరస్ వ్యాప్తి వాహకాలైన రసం పీల్చే పురుగులను అదుపు చేయాలి. ప్రస్తుత పరిస్థితులు మిరపలో కాయకుళ్లు, బూడిద తెగుళ్ల వ్యాప్తికి అనుకూలం. నివారణకు 3గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రా. పొపికొనజోల్ లేదా 3 గ్రా. పెరాక్యూలోసోబిన్, మేటిరామ్ లేదా 0.3 గ్రా నీటిలో కరిగే గంధకం లేదా 1 మి.లీ అజాక్సీ స్ట్రోబిన్ లేదా 0.4మైక్లోబ్యుటానిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కూరగాయలు: ప్రస్తుత పొడి వాతావరణ పరస్థితులలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఫిప్రోనిల్ 2మి.లీ లేదా థయోమిథాక్సిమ్ 0.3 గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు టమాటలో ఆకుమాడు తెగులు సోకుటకు అనుకూలం. తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1మి.లీ ప్రోఫికొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ఆలస్యంగా నాటిన టమాట పైరులో శనగ పచ్చ పురుగు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.25 మి.లీ నోవాల్యూరాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. టమాటలో తామర పురుగులు కూడా ఆశించేందుకు అనుకూలం. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వేసవి కాలం పంటగా టమాట, వంగ నారుమళ్లను పోసుకోవాలి.


సేకరణ : మోత్కూరు యాదయ్య



కండ్లలో సూర్యుడు! : వర్షంతో మ్యాచ్‌ను నిలిపివేయటం చూశాం, వెలుతురు లేమితో ఆట ఆలస్యం కావటం విన్నాం. కానీ సూర్యుడు కండ్లలో కొడుతున్నాడని ఆటను ఆపివేయటం ఇదే తొలిసారి కాబోలు. భారత్, న్యూజిలాండ్ తొలి వన్డేలో భారత్ ఇన్నింగ్స్‌లో ఆటను నిలిపి వేశారు. సూర్యాస్తమయం సమయాన సూర్యుడు బ్యాట్స్‌మెన్ కండ్లలో కాంతి కొట్టడంతో బంతి కనిపించటం కష్టమైంది. దీంతో ఐసీసీ నిబంధనల ప్రకారం అంపైర్లు ఆటను 30 నిమిషాల పాటు నిలిపివేశారు. 'నా జీవితంలో ఇటువంటి కారణంతో ఆటను నిలిపివేయటం ఇదే మొదటిసారని' అని భారత కెప్టెన్ కోహ్లి వ్యాఖ్యానించాడు. ఆట నిలిపివేసే సమయానికి భారత్ పది ఓవర్లలో 41/1తో ఉండగా, క్రీజులో ధావన్, కోహ్లి ఆడుతున్నారు. సూర్య కాంతి నేరుగా బ్యాట్స్‌మెన్ కండ్లపై ప్రభావం చూపించకుండా ఉండేందుకు క్రికెట్ పిచ్‌లను ఉత్తర-దక్షిణ దిశలో రూపొందిస్తారు. కానీ నేపియర్ పిచ్ తూర్పు-పడమర దిశలో ఉండటంతో ఈ సమస్య తలెత్తింది.

విరాట్‌కు విశ్రాంతి

ముంబయి : విరామం లేని క్రికెట్ ఆడుతోన్న సూపర్ స్టార్, భారత కెప్టెన్ విరాట్ కోహ్లికి సీనియర్ సెలక్షన్ కమిటీ విశ్రాంతినిచ్చింది. న్యూజిలాండ్‌తో చివరి రెండు వన్డేలు సహా టీ20 సిరీస్‌ల నుంచి కెప్టెన్ కోహ్లికి విశ్రాంతి లభించింది. ఈ మేరకు బీసీసీఐ బుధవారం ప్రకటనలో తెలిపింది. 'గత కొన్ని నెలలుగా కోహ్లి పని భారం గమనంలో ఉంచుకుని, ఆస్ట్రేలియాతో స్వదేశీ సిరీస్‌కు కోహ్లికి అవసరమైన విశ్రాంతి ఇచ్చేందుకు ఇదే అనువైన సమయం అని జట్టు మేనేజ్‌మెంట్, సీనియర్ సెలక్షన్ కమిటీ భావించాయి' అని బీసీసీఐ వెల్లడించింది. దీంతో ఆసియా ఆవల కోహ్లి లేకుండా భారత్ ఆడనుండటం ఈ దశాబ్దంలో (జింబాబ్వే మినహా) ఇదే తొలిసారి. తొలి మూడు వన్డేల అనంతరం కోహ్లి స్వదేశానికి తిరుగు పయనం అవుతాడు. రోహిత్ శర్మ చివరి రెండు వన్డేలు, టీ20 సిరీస్‌కు నాయకత్వం వహించనున్నాడు. ప్రపంచకప్ ప్రణాళికలో భాగంగా కీలక ఆటగాళ్లపై పని ఒత్తిడిని బీసీసీఐ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. స్టార్ బౌలర్ బుమ్రాకు న్యూజిలాండ్ సిరీస్ నుంచి విశ్రాంతి లభించగా, తాజాగా కింగ్ కోహ్లి వంతు వచ్చింది. స్వదేశంలో మార్చిలో ఆస్ట్రేలియాతో వన్డే, టీ20 సిరీస్ అనంతరం ఐపీఎల్ ఉండగా, ఆ వెంటనే 2019 ప్రపంచకప్ ఆరంభం కానున్న సంగతి తెలిసిందే.





అమ్మాయిల ఢీ

న్యూజిలాండ్, భారత్ తొలి వన్డే నేడు

నేపియర్ : భారత్, న్యూజిలాండ్ మూడు వన్డేల సిరీస్ నేటి నుంచి ఆరంభం కానున్నది. ర్యాంక్‌లో, ఫామ్‌లో తమకంటే మెరుగైన న్యూజిలాండ్ అమ్మాయిలో మిథాలీసేన తలపడనున్నది. 2017 వన్డే వరల్డ్‌కప్, 2018 టీ20 ప్రపంచకప్‌లలో బలమైన కివీస్‌ను ఓడించి, ఆ జట్టు టైటిల్ ఆశలకు తెరదించిన భారత్ అదే జోరు పునరావృతం చేయాలని భావిస్తోంది. కెప్టెన్ మిథాలీరాజ్ సహా హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతీ మంధానలు భారత్‌కు కీలకం కానున్నారు. బంతితో గోస్వామి, దీప్తి శర్మలు ప్రధాన పాత్ర పోషించనున్నారు. కివీస్ తరపున కెప్టెన్ సుజీ బేట్స్, గ్రీన్, కాస్పరెక్, పెర్కిన్‌లు ఫామ్‌లో ఉన్నారు. తొలి వన్డే ఉదయం 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం.



శిఖర్ ధావన్ 75 నాటౌట్

100 మహ్మద్ షమి వన్డేల్లో వంద వికెట్ల క్లబ్‌లో చేరాడు. గప్టిల్ వికెట్‌తో వందో వికెట్ తీసిన షమి, ఈ ఘనత వేగంగా సాధించిన భారత బౌలర్‌గా ఇర్ఫాన్ పఠాన్ (59)ను దాటేశాడు. షమి 57వ వన్డేలోనే వంద వికెట్లు కూల్చగా, జహీర్ ఖాన్ (65), అజిత్ అగార్కర్ (67), జవగళ్ శ్రీనాథ్ (68)లు తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

5000 వన్డేల్లో శిఖర్ ధావన్ 5000 పరుగుల మైలురాయి చేరుకున్నాడు. కోహ్లి (114) తర్వాత వేగంగా ఈ మార్క్ అందుకున్న భారత క్రికెటర్‌గా ధావన్ నిలిచాడు. ఓవరాల్‌గా బ్రియాన్ లారా (118)తో సంయుక్తంగా నాల్గో స్థానంలో ఉన్నాడు.

సీమ్, స్పిన్ ఉచ్చులో పడిన ఆతిథ్య కివీస్ విలవిల్లాడింది. భారీ స్కోర్లు ఊరించిన నేపియర్ వన్డేలో మహ్మద్ షమి (3/19), కుల్దీప్ యాదవ్ (4/39), యుజ్వేంద్ర చాహల్ (2/43) త్రయం విజృంభణతో ఆతిథ్య జట్టు 157 పరుగులకే కుప్పకూలింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ శిఖర్ ధావన్ (75 నాటౌట్), కెప్టెన్ కోహ్లి (45) రాణించటంతో భారత్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఐదు మ్యాచుల వన్డే సిరీస్‌లో బోణీ కొట్టి 1-0 ఆధిక్యం సాధించింది.

బోణీ మనదే

- తొలి వన్డేలో భారత్ గెలుపు
- షమి, కుల్దీప్, చాహల్ విజృంభణ
- రాణించిన ధావన్, కోహ్లి
- ఆతిథ్య న్యూజిలాండ్ చిత్తు

నేపియర్

చిన్న బౌండరీలు, ప్రత్యర్థి శిబిరంలో భారీ షాట్లు బాదటంలో సిద్ధహస్తులున్నారు. స్కోరు 300పైచిలుకు ఖాయమే. నేపియర్ వన్డేకు ముందు అంచనాలివి. విశ్లేషకులే కాదు, ఇరు జట్లలోనూ ఇదే భావన. కానీ భారత బౌలింగ్ దళం దండెత్తింది. బ్యాటింగ్ అనుకూల పరిస్థితుల్లో బంతితో మ్యాజిక్ చేసింది. సీమ్‌తో మహ్మద్ షమి, స్పిన్‌తో కుల్దీప్, చాహల్‌లు విరుచుకుపడగా తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 157 పరుగులకే చేతులెత్తేసింది. సహచరుల సహకారం లేకపోయినా కెప్టెన్ కానె విలియమ్సన్ (64, 81 బంతుల్లో 7 ఫోర్లు) అర్థ సెంచరీతో పోరాడాడు. రాస్ టేలర్ (24) ఫర్వాలేదనిపించాడు. స్వల్ప ఛేదనలో సూర్యుడు ఆటంకం కలిగించినా.. 34.5 ఓవర్లలోనే కోహ్లిసేన లక్ష్యాన్ని పూర్తి చేసింది. శిఖర్ ధావన్ (75 నాటౌట్, 103 బంతుల్లో 6 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీతో కదం తొక్కగా, కెప్టెన్ కోహ్లి (45, 59 బంతుల్లో 3 ఫోర్లు) రాణించాడు. న్యూజిలాండ్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి, ఆతిథ్య జట్టు కోరలు పీకిన మహ్మద్ షమి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండో వన్డే శనివారం మౌంట్ మౌంగానీలో జరుగనున్నది.సూర్యుడు కారణంగా ఆట అరగంట ఆలస్యం అయింది. దీంతో భారత్ లక్ష్యని డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 49 ఓవర్లలో 156 పరుగులకు సవరించారు.



కుల్దీప్ యాదవ్ (4/39)



పేస్, స్పిన్‌తో మ్యాజిక్ : బ్యాటింగ్ అనుకూల పిచ్‌పై టాస్ నెగ్గిన న్యూజిలాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. కానీ ఆరంభ ఓవర్లలో నాణ్యమైన స్వింగ్‌తో మహ్మద్ షమి మ్యాజిక్ చేశాడు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే ఆతిథ్య జట్టుకు గట్టి పంచ్ ఇచ్చాడు. వికెట్‌కు ఇరువైపులా బంతిని స్వింగ్ చేసిన షమి ఐదో బంతికి గప్టిల్ (5)ను సాగనంపాడు. ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకున్న బంతి నేరుగా వికెట్లను గిరాటేసింది. తన తర్వాతి ఓవర్లో మరో ఓపెనర్ మున్రో (8)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. 18/2తో న్యూజిలాండ్ ఆరంభంలోనే ఆత్మరక్షణలో పడింది. ఈ దశలో కెప్టెన్ విలియమ్సన్ (64), రాస్ టేలర్ (24, 41 బంతుల్లో 3 ఫోర్లు) ఆచితూచి ఆడారు. విలియమ్సన్ సహనంతో కనిపించినా.. చాహల్ వేగం తగ్గించి సంధించిన బంతులకు టేలర్ క్రీజు వదిలి ముందుకొచ్చి ఆడటం మొదలెట్టాడు. దీంతో మరింత స్లో బంతుల్ని విసిరిన చాహల్, టేలర్‌ను రిటర్న్ క్యాచ్‌తో సాగనంపాడు. మరికొద్ది సేపటికే టామ్ లాథమ్ (11) సైతం చాహల్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చుకున్నాడు. 76/4తో న్యూజిలాండ్ పూర్తిగా కష్టాల్లో కూరుకున్నది.

ఓ ఎండ్‌లో విలియమ్సన్ నిలిచినా, సహచరుల సహకారం లేకుండా పోయింది. ఫామ్‌లో ఉన్న నికోల్స్ (12) కెప్టెన్‌తో కలిసి పునర్ నిర్మాణ పనిలో నిమగ్నమయ్యాడు. 63 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసిన విలియమ్సన్ సైతం కివీస్ ఇన్నింగ్స్‌ను చివరి వరకూ ఆడేలా కనిపించాడు. కానీ జాదవ్ ఊరించే బంతికి మిడ్ వికెట్‌లో క్యాచ్ ఇచ్చుకుని నికోల్స్ నిష్క్రమించగా, కుల్దీప్ ఓవర్లో సిక్సర్ బాదబోయి విలియమ్సన్ వికెట్ కోల్పోయాడు. ఇక ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ ఎంతోసేపు నిలువలేదు. టెయిలెండర్లకు ఓ బంతిని స్పిన్ చేసి, మరో బంతిని నేరుగా సంధించి తికమక పెట్టిన (ధోని సలహాతో) కుల్దీప్ లోయర్ ఆర్డర్‌ను చకచకా సాగనంపాడు. బ్రాస్‌వెల్ (7), ఫెర్గుసన్ (0), బౌల్ట్ (1)లు కుల్దీప్ మాయలో పడిపోయారు. దీంతో 38 ఓవర్లలోనే న్యూజిలాండ్ కథ ముగిసింది.

ఆడుతూ పాడుతూ.. : స్వల్ప లక్ష్యాన్ని టీమ్ ఇండియా అలవోకగా ఛేదించింది. రోహిత్ శర్మ (11) త్వరగా నిష్క్రమించినా.. శిఖర్ ధావన్ (75 నాటౌట్), విరాట్ కోహ్లి (45)లు గెలుపు ఖాయం చేశారు. లక్ష్యం చిన్నదే కావటంతో రిస్క్ లేకుండా పరుగులు తీసిన ఈ జోడీ కివీస్ అవకాశాలను పూర్తిగా కొట్టిపారేసింది. ఆరు బౌండరీలతో 69 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన శిఖర్ ధావన్ పరుగుల దాహం తీర్చుకున్నాడు. గత తొమ్మిది ఇన్నింగ్స్‌ల్లో ధావన్‌కు ఇదే తొలి అర్ధ సెంచరీ కావటం విశేషం. మూడు ఫోర్లతో కోహ్లి మరో అర్ధ సెంచరీ దిశగా సాగినా, ఫెర్గుసన్ సూపర్‌స్టార్ వికెట్‌తో సంబురాలు చేసుకున్నాడు. తెలుగు తేజం అంబటి రాయుడు (13 నాటౌట్)తో కలిసి ధావన్ లాంఛనం పూర్తి చేశాడు.

స్కోరు వివరాలు :

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : మార్టిన్ గప్టిల్ (బి) షమి 5, కొలిన్ మున్రో (బి) షమి 8, కానె విలియమ్సన్ (సి) విజయ్ (బి) కుల్దీప్ 64, రాస్ టేలర్ (సి,బి) చాహల్ 24, టామ్ లాథమ్ (సి,బి) చాహల్ 11, హెన్రీ నికోల్స్ (సి) కుల్దీప్ (బి) జాదవ్ 12, మిచెల్ శాంట్నర్ (ఎల్బీ) షమి 14, బ్రాస్‌వెల్ (బి) కుల్దీప్ 7, టిమ్ సౌథి నాటౌట్ 9, ఫెర్గుసన్ (స్టంప్డ్) ధోని (బి) కుల్దీప్ 9, ట్రెంట్ బౌల్ట్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 1, ఎక్స్‌ట్రాలు : 02, **మొత్తం : (38 ఓవర్లలో ఆలౌట్) 157.**


వికెట్ల పతనం : 1-5, 2-18, 3-52, 4-76, 5-107, 6-133, 7-146, 8-146, 9-148, 10-157.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 5-0-20-0, మహ్మద్ షమి 6-2-19-3, విజయ్ శంకర్ 4-0-19-0, యుజ్వేంద్ర చాహల్ 10-0-43-2, కుల్దీప్ యాదవ్ 10-1-39-4, కేదార్ జాదవ్ 3-0-17-1.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) గప్టిల్ (బి) బ్రాస్‌వెల్ 11, శిఖర్ ధావన్ నాటౌట్ 75, విరాట్ కోహ్లి (సి) లాథమ్ (బి) ఫెర్గుసన్ 45, అంబటి రాయుడు నాటౌట్ 13, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం : (34.5 ఓవర్లలో 2 వికెట్లకు) 156.**

వికెట్ల పతనం : 1-41, 2-132.

బౌలింగ్ : ట్రెంట్ బౌల్ట్ 6-1-19-0, టిమ్ సౌథీ 6.5-0-36-0, లాకీ ఫెర్గుసన్ 8-0-41-1, బ్రాస్‌వెల్ 7-0-23-1, మిచెల్ శాంట్నర్ 7-0-32-0.



సైనా నెహ్వాల్

శుభారంభం

జకర్తా : ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో భారత బ్యాడ్మింటన్ స్టార్స్ శుభారంభం చేశారు. సైనా నెహ్వాల్, పి.వి సింధులు తొలి రౌండ్లో చెమటోడ్చగా, కిదాంబి శ్రీకాంత్ అలవోక విజయం సాధించాడు. 21-12, 21-8తో చెంగ్ ఫెంగ్ (మలేషియా)పై శ్రీకాంత్ నెగ్గాడు. 7-21, 21-16, 21-11తో దినార్ (ఇండోనేషియా)పై సైనా మూడు గేముల్లో గెలిచింది. సింధు.. చైనా షట్లర్ లీ జురేయ్‌పై 22-24, 21-8, 21-17తో పోరాడి గెలిచింది. సాయిప్రణీత్ 12-21, 16-21తో, కశ్యప్ 12-21, 16-21తో ఓటమి చెందారు. డబుల్స్‌లో సిక్కి రెడ్డి, అశ్విని జంట సైతం పరాజయం పాలైంది.

మెల్‌బోర్న్ పార్క్‌లో చివరి సెట్.. స్కోరు 1-5. ఎదురుగా 23 గ్రాండ్‌స్లామ్ విజేత సెరెనా విలియమ్స్. ఓటమి అంతరం తగ్గించాలని అనుకోవటమే సాహసం, కానీ ఆమె ఏకంగా నెగ్గాలనే యోచించింది. పవర్‌ఫుల్ సర్వ్‌లతో చెలరేగే సెరెనాతో తలపడుతూ, మానసికంగా ఓటమి అంగీకరించిన ఆమె చివర్లో పోరాడాలని నిశ్చయించుకున్నది. ఒక్కో పాయింట్ నెగ్గుతూ ఉండగా సెరెనాలో వణుకు ఆమెలో మరింత ఉత్సాహాన్ని నింపింది. వరుసగా నాలుగు మ్యాచు పాయింట్లు కాచుకుని, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలన విజయం సాధించిన ఆ క్రీడాకారిణి కరొలినా ప్లిస్కోవా. దిగ్గజ సెరెనాపై విజయంతో ఏడో సీడ్ ప్లిస్కోవా తొలిసారి మెల్‌బోర్న్ పార్క్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఏడు సార్లు విజేత సెరెనా క్వార్టర్స్ నుంచే నిష్క్రమించింది.

సెరెనాకు షాక్

- క్వార్టర్స్‌లో ప్లిస్కోవా సంచలన విజయం
- సెమీస్‌లో జకోవిచ్, ఒసాక, పౌలీ
- ఆస్ట్రేలియన్ ఓపెన్ 2019

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ సంచలన ఫలితాలతో దద్దరిల్లుతోంది. పురుషుల సింగిల్స్‌లో దిగ్గజ ఆటగాడు రోజర్ ఫెడరర్‌కు 20 ఏండ్ల గ్రీస్ కుర్రాడు షాకివ్వగా, మహిళల సింగిల్స్‌లో టెన్నిస్ యోధురాలు సెరెనా విలియమ్స్‌కు చెక్ రిపబ్లిక్ అమ్మాయి చెక్ పెట్టింది. రోజర్ ఫెడరర్ యువ సంచలనం జోరుకు తలొంచగా, తాజాగా సెరెనా విలియమ్స్ చేతుల్లోకి వచ్చిన విజయాన్ని జార విడుచుకున్నది. మూడు సెట్ల మ్యాచ్‌లో 6-4, 4-6, 7-5తో సెరెనా విలియమ్స్ (అమెరికా)పై కరొలినా ప్లిస్కోవా అద్భుత విజయం సాధించింది. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. జపాన్ అమ్మాయి నవోమి ఒసాక సైతం సెమీఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో జపాన్ కెరటం కియ్ నిషికోరి గాయంతో పోటీ నుంచి తప్పుకోగా టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) సులువుగా సెమీస్‌కు చేరుకున్నాడు. ఫ్రాన్స్ సంచలనం లుకాస్ పౌలీ జైత్రయాత్ర సెమీస్‌లోకి చేరింది. మిలోస్ రావోనిక్‌పై లుకాస్ సాధికారిక విజయం సాధించాడు.

సెరెనా చేజేతులా..! : మహిళల సింగిల్స్‌లో బుధవారం అతి పెద్ద సంచలనం నమోదైంది. మరో నిమిషంలో సెరెనా విలియమ్స్ సెమీఫైనల్లోకి అడుగుపెట్టడం ఖాయమే అనుకుంటున్న తరుణంలో..మ్యాచ్ ఊహించని మలుపు తిరిగింది. తొలి సెట్‌లో 4-6తో ఓడిన సెరెనా, తర్వాతి సెట్‌ను 6-4తో గెల్చుకున్నది. నిర్ణయాత్మక సెట్‌లో కరొలినా ప్లిస్కోవా సర్వ్‌లను బ్రేక్ చేసిన సెరెనా వరుస పాయింట్లతో 5-1తో విజయం ముంగిట నిలిచింది. కానీ ఇక్కడే మ్యాచ్ టర్న్ అయ్యింది. ఉన్నట్టుండి పట్టుబిగించిన ప్లిస్కోవా శక్తినంతా కూడగట్టుకుని పోరాడింది. ఒత్తిడిలో అనవసర తప్పిదాలకు చోటిచ్చిన సెరెనా చూస్తుండగానే ఆధిక్యం కోల్పోయింది. ప్లిస్కోవా నాలుగు మ్యాచు పాయింట్లను కాచుకుని 7-5తో సెరెనాపై సంచలన విజయం సాధించింది. 12 ఏస్‌లు సంధించిన సెరెనా, చివర్లో ఒత్తిడిలో నాలుగు డబుల్ ఫాల్ట్స్‌కు పాల్పడింది. ఒత్తిడి నుంచి సెరెనా తేరుకునే లోపే ప్లిస్కోవా సెమీస్ బెర్త్ ఎగరేసుకుపోయింది. సెరెనా 54 విన్నర్లు సాధించగా, ప్లిస్కోవా 32కే పరిమితమైంది. కానీ ప్లిస్కోవా 15 అవనసర తప్పిదాలతో పోల్చితే విలియమ్స్ 37 అనవసర తప్పిదాలు సెమస్ బెర్త్‌ను సెరెనాకు దూరం చేశాయి. మరో క్వార్టర్‌ఫైనల్లో జపాన్ చిన్నది నవోమి ఒసాక అలవోక విజయం సాధించింది. 6-4, 6-1తో ఎలినా స్విటోనా (ఉక్రెయిన్)పై వరుస సెట్లలో గెలుపొందింది. ఎనిమది ఏస్‌లు సంధించిన ఒసాక, ఐదు బ్రేక్ పాయింట్లు సాధించి సెమీస్‌కు చేరింది.


జకోవిచ్ కష్టపడకుండా.. : పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) చెమట పట్టకుండా సెమీస్‌కు చేరుకున్నాడు. ఎనిమిదో సీడ్ జపాన్ ఆటగాడు కియ్ నిషికోరితో మ్యాచ్‌లో కష్టపడకుండానే గెలుపొందాడు. క్వార్టర్స్‌లో 6-1, 6-4తో ఉండగానే నిషికోరి గాయానికి గురయ్యాడు. ఫిజియో సాయం తీసుకున్నప్పటికీ ఆట కొనసాగించేందుకు వీలు పడలేదు. దీంతో జకోవిచ్‌కు వాకోవర్ లభించింది. సెమీస్‌లో అతడికి యువ సంచలనం లుకాస్ పౌలీ సవాల్ ఎదురు కానున్నది. మరో క్వార్టర్‌ఫైనల్లో ఫ్రాన్స్ చిన్నోడు లుకాస్ పౌలీ 7-6(7-4), 6-3, 6-7(2-7), 6-4తో రావోనిక్‌పై గెలుపొందాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో విజయం కోసం పౌలీ చెమటోడ్చాడు. తొలి సెట్‌నే టైబ్రేకర్‌లో నెగ్గిన పౌలీ, తర్వాత ఓ సెట్‌ను కోల్పోయినా సాధికారిక విజయమే సాధించాడు.



జకోవిచ్




ప్లిస్కోవా



సెరెనా విలియమ్స్

మీరు కూడా దిగులుగా ఉన్నారా
కీళ్ళ నొప్పి, వాపు & బిగుతు నుండి
చింతించాల్సిన అవసరంలేదు, ఈరోజే 'డా. ఆర్థో ఆయుర్వేదిక్ ఆయిల్, ఆయింట్‌మెంట్, (స్ప్రే & క్యాప్సుల్స్'
కొనండి ఇది అరుదైన హెర్బ్స్ మిశ్రమము & ఇప్పుడు కీళ్ళ నొప్పిలో ప్రభావంతమైనది.
భారతదేశంలో నమ్మదగిన బ్రాండ్



కీళ్ళ నొప్పులకు అద్భుతమైన ఔషధం
Dr. Ortho
Ayurvedic Oil & Capsules
నేను శ్యామ దేవి. 41 సం॥ల వయస్సు, గత కొన్ని సంవత్సరాల నుండి నాకు తీవ్రమైన కీళ్ళ నొప్పి మరియు కండరాల నొప్పి ఉండేది . అప్పుడు, ఒక రోజు నా కుమారుడు నా కోసం ఆయుర్వేదిక్ డా. ఆర్థో ఆయిల్ తెచ్చాడు. ఆయిల్‌తో రోజుకు రెండు సార్లు మసాజ్‌చేశాను. ఇప్పుడు నేను పూర్తిగా కోలుకున్నాను.
Chhattisgarh
నేను దినేష్ చంద్ర అగ్రవాల్. 61 సంవత్సరాల వయస్సు. నేను చాలా గొప్ప పేరుగల పాత్రల షోరూమ్ కలిగియున్నాను. నేను తీవ్రమైన వెన్ను నొప్పి మరియు కీళ్ళ నొప్పులు కలిగియుండేవాడిని. ఒక రోజు, నేను ఆయుర్వేద డా.ఆర్థో క్యాప్సూల్స్ యొక్క ప్రకటన చూశాను. రోజు 2-2 క్యాప్సుల్స్ చొప్పున ఉదయం మరియు సాయంకాలంలో పాలతోపాటు తీసుకొన్నాను. కొన్ని వారాల్లోనే కీళ్ళ నొప్పులు మరియు తక్కువ గా ఉన్న వెన్ను నొప్పిలో చాలా మంచి మెరుగుదల కనిపించాయి.
Uttar Pradesh
24x7 Helpline: 0171-3055100 www.drorthooil.com Available at all medical & general stores

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.